మంగళవారం
08 జనవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 290

www.vijayakranthinews.com

విజయక్రాంతి

నిజం నిర్భయం నిష్పక్షం

హైదరాబాద్ | PUBLISHED SIMULTANEOUSLY FROM HYDERABAD, NIZAMABAD, KHAMMAM | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



దూసుకొస్తున్న నభా! 10

అగ్రవర్ణ పేదలకు 10% రిజర్వేషన్లు

మోదీ ఎన్నికల బ్రహ్మాస్త్రం

- ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల నిర్ధారణ
- సార్వత్రిక ఎన్నికల ముందు కీలక నిర్ణయం తీసుకున్న కేంద్ర కేబినెట్
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, 16కు సవరణలు చేయనున్న కేంద్ర ప్రభుత్వం
- ఈబీసీ కోటాపై లోక్‌సభలో నేడు బిల్లు, జనరల్ ఓటింగ్
- మొదట విద్య, ఉద్యోగాల్లో 10% రిజర్వేషన్ల కల్పన
- వార్షికాదాయం రూ. 8 లక్షల లోపున్న అగ్రవర్ణాల పేదలకు అవకాశం
- ఆమోదం పొందితే 59.5 శాతం దాటిపోనున్న కోటా



(ఫైల్)

విజయక్రాంతి, న్యూఢిల్లీ: మరో రెండు నెలల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన అమ్ముల పొదిలో నుంచి సరికొత్త అస్త్రాన్ని సంధించారు. లోక్ సభ ఎన్నికల్లో అగ్రవర్ణ ప్రజలను తమ వైపు తిప్పుకునేందుకు సంచలన నిర్ణయం తీసుకున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈబీసీ ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లను 10 శాతం నిర్ణయిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, 16కు కేంద్ర ప్రభుత్వం సవరణలు చేయనుంది. ఈబీసీ కోటాపై మంగళవారం లోకసభలో జనరల్ ఓటింగ్ జరిగే అవకాశముంది.

అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడినవారికి 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి విద్య, ఉద్యోగాల్లో 10శాతం కోటా కల్పించనున్నారు. వార్షికాదాయం రూ.8లక్షల లోపు ఉన్న అగ్రవర్ణాలకు చెందినవారంతా ఈ కోటా పరిధిలోకి వస్తారు. ఈ మేరకు రాజ్యాంగ సవరణ బిల్లును రేపు కేంద్రం పార్లమెంట్ ముందు పెట్టే అవకాశం ఉంది. చాలా కాలంగా ఈ డిమాండ్ ఉండగా.. ఎన్నికలకు ముందే కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ బిల్లు కోసం మంగళవారంతో ముగియనున్న పార్లమెంట్ సమావేశాలను రెండు రోజులపాటు పొడిగించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

కేబినెట్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని అమలు చేయాలంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, 16లకు సవరణలు చేయాల్సి ఉంటుంది. వ్యక్తికి రూ.8లక్షల కంటే తక్కువ వార్షిక ఆదాయం, 5 ఎకరాల కంటే తక్కువ సొంత వ్యవసాయ భూమి, వెయ్యి చదరపు అడుగుల కంటే తక్కువ విస్తీర్ణంలో ఇల్లు, నోటిఫైడ్ పురపాలిక పరిధిలో 109 గజాల కంటే తక్కువ నివాస స్థలం, నోటిఫైడ్ కాని మున్సిపాలిటీ పరిధిలో 209 గజాల కంటే తక్కువ స్థలం ఉన్నవారిని ఆర్థికంగా వెనుకబడిన వారిగా పరిగణిస్తారని తెలుస్తోంది. వీరికి రిజర్వేషన్ వర్తించే అవకాశం ఉంటుందని సంబంధిత వర్గాల నుంచి సమాచారం. ఇప్పటి వరకు రిజర్వేషన్ వల్ల ఎలాంటి ప్రయోజనం పొందని ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈ రిజర్వేషన్లు అందుతాయని తెలుస్తోంది. కుల ఆధారిత రిజర్వేషన్లు 50శాతం మించకూడదని గతంలో సుప్రీంకోర్టు వెల్లడించింది. అయితే ఈ పది శాతం రిజర్వేషన్ల పై సవరణలను పార్లమెంటు ఆమోదిస్తే కోటా 50శాతం దాటి పోనుంది.

10 శాతం రిజర్వేషన్లపై హాట్‌హాట్‌గా చర్చ: ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈబీసీ రిజర్వేషన్లపైనే చర్చ..! అగ్రవర్ణాల్లోని పేద ప్రజలకు 10 రిజర్వేషన్లు కల్పించాలన్న కేంద్ర చారిత్రాత్మక నిర్ణయంపై హాట్‌హాట్‌గా చర్చ జరుగుతోంది. అగ్రకులాల్లో ఉన్న పేద ప్రజలు మోదీ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లకు తమ కల సాకారమైందంటూ సంబరాలు చేసుకుంటున్నారు. ఐతే ఈబీసీ రిజర్వేషన్లకు ఎవరు అర్హులు? ఏ ప్రాతిపదికన ఆర్థికంగా వెనకబడిన తరగతులుగా గుర్తిస్తారు? ఎంత ఆదాయం ఉండాలి? ఎన్నెకరాల లోపు భూమి ఉండాలి? ఆ వివరాల జాబితా దిగువన ఇస్తున్నాం.

ఈబీసీ రిజర్వేషన్లకు ఎవరెవరు అర్హులు?

- వార్షికాదాయం రూ.8 లక్షల లోపు ఉన్న అగ్రవర్ణ పేదలు ఈబీసీ రిజర్వేషన్లకు అర్హులు
- అగ్రవర్ణాల పేదలు ఎవరైనా ఐదు ఎకరాలకు మించి వ్యవసాయ భూమి ఉంటే వారికి ఈబీసీ రిజర్వేషన్ వర్తించదు.
- సొంత నివాస గృహం కలిగి ఉంటే అది వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణం లోపే ఉండాలి.
- రెసిడెన్షియల్ ప్లాట్ల విషయంలోనూ కేంద్రం నిబంధనలు విధించింది.
- మున్సిపాలిటీలలో 109 చదరపు గజాలకు మించి రెసిడెన్షియల్ ప్లాట్లు ఉండకూడదు.
- నాన్ మున్సిపాలిటీల్లో 209 చదరపు గజాలకు మించి రెసిడెన్షియల్ ప్లాట్లు ఉండకూడదు.



ఢిల్లీ గద్దెను నిర్ణయించే

శక్తి రావాలి

- అసెంబ్లీ గెలుపు సామాన్యమైనది కాదు
- బీజేపీ, కాంగ్రెస్ అగ్రనేతలనే జనం తిరస్కరించారు
- టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించిందని, ఆ విజయం సామాన్యమైనది కాదని టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో నాగార్జున సాగర్ నియోజకవర్గానికి చెందిన వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో అఖండ విజయాన్ని అందించిన మీ అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ భారీ విజయం సామాన్య విజయం కాదు. ఓటుతోనే కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు బుద్ధి చెప్పారు. నల్లగొండలో ఫ్లోరోసిస్ సమస్యపై టీఆర్ఎస్ పోరాడితే ఆనాడు మంత్రులుగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డి పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. నల్లగొండ జిల్లాలో 2 లక్షల మంది జీవచ్ఛవాలుగా ఉన్నా కిరణ్ కుమార్‌రెడ్డి సర్కార్ పట్టించుకోలేదన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి సొంత జిల్లా చిత్తూరుకు 9వేల కోట్లు తీసుకుపోతుంటే కాంగ్రెస్ మంత్రులు నోరు (తరువాయి 4లో)


అన్ని పార్టీలలో రిజర్వేషన్ ప్రకంపనలు

విజయక్రాంతి, ఢిల్లీ: లోక్ సభ ఎన్నికలను ముంగిట్లో పెట్టుకుని మోదీ సర్కార్ సంధించిన 'ఈబీసీ రిజర్వేషన్' అస్త్రం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఇది కీలకం కానున్నట్టు బీజేపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత రిజర్వేషన్లు 50% తగ్గించకుండా అదనంగా 10% ఇస్తున్నందువల్ల ఇతర వర్గాల నుంచి అభ్యంతరాలు రావని అంటున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయాన్ని వ్యతిరేకించనప్పటికీ ప్రతిపక్షాలు దీనిని ముందుకు తెచ్చిన సమయాన్ని ప్రశ్నిస్తున్నాయి. నాలుగున్నరేళ్ల పాటు ఏం చేశారని నిలదీస్తున్నాయి. ఇదో ఎన్నికల జిమ్మిక్కని అంటున్నాయి.

నాలుగున్నరేళ్లూ ఏం చేశారు...కాంగ్రెస్



అగ్రవర్ణాల రిజర్వేషన్ల బిల్లు తేవాలన్న కేంద్ర కేబినెట్ నిర్ణయాన్ని కాంగ్రెస్ ఎన్నికల స్టంటుగా తేల్చేసింది. రిజర్వేషన్లు 50% మించరాదని సుప్రీంకోర్ట్ తీర్పునిస్తే 10% అదనంగా ఎలా పెంచుతారని కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వి ట్విట్టర్‌లో పెట్టిన పోస్టులో అడిగారు. ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు కూడా రిజర్వేషన్ కోటా కల్పించాలనుకుంటున్న కేంద ప్రభుత్వ నిర్ణయంపై కాంగ్రెస్ మండిపడింది.. రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతోనే బీజేపీ ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చిందని అన్నారు. మోడీ ప్రభుత్వం ఇలాంటి కొత్త భంగిమలతో ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. నాలుగున్నరేళ్లకు పైగా అధికారంలో ఉన్న మోడీకి ఇప్పుడే ఈ సంగతి ఎందుకు గుర్తొచ్చిందని సంఘ్వి ప్రశ్నించారు. 2019 ఎన్నికలకు పట్టుమని మూడు నెలలు కూడా గడువులేని సమయంలో ఇలాంటి ప్రకటనలు కేవలం ప్రజలను మభ్యపెట్టడంలో భాగమేనని ఆరోపించారు. రిజర్వేషన్ల కోటా 50 శాతం మించకూడదని రాజ్యాంగం నిబంధన ఉండగా ఎవరిని మోసం చేయడానికి ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని ఆయన నిలదీశారు. మోడీ, బీజేపీ నాయకుల అభిప్రాయంలో ప్రజలంటే గడ్డితినే పశువులని, ఏది చెప్పినా నమ్మే బుద్ధిని లేని వారేనని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రామనే భయం బీజేపీకి పట్టుకుందనడానికి సాధ్యం కాని ఈ ప్రకటనే నిదర్శనమని సింఘ్వి పేర్కొన్నారు. తమిళనాడు, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, తదితర రాష్ట్రాల్లో సైతం రిజర్వేషన్లకు సంబంధించిన ప్రతిపాదనలు న్యాయస్థానాల ముందున్నాయని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల వ్యూహంలో భాగంగా బీజేపీ గెలుపే లక్ష్యంగా ఇలాంటి తాయిలాలతో ప్రజల ముందుకు రావాలని చూస్తోందని అభిషేక్ సింఘ్వి విమర్శించారు.



న్యాయపరమైన అనేక చిక్కులున్నాయి...యశ్వంత్ సిన్హా

అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై మాజీ ఆర్థిక, విదేశాంగ శాఖ మంత్రి యశ్వంత్ సిన్హా ఘాటుగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ (తరువాయి 4లో)



నామినేటెడ్ ఎమ్మెల్యేగా

స్టీఫెన్‌సన్

విజయక్రాంతి, హైదరాబాద్: ఎల్విస్ స్టీఫెన్సన్‌ను మరోసారి అదృష్టం వరించింది. తెలంగాణ శాసనసభకు నామినేటెడ్ సభ్యుడిగా స్టీఫెన్సన్‌ను నియమిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. కేసీఆర్ సమక్షంలో సోమవారం ప్రగతి భవన్‌లో మంత్రివర్గ సమావేశం జరిగింది. ఎమ్మెల్యేలతో పాటే ప్రమాణ స్వీకారం చేయడానికి వీలుగా అసెంబ్లీలో నామినేటెడ్ సభ్యుడి నియామకం జరపాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు గవర్నర్‌కు కేబినెట్ ప్రతిపాదనలు పంపడం, గవర్నర్ వెంటనే ఆమోదం తెలపడం అంతా కొన్ని క్షణాల్లోనే జరిగిపోయింది. వెంటనే గెజిట్ కూడా విడుదలైనట్లు సమాచారం. స్టీఫెన్సన్ రెండు తెలుగు రాష్ట్రాల్లో చాలా సుపరిచితమైన వ్యక్తి. ఓటుకు నోటు కేసులో ఈయన పేరు దేశవ్యాప్తంగా మార్మోగిన విషయం తెలిసిందే. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఆయనకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి లంచం ఇవ్వజూపి ఏసీబీ అధికారులకు పట్టుబడడం, ఆ తర్వాత జరిగిన పరిణామాలు అందరకు తెలిసిందే. స్టీఫెన్సన్‌ను తిరిగి అదే పదవి వరించ డం, ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పరిణామాలతో మరల ఓటుకు నోటు కేసు తెరమీదకు రానుందా అనే అనుమానాలు మాత్రం మొదలయ్యాయి.

ఈ టర్మ్‌లోనే ప్రాజెక్టులన్నీ పూర్తి



- కృష్ణా, గోదావరి నీటివాటాను పూర్తిగా వినియోగిస్తాం
- ప్రాజెక్టులు పూర్తిచేస్తామనే ప్రజలు మరోసారి అధికారమిచ్చారు
- ఒక్క ప్రాజెక్టునైనా జాతీయ స్థాయిలో కేంద్రం గుర్తించాలి
- ఇరిగేషన్ శాఖ సమీక్ష సమావేశంలో సీఎం కేసీఆర్

విజయక్రాంతి, హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ కోసం విధి విధానాలు రూపొందించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా గోదావరి, కృష్ణా బేసిన్లలో రాష్ట్రానికున్న నీటి వాటాను వినియోగించుకునే వ్యూహం అమలు చేయాలన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం వస్తేనే, ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి, సాగునీళ్లు అందిస్తారనే విశ్వాసంతో ప్రజలు తమకు మరోసారి అవకాశం ఇచ్చారన్నారు. ప్రజల సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ కోసం విధి విధానాలు రూపొందించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధికారులను ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, ఈ టర్మ్ లో అన్ని ప్రాజెక్టులు నూటికి నూరు శాతం పూర్తి చేస్తామన్నారు. దీనికి అధికారులు, వర్క్ ఏజన్సీలు సహకరించాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు మాదిరిగానే పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని శరవేగంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ప్రాజెక్టుల నిర్మాణానికి బడ్జెట్లో నిధులు కేటాయించడంతో పాటు ఇతర ఆర్థిక సంస్థల నుంచి కూడా నిధులు సేకరిస్తామని చెప్పారు. ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత కూడా వాటి నిర్వహణ కోసం అవసరమైన నిధులను బడ్జెట్లో కేటాయిస్తామని వెల్లడించారు. రైతులకు సాగునీరు ఇవ్వడంతో పాటు పరిశ్రమలకు, మంచినీటికి కూడా ఎంత నీరు అవసరమవుతుందో లెక్కకట్టి, ఏ ప్రాజెక్టు నుంచి ఎంత నీరు వాడాలో నిర్ణయించాలన్నారు.

చెరువులను నింపేందుకే తొలి ప్రాధాన్యత

ప్రాజెక్టుల నుంచి వచ్చే నీటితో మొదట చెరువులు నింపడానికే ప్రాధాన్యత ఇవ్వాలని సిఎం ఆదేశించారు. దీనికోసం ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఏ ప్రాంతంలో అయినా ప్రాజెక్టు పనులు పూర్తి కావడానికి ఆలస్యమైనా సరే, చెరువులు నింపడానికి కావాల్సిన ఏర్పాట్లు మాత్రం యుద్ధ ప్రాతిపదికన జరగాలని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రగతి భవన్లో ముఖ్యమంత్రి కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఇటీవలే అన్ని ప్రాజెక్టుల పనులను స్వయంగా సందర్శించి వచ్చిన రిటైర్డు ఇంజనీర్లు, వివిధ ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు, ప్రభుత్వ ముఖ్య అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రతీ ప్రాజెక్టు పురోగతిపై రిటైర్డు ఇంజనీర్ల బృందం ముఖ్యమంత్రికి వివరించింది. ఈ సందర్భంగా ఎక్కడ ఏ లోపం ఉందో చర్చించి, అక్కడికక్కడే లోపాన్ని సవరించడానికి అధికారులకు సూచనలు చేశారు. పనుల్లో జాప్యం జరుగుతున్న చోట, జాప్యానికి కారణాలు తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపారు. పనుల్లో నిర్లక్ష్యం (తరువాయి 4లో)



నేడు, రేపు సార్వత్రిక సమ్మె

- బ్యాంకులకు తాళాలు.. బస్సులు బంద్

విజయక్రాంతి, హైదరాబాద్: సార్వత్రిక సమ్మెకు కార్మిక సంఘాలు సన్నద్ధమయ్యాయి. జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా 8, 9 తేదీల్లో కార్మికులు, ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొననున్నారు. సమ్మెలో పాల్గొనడానికి వివిధ విభాగాల ప్రభుత్వ ఉద్యోగులు నిర్ణయం తీసుకున్నారు. దీంతో బ్యాంకులకు తాళాలు పడనున్నాయి. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం కానున్నాయి. జాతీయ కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నా.. ట్రేడ్ యూనియన్ బిల్లు–2018 సవరణ తేవడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. దీనికి వ్యతిరేకంగా గతంలో జాతీయ కార్మిక సంఘాలు సమ్మె చేసినా.. కేంద్రం పట్టించుకోకుండా ముందుకు సాగుతోంది. 40 చట్టాలను కుదించి 11 చట్టాలకే పరిమితం చేయడానికి సన్నద్ధమైంది. దీంతో కార్మికుల హక్కులను హరిస్తోందని, ఈ బిల్లు ఆమోదం పొందితే కార్మిక సంఘాల ప్రమేయం లేకుండా పోతుందని అన్ని సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ చట్టం ద్వారా కార్మికులను, ఉద్యోగులను అణిచివేసేందుకు కేంద్రం ప్రయత్నం ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా10 జాతీయ కార్మిక సంఘాలు రెండు రోజుల పాటు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయి. సమ్మెలో భాగంగా భారత్ బంద్, రైల్ రోకో, రోడ్ రోకో, నిరసన ప్రదర్శనలు, ఇతర ఆందోళనలు చేపట్టనున్నారు. బంద్‌లో పబ్లిక్ సెక్టార్, చిన్న పరిశ్రమలు, ప్రైవేట్ రంగ ఉద్యోగులు, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాల ఉద్యోగులు కూడా ఈ సమ్మెలో పాల్గొంటారు. పాఠశాల (తరువాయి 4లో)

దిమాక్ ఖరాబ్



రాజేంద్రనగర్‌లో జోరుగా చెరువుల కబ్జాలు

- పట్టించుకోని అధికారులు
- రాజకీయ నాయకుల ఒత్తిళ్ళతో కబ్జాలపై కన్నెత్తి చూడని అధికారులు



విజయక్రాంతి, రాజేంద్రనగర్: రాజకీయ నాయకుల అండదండలు.. అవినీతి అధికారుల చేతివాటం వెరసి రాజేంద్రనగర్ నియోజకవర్గంలో భూ కబ్జాదారులు బరి తెగిస్తున్నారు. కబ్జాకు కాదేది అనర్హం అన్నట్లుగా చెరువులు, కుంటలు, స్మశానవాటికలు, వరదనీటి కాలువలు, పార్కులు, పాఠశాలల స్థలాలను సైతం వదలక యథేచ్ఛగా కబ్జాదారులు కోట్ల విలువైన స్థలాలను కబ్జాలు చేస్తున్నారు. గతంలో కంటే టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భూ కబ్జాలకు అదుపులేకుండా పోయిందని పలువురు ఆరోపించారు. నియోజకవర్గం పరిధిలో గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారులు, నాయకులు తమ కార్యకలాపాల్లో ఉండగా అదే అదునుగా విచ్చల విడిగా కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు కబ్జాదారుల పాలయ్యాయి. నేటి భూ కబ్జాలను పరిశీలిస్తే ఈ ప్రభుత్వంలో రెవెన్యూ విభాగం ఉందా...? ఉంటే రెవెన్యూ అధికారులు భూ కబ్జాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు అనేది అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం, హైటెక్ సిటీ, సాఫ్ట్, ఐటీ కంపెనీలకు నెలవైన గండిపేట మండలం పరిధిలోని గ్రామాలు, కాలనీల్లో రాజకీయ పలుకుబడితో కోట్ల విలువైన వందల ఎకరాల ప్రభుత్వ భూములు, చెరువులు, వరద నీటి కాలువలు, స్మశానవాటిక (తరువాయి 4లో)

అందని ద్రాక్షను..

అందుకున్న కోహ్లీ సేన

- 72ఏళ్ల తర్వాత ఆసీస్ గడ్డపై సిరీస్‌ను వశం చేసుకున్న భారత్
- నాలుగో టెస్ట్ డ్రా..
- 4 టెస్ట్‌ల సిరీస్‌లో 2–1 తేడాతో కోహ్లీ సేన కైవసం
- పుజారాకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్

12





శుభోదయం

ఓం శ్రీ గురుభ్యోనమః


శ్రీ విళంబి నామ సంవత్సరం
దక్షిణాయణం
హేమంత ఋతువు
పుష్య మాసం

సూర్యోదయం	: ఉ. 06:48
సూర్యాస్తమయం	: సా. 05:57
పక్షము	: శుక్ల పక్షం
తిథి	: విదియ11:54 తదుపరి తదియ
నక్షత్రం	: శ్రవణం 23:41
యోగం	: వజ్ర 28:36
కరణం	: కౌలవ 11:54 తైతుల 25:15
రాహుకాలం	: మ. 03:08, 04:30
యమగండం	: రా. 09:37, 11:00
వర్జ్యం	: తె. 04:12, 06:01
అమృతకాలం	: ప. 11:57, మ: 01:45



సూక్తి సుధ

ఇతరులు ఎలాగ ఉండాలని అనుకుంటామో అలాగే మనం కూడా ఉండాలి.
-పితాశ్రీ ప్రజాపిత బ్రహ్మాబాబా



తిరుప్పావై పాశురం-24

ఒరిత్తి మగనాయ్ పిఱందు ఓరిరవిల్
ఒరిత్తి మగనాయ్ ఒళిత్తు వళర,
తరక్కిలా నాగిత్తాన్ తీంగునినైంద
కరుత్తైప్పిళ్ళైప్పిత్తుక్కగన్ వయిత్రిల్
నెరుప్పెన్న నిన్ర నెడుమాలే! యున్నై
అరుత్తిత్తు వందోం, పఱై తరుతియాగిల్
తిరుత్తక్క సెల్వముం సేవగముం యాంపాడి
వరుత్తముం తీరందుమగిళిందు ఏలో రెంబావాయ్



"ఆనాడు బలిచక్రవర్తి తనది కాని రాజ్యాన్ని తాను ఆక్రమించి దేవతలను బంధించగా ఈ త్రైలోక్య రాజ్యాన్ని బలి నుండి దానంగా గ్రహించి పాదాలతో కొలిచిన మీ దివ్యపాదారవిందాలకు మంగళం.

రావణాసురుడు సీతను అపహరించగా రావణుని నివాసమగు లంకకేగి సుందర భవనాలు, కోటలు గలది, దక్షిణదిశ అందున్న లంకానగరాన్ని ధ్వంసంచేసి అక్కడి రాక్షసులను సంహరించిన మీ భుజబలానికి మంగళం.

శ్రీ బాలగోపాలుని రక్షణ కోసం ఉంచిన బండిలో ఆవేశించిన రాక్షసుని వధించుటకు ఆ బండికి తాకునట్లుగా కాలు చాచి నేలకూల్చిన మీ అసమాన కీర్తికి మంగళం.

దూడ రూపంలో వచ్చిన రాక్షసుడు దారిలో ఉన్న కపిత్థాసురుడు (వెలగచెట్టు) నీకు కీడు చేయ సంకల్పించి రాగా దానిని తెలిసిన నీవు వత్సాసురుని వడిసెల రాయి విసిరినట్లుగా వెలగచెట్టు పైకి విసిరినపుడు ముందు వెనుకలకు వంచి ఉంచిన మీ దివ్యపాదాలకు మంగళం.

ఇంద్రుడు తన యాగాన్ని భంగపరిచినందుకు కోపించి రాళ్ళవాన కురియగా గోపాలురను గోవులను కాపాడుటకు గోవర్ధన పర్వతాన్ని గొడుగుగా ఎత్తిన మీ వాత్సల్యానికి మంగళం.

శత్రువులను సమూలంగా నశింపచేసే విజయాన్ని తెచ్చిపెట్టు. నీ చేతిలోని వేలాయుధానికి మంగళం. ఇట్లు నీ పలు వీరచరితాలను నోరారా స్తుతించి మా నోముకు కావలసిన వరం గ్రైకొనడానికి వచ్చాము. మమ్ము అనుగ్రహించు."ఈ పాశురం 'మంగళాశాసన పాశుర'మని ప్రసిద్ధి. గోపికలు కోరినట్లుగానే శ్రీకృష్ణభగవానుడు శయ్యామందిరం నుండి సభా మందిరానికి నడిచి వచ్చి సింహాసనం మీద కూర్చొనెను. అప్పుడు ఎర్రటారి కందిన అతని పాదాలను చూసిన గోపికల హృదయం కలత చెందింది. ఆ స్వామికి క్షేమం, శుభం కలగాలని మంగళం పాడుతున్నారు ఈ పాశురంలో. అమంగళాలు తొలగి మంగళాలు కలగాలని కోరుకోవటాన్ని మంగళాశాసనం అందురు.

ఇది చూడటానికి ఇతరులకు పిచ్చిపని వలె కనిపిస్తుంది. కాని విశిష్టాద్వైత సిద్ధాంతానికి ఇది అత్యంత ముఖ్య కార్యం. ఆచార్యులు శిష్యులను స్వీకరించుటం భగవన్మంగళాశాసనమును అభివృద్ధి కోసమేనని 'శ్రీవచన భూషణం' అని నిర్ణయించారు. ఈ మంగళాశాసన కైంకర్యం భక్తులకు ప్రపన్నులకు తప్ప ఇతరులకు తెలియరాని పరమ రహస్యం.

చేతనానికి రెండు దశలుండును. జ్ఞానదశ ప్రేమ దశయని. జ్ఞాన దశలో అతని రక్షణను కోరుతాం. ప్రేమ దశలో అతనికి మనమే రక్షకులమని భావిస్తాం. ఈ ప్రేమ దశలో చేసేదే మంగళాశాసనం.

'ఉపదేశరత్నమాల'లో వరవరమునులు
'మంగళాశాసనత్తిల్ మత్తుళ్ళ ఆళ్వార్ కళ్'

అను పాశురం శ్రియపతికి మంగళాశాసనం చేసినందున ఇతరాళ్వారుల కంటె శ్రీ విష్ణుచిత్తులను పెరియాళ్వారుగా పేర్కొన్నారు అని సాధించిరి. ఈ నియమానుసారంగానే లక్ష్మణుని 'ఇళై పెరుమాళ్' అని గుహుని 'గుహపెరుమాళ్' అని వ్యవహరిస్తున్నారు.

శ్రీమద్రామాయణ బాలకాండలో దశరథుడు, జనకుడు, విశ్వామిత్రుడు, అయోధ్యావాసులు, కౌసల్యాదేవి, అయోధ్యాకాండలో – సీతాపిరాట్టి, అరణ్యకాండలో ఋషులు – జటాయువు, కిష్కింధకాండలో – ఆంజనేయులు, శ్రీ విష్ణుపురాణంలో నందగోపుడు, వసుదేవుడు, దేవకి, శ్రీమన్మహాభారతంలో – విదురుడు, ధర్మరాజు, భీష్ముడు.

ఇదే విధంగా ఇతరత్రా ధనుర్దాసు మొదలగువారు మంగళాశాసనం గావించారు,

ఇచట 'బలి' అనగా అహంకారం. అహంకార మమకారాలు ప్రకృతికి కవల పిల్లలు. తల్లి సొత్తు ప్రపంచాన్ని ఆక్రమించి తమదే యని గర్విస్తున్నారు. వాస్తవంగా ఇదంతా పరమాత్మది. ఇట్టి అహంకారాన్ని తొలగించేది శ్రీపాదరేణువే. ఇదే మొదటి పాదానికి అంతరార్థం. అనగా శ్రీపాదసుధను గోలిన భక్తులకు అహంకార మమకారాలు ఉండవు.





కేవలం అహంకారాన్ని తొలగించిన చాలదు. అహంకారానికి పుట్టిల్లగు ప్రకృతి కూడా తొలగిపోవాలి. అది రెండో పాదంలో చెప్పారు. ఇక్కడ లంక అనగా శరీరం. ఆ శరీరంలోని మనస్సే రావణుడు. ఆ రావణుని పది తలలే పది ఇంద్రియాలు. పరమాత్మ మన శరీరంలో అంతర్యామియై, అహంకారం పుట్టు మనస్సును విషయ భోగాలకు పనికి రాకుండా పాడుచేసి, ఆ మనసును పాలించు రాజసాన్ని రావణుని చంపి సాత్త్వికాన్ని విభీషణుని నిలిపి తనను కొలిచేట్టు చేయటమే లంక వృత్తాంతం.

దేహాత్మ వివేకం లేనపుడే అహంకారం ఉదయించును. అవిద్యా సంబంధం వలనే మనకు అవివేకం కలుగును. అనగా వివేకం తొలగును. అవిద్యా సంబంధంచే కర్మ కలుగును. ఆ కర్మను నశింపచేయుటయే శకటాసుర వృత్తాంతం.

'బండి' మనను ఒకచోట నుండి ఇంకొక చోటికి చేర్చును. ఆత్మను ఒక శరీరం నుండి వేరొక శరీరానికి చేర్చేది కర్మయే కదా! దీని రెండు చక్రాలు ఉత్తర, పూర్వాఘములు. 'శం కటయతి' అనగా సుఖాన్ని నశింపచేయునది అని అర్థం.

ఈ కర్మ భగవత్పాదస్పర్శతోనే తొలగును.

అహంకారం, కర్మ నశించినను రుచి వాసనలు నశింపవు. లోపల రుచి, వాసన రూపంగా ఉండి సమయానికి బయటపడును.

ఇక్కడ రుచి – వత్సాసురుడు – దూడ ప్రతి దానిని రుచి చూస్తుంది.

వాసన – కపిత్థాసురుడు – కపిత్థమనగా వెలగపండు. వెలగపండు వాసన సుప్రసిద్ధమే కదా. మొదట రుచి, తరువాత వాసన నశించాలి. అనగా రుచితో వాసన తొలగాలి. వత్సాసురునితో కపిత్థాసురుని సంహరించుటలోని ఆంతర్యం ఇదే.

ఇక గోవర్ధనం నెత్తుటలోని ఆంతర్యం చూద్దాం. దేవేంద్రుడు కురిపించిన రాళ్లవాన అనగా విషయ వ్యామోహం. ఒక్కొక్క రాయి ఒక్కొక్క ప్రాణిని చంపును. ఒక్కొక్క విషయం ఒక్కొక్కని నశింపచేయును. విషయ వ్యామోహం నశింపచేయకుండా ఉండాలంటే గోవర్ధన ఎత్తాలి. గోవర్ధన ఎత్తుట అనగా గోవు అనగా వాక్కు, వర్ధనమంటే పెంపుట, వాక్కును పెంపుట అనగా, 'రాముడను నేను' 'కృష్ణుడను నేను' అనెడి భావం తొలగి ప్రతి పదం శరీరం వరకు మాత్రమేకాక ఆత్మవరకు వెళ్లాలి. అనగా ప్రతిపదృష్టులో ప్రకృతి 'జీవుడు' పరమాత్మ అందురు. రాముడు అనగా రామరూప శరీరంతో చేరి ఉన్న ఆత్మకంతర్యామి అయిన పరమాత్మ అని అర్థం. ఇట్లు వాక్కునకు అర్థాన్ని పరమాత్మ వరకు తెలుపటాన్ని గోవర్ధనమెత్తుట. ఇట్లు పరమాత్మ వరకు తెలిసినవాడు విషయ వ్యామోహం తనకు తానుగానే నశించును. అనగా హాని చేయజాలదు. ఇదే గోవర్ధన వృత్తాంతం.

శ్రీకృష్ణుడు భగవానునిగానే కాక ఆచార్యునిగా కూడా ఉపదేశం చేసెను కదా! కావున శ్రీకృష్ణుని చేతిలోని ఆయుధం ఆచార్యుని ఉపదేశముద్ర. ఈ ఉపదేశం సర్వం పరమాత్మకంగా బోధించును. కాన శత్రుత్వ భావన ఏ విధంగా ఉంటుంది. శత్రుత్వ భావన తొలగుటమే శత్రునాశనమని అర్థం.

ఈ పాశురంలో 'పోత్తి' అని ఆరుమార్లు చెప్పారు. భోజనంలో షడ్రసాలు ఆనందాన్ని ఇచ్చునట్లు ఇక్కడ ఆరుమార్లు స్తుతించిన ఆనందం కలుగును. ఆరు రుచులున్నట్లే మనకు అరిషడ్వర్గాలు ఉన్నాయి. ఒక్కొక్కటి తొలగటానికి ఒక్కొక్క పోత్తి అని తెలుస్తుంది. శత్రు నిర్మూలనమే అంతరార్థమని తెలుపుటకే చివరికి శత్రువుల విషయం ఉదహరించారని తెలియాలి.

– డా|| బాలుశర్మ పన్నాల (వేద పండితులు)

శాంతచిత్తులు ఎప్పుడూ సుఖంగా ఉంటారు

చాణక్యం

శ్లో॥ సంతోషామృత తృప్తానాం యత్సుఖం శాన్తచేతసామ్!
న చ తద్ ధనలుబ్ధానా మితశ్చేతశ్చ ధావతామ్॥

సంతోషమనెడు అమృతముతో తృప్తిచెందినట్టి శాంతచిత్తులకెట్టి సుఖం కలదో అట్టి సుఖం, శాంతి ఇటునటు పరుగెత్తు ధనలోభులకు ఉండదని ప్రముఖ నీతిశాస్త్రజ్ఞులు చాణక్యులవారు తెలుపుతున్నారు. ఇంకా ఈ విషయంపై పతంజలి మహర్షి తన యోగశాస్త్రంలో ఇలా తెలియచేస్తున్నారు.

సంతోషా దనుత్తమ సుఖలాభః

సంతోషం వల్ల సర్వశ్రేష్ఠమైన సుఖాలు లభించును. ఇంకో కవి కూడా దీనిపై మరో వివరణ ఇచ్చారు.

అర్థీ కరోతి దైన్యం లబ్ధార్థో గర్వమపరితోషం చ।
నష్టధనశ్చ స శోకం సుఖమాస్తే నిస్పృహః పురుషః॥


యాచకుడు దైన్యాన్ని ప్రదర్శిస్తాడు. ధనవంతుడు గర్విగా ఉంటాడు. అధికంగా ఇష్టమైన కోరికలు గలవాడిగా ఉంటాడు. ధన నష్టం పొందినవాడు ఎప్పుడూ శోకిస్తూనే ఉంటాడు. నిస్పృహుడు (సంతోషం కలవాడు) సుఖంగా ఉంటాడు.

చాణక్యులవారు ఎల్లప్పుడూ సంతోషాన్ని కోరుకుంటూ తృప్తిగా తమ పనులు చేసుకుంటూ ఉండేవాళ్లు శాంతంగా ఉండే మనస్తత్వం కలవారని చెబుతూ, ఎల్లప్పుడూ సంపాదన కోసం ఆరాటపడుతూ ఇంకా సంపాదించాలి, ఇంకా సంపాదించాలి అని అటు ఇటూ పరుగెత్తు మనస్తత్వం కల ధనలోభులకు శాంతిచిత్తం, సంతోషమనేది వారి జీవితంలో ఉండదని తెలియచేస్తున్నారు. పతంజలి మహర్షి తన యోగశాస్త్రంలో ఇలా చెబుతున్నారు. ఎల్లప్పుడూ సంతోషంగా ఉండేవాళ్లకు ఏమీ కోరుకోకుండానే సర్వవిధాల సౌఖ్యాలు లభిస్తాయంటున్నారు. మరొక కవి కూడా ఇలా చెబుతున్నారు. యాచకులు నిరంతరం దైన్యాన్ని ప్రదర్శిస్తూ అడుక్కుంటూనే ఉంటారు. అలా లేనియెడల వారికి ఎవరూ సహాయం చేయరు. ఆ ప్రవృత్తి వారిలో ఎల్లకాలం ఉంటుందంటున్నారు. ఇక ధనం అధికంగా సంపాదించిన వారు అహంకారపూరితంగా ఉంటూ తమకన్నా తక్కువస్థాయిలో ఉన్నవారిని ఏమాత్రం పట్టించుకోని స్థితిలో ఉంటాడు. ఇకానొక స్థితిలో ధనవంతులు ఏమాత్రం నష్టపోయినా ఎల్లప్పుడూ విచారిస్తూనే ఉంటారంటున్నారు. ఇంక ఏ కోరికలు లేని వాడు ఎల్లకాలం సంతోషంగానే ఉంటారంటున్నారు.

- యామిజాల సుబ్రహ్మణ్యం

జప తపాలు

నిన్ననే నొక పెద్దమనిషి వచ్చాడిక్కడికి, సద్బ్రాహ్మణుడు. అయిన మాటల వల్లా మెళ్ళో ఉన్న రుద్రాక్షమాలవల్లా, మంత్ర జపపరాయణుడని తెలుస్తున్నది. భగవాన్ విరూపాక్ష గుహలో ఉండగా ఒకసారి దర్శించానని చెప్పాడు. ఈ మధ్యాహ్నం శ్రీవారిని సమీపించి "స్వామీ! పంచాక్షరిగాని తారకంగాని, ఏదో ఒక మంత్రం జపిస్తూ ఉంటే సురాపానాది దోషాలన్నీ హరింపగలవా?" అని ప్రశ్నించాడు. "అంటే ఏమిటి మీ ఉద్దేశ్యం" అన్నారు భగవాన్, 'పైన చెప్పిన మంత్రాలు జపిస్తూ ఉన్నవారు జారత్వ చోరత్వ సురాపానాదులు చేసినా, ఆ మంత్ర జపం వల్ల ఈ దోషాలు హరింపబడగలవా? ఆ పాపము వారిని అంటకుండునా?" అని మళ్ళీ తర్కించి అడిగాడా విప్రుడు.



"నేను జపిస్తున్నాననే భావం లేకుంటే, వీటివల్ల కలిగే దోషం వారి కంటదు. నేను జపిస్తున్నాననే భావం ఉన్నప్పుడు దురభ్యాసాలవల్ల కలిగే పాపం మాత్రం ఎందుకంటదు?" అన్నారు భగవాన్. "ఈ పుణ్యం ఆ పాపాన్ని హరింపదా?" అన్నాడా బ్రాహ్మణుడు. "నేను చేస్తున్నాననే అహం భావమున్నంతవరకు దేనికది అనుభవింపవలసిందే. ఒకదానితో వేరొకదాన్ని కప్పిపుచ్చటం ఎట్లా పొసగుతుంది? నేను చేస్తున్నానే భావన పోయినప్పుడు తనకేదీ అంటదు. తానెవరో తెలుసుకుంటేగాని నేను చేస్తున్నాననే భావన పోదు. తన్నుదానరసిన వానికి జపమేది? తపమేది? ప్రాబ్ధవశంగా శరీరయాత్ర సాగుతుందేగాని వాడొక్కదానిని ఇచ్ఛింపడు. ప్రారబ్ధం అనేది ఇచ్ఛా ప్రారబ్ధం, అనిచ్ఛాప్రారబ్ధం, పరేచ్ఛా ప్రారబ్ధం అని మూడు విధాలు గదా? తన్నుదా నెరిగిన తత్త్వజ్ఞునకు ఇచ్ఛా ప్రారబ్ధం లేనేలేదు. అనిచ్ఛా, పరేచ్ఛా రెండే ఉంటవి. వారు ఏది చేసినా పరుల కొరకే. ప్రారబ్ధానుసారం చేయవలసిన పనులుంటే చేస్తారుగాని తత్ఫలితం వారి నంటదు. అటువంటి వారు ఏది చేసినా పుణ్యపాపములు లేవు. అయితే వారు ఎప్పుడు లోకాన్ననుసరించే నడుస్తారుగాని అవతవక పనులు చేయరు' అని యుక్తియుక్తముగా సెలవిచ్చారు భగవాన్.

"తన్నుతా నెఱిగిన ఇచ్ఛాప్రారబ్ధం లేనే లేదు. అనిచ్ఛా, పరేచ్ఛా రెండే వుంట"వని ఆ పృచ్ఛకులకు సమాధానంగా భగవాన్ చెప్పారేగాని వారి యథార్థ సిద్ధాంతం 'ఉన్నది నలుబది' అనుబంధమందు ఎట్లా విశదీకరించారో చూడు.

-సూరి నాగమ్మ
(రమణాశ్రమ లేఖలు)

ధర్మ సందేహాలకు సమాధానాలు

అహల్యను రాయిగా మారమని శాపమివ్వడంలో ఏమైనా అంతరార్థం ఉందా?



బలమైన కామ దృష్టితో పురుషసంగమం చేసిందని అహల్యపై ఆరోపణ. అందుకు గౌతముడు ఆమెను రాయిగా మారమని శపించాడు. శ్రీరాముని పాదధూళితో శాపవిమోచనం జరుగుతుందని చెప్పడంలో అంతరార్థం ఉంది.

ఒక మనిషి తనకు యోగ్యమైన క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని వదలి, దుష్ట మార్గంలో ప్రవర్తించడం ప్రకృతివిరుద్ధం. ఈ తప్పుకు శిక్షగా అహల్యరాయిగా మారిదంటే ఎలాంటి సుఖభోగాలు లేకుండా నిర్వికారంగా పడి ఉండటమన్నమాట. శ్రీరామునిలాంటి ఆదర్శపురుషుని పాదధూళి సోకడం అంటే గొప్పవారి సాంగత్యం వల్ల బుద్ధి మారిపోవడమే శాపవిమోచనం కలిగింది.

శ్రీ కృష్ణుడికి పాండవులకు బంధుత్వం ఎక్కడిది?



పాండవుల తల్లి కుంతీదేవి శ్రీకృష్ణుని మేనత్త. శ్రీకృష్ణుడి తండ్రి వసుదేవుడు, కుంతీదేవి ఇద్దరూ – శూరుడు అనే యాదవరాజుకు జన్మించారు. కుంతీదేవి మొదటిపేరు పృథ. (పృథకుమారుడు కాబట్టి అర్జునుడు పార్థుడు) శూరుని మేనత్త కొడుకు కుంతీభోజుడు పృథను పెంచుకొన్నందువల్ల ఆమె కుంతిగా మారింది. శ్రీకృష్ణుని తండ్రికి సోదరియైన కుంతి కుమారులు పాండవులు కాబట్టి శ్రీకృష్ణుడు పాండవులకు ఆ విధంగా బంధువుగా మారాడు.

'గ్రహ సాధన కోష్టకే' గ్రంథ ముద్రణ

వేద విజ్ఞానం

భాగం-73

శక.1772లో నానా "గ్రహ సాధన కోష్టకే" అనే గ్రంథాన్ని, మరాఠి భాషలో, ఇంగ్లీషు, ఫ్రెంచి ఖగోళశాస్త్ర గ్రంథాల సహాయంతో సంకలనం చేసి, శక.1782లో ముద్రించాడు. (క్రీ.శ 1860). ఇంతకు ముందు ఇటువంటి గ్రంథం సంస్కృతంలోగాని, మరాఠిలోగాని లేకపోవడంతో, ఇది అత్యుత్తమ స్థాయికి చెందినదిగా పరిగణిస్తున్నారు. (క్రీ.శ. 1808లో ఆర్.ఎస్.విన్స్ రాసిన గ్రంథాన్ని ఆధారం చేసుకొని ఈ పుస్తక సంకలనం జరిగినదని కృష్ణశాస్త్రి గాడ్జొలే పేర్కొన్నాడు.)

ఇందులో సూర్యసిద్ధాంతంలో చెప్పిన సంవత్సర ప్రమాణమే గ్రహించారు. గ్రహస్థితులు, గతులు సాయన పద్ధతి ప్రకారం స్వీకరించారు. అందుచే ఈ విలువల ఆధారంగా కనుగొనబోయే గ్రహస్థితులు, గతులు కూడా సాయన పద్ధతికి చెందినవే అవుతాయి. ఇందులో సారవర్ష ప్రవృత్తిని (జీటాపీషియంను) రేవతీ నక్షత్రంగా గ్రహించాడు. అది శక 496లో వసంత విషువత్తుతో ఏకీభవించింది. నిర్ణయ పద్ధతిలో గ్రహస్థితులు కావలసినచో, ఆ సంవత్సరం నాటి అయనాంశాన్ని సున్నాగాను, వార్షిక అయనాంశచలనాన్ని 50.1" చొప్పున గ్రహించి గణితాన్ని చేసుకోవలసినదిగా సూచించాడు. దీనిమూలంగా, సంవత్సర ప్రమాణాన్ని 365రో–15ఘ–23 పలలుగా గ్రహించినట్లవుతుంది. ఈ సంవత్సర ప్రమాణాన్ని, 50.2"ను అయనాంశ చలనంగాను గ్రహించి, నానా శక.1787 నుండి నాటికల్ ఆల్మనాక్ సాయంతో పంచాంగములను ముద్రించడం ప్రారంభించాడు. కీ.శే. ఆబాసాహేబ్ పట్వర్ధన్ విశేషంగా సహాయం చేయడంతో ప్రతి సంవత్సరం పంచాంగ ముద్రణ సాధ్యపడేది. అందువల్లనే నానా పంచాంగానికి పట్వర్ధనీయ పంచాంగం అనే పేరు పెట్టాడు. నానా గణితంతో సాధించిన గ్రహస్థితులు తప్పులు లేకుండా ఖచ్చితంగా ఉన్నాయి. అయితే ఈ నానా రచించిన గ్రంథము, పట్వర్ధనీయ పంచాంగం ప్రస్తుతం ఉపయోగంలో లేవు. దీనిని ఎవ్వరు పాటించు లేదనే చెప్పవచ్చును. దీనిని పంచాంగాలు అనే చోట మరింత వివరంగా చూడవచ్చును.

తిథిసాధన చేయడానికై తిథిచింతామణిని అనుసరిస్తూ ఒక గ్రంథాన్ని నానా సంకలనం చేయడం జరిగింది. ఇది వారణాసిలో ముద్రించబడింది. ఈ ప్రాంతంలో దీనిని ముద్రించడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఇది ముద్రణ అయ్యిందనే విషయం తెలియదు.

దీనితో పాటు గ్రహసాధనకు ఉపయోగపడగల కోష్టక్ గ్రంథం కూడా ఈనాడు లభించుటలేదు. ఈ గ్రహసాధనలో నక్షత్ర సంవత్సరాన్ని తీసుకోక, గ్రహస్థితులను మాత్రం సాయన పద్ధతిలో చూపడం జరిగింది. ఈ కారణంచేత, ఏ పక్షం వారు కూడ దీని ప్రకారం గ్రహసాధన చేయటం కుదరలేదు. గ్రహలాఘవంలో పూర్తిగా నిర్ణయ పద్ధతిని పాటించినట్లు ఇందులో లేకపోవడంతో దీని ఉపయోగం లేదనే చెప్పవచ్చును. పైగా దీనిని అనుసరించి గణితం చేయాలంటే లాగరిథమ్స్ మరియు త్రికోణమితి ఉపయోగించవలసి ఉండడంతో, సంప్రదాయ పంచాంగ కర్తలకు గణితం చేయడం కష్టంగా ఉండటం జరిగింది. ఆనాడు ఆధునిక విద్యను అభ్యసించిన వారిలో ఐదారుగురు కూడా దీనిని అనుసరించి గణితం చేయగలరా? అనేది సంశయమే.

మరాఠీ పాఠశాలల కోసం నానా రెండు గ్రంథములను రచించడం జరిగింది. అవి 1. పదార్థ విజ్ఞానశాస్త్రం 2. అంకగణితం. అతనికి కొన్ని వేలమంది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో శిష్యులుగా ఉండడం మహారాష్ట్రకు గర్వకారణమని చెప్పవచ్చును.

-డా|| రేమెళ్ల అవధానులు

పురాణ క్విజ్

తెలిసినవేంటో తేల్చుకోండి!
తెలియనివన్నీ తెలుసుకోండి..

1. రాజసూయ యాగంలో యుధిష్ఠిరుడు తొలి కానుక ఎవరికి సమర్పించాడు?
2. విశ్వామిత్రుడు రామునికి ఉపదేశించిన మహా విద్యలు ఏవి?
3. ద్రోణాచార్యుని ప్రియశిష్యుడు?
4. దేవయాని, యయాతీల సంతానం?
5. లక్ష్మణుని తల్లి ఎవరు?
6. తెలుగు నెలల్లో మొదటిది?
7. శుకము అంటే ఏమిటి?
8. పాండురాజుని శపించిన మహర్షి?
9. శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిని ఎత్తుటకు కారణం?
10. శ్రీరామునికి శస్త్రాలను ధారపోసిన వాడు?

సమాధానాలు

1. కృష్ణునికి
2. బల, అతిబల
3. అర్జునుడు
4. యదు, తుర్వసుడు
5. సుమిత్ర
6. చైత్రం
7. చిలుక
8. కిందముడు
9. దేవేంద్రుని గర్వం అణచుటకు, ప్రజలను కాపాడుటకు
10. విశ్వామిత్రుడు

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి: సీఐటీయూ

విజయక్రాంతి, రాజేంద్రనగర్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 8,9వ తేదీల్లో చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ గండిపేట మండల కార్యదర్శి జె.రుద్రకుమార్, గ్రామ పంచాయతీ గండిపేట మండల అధ్యక్షుడు ఎన్.జనార్ధన్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం గండిపేట మండలంలోని పుప్పాల్‌గూడ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గత కొన్నేళ్లుగా కార్మికులు ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ మాత్రం పట్టించుకోకపోవడం దారుణంగా ఉందన్నారు.

గవర్నర్‌ను కలసిన బీజేపీ నేతలు

- చంద్రబాబుపై ఫిర్యాదు

విజయక్రాంతి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ బీజేపీ నేతలు సోమవారం రాజ్‌భవన్‌లో తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌ను కలిసి ఆ రాష్ట్రంలో శాంతిభద్రతలపై ఫిర్యాదు చేశారు. బీజేపీ నేతలు గవర్నర్‌కు సమర్పించిన మెమోరాండంలో ఆంధ్రప్రదేశ్ లో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, రాజ్ భవన్ వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు. అధికార టీడీపీ నాయకులు, ప్రధానంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రజాస్వామ్య విలువలకు ఏమాత్రం ప్రాధాన్యత లేకుండా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ఒక బీజేపీ మహిళా నాయకురాలిని అంతు చూస్తానని చంద్రబాబు బెదిరించారని ఆరోపించారు. మహిళా నాయకురాలి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగేలాగా మాట్లాడారని, రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని వారు గవర్నర్ దృష్టికి తెచ్చారు. ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ నేతలకు రక్షణ కల్పించాలని వారు నరసింహన్‌ను కోరారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఇంటిపై టీడీపీ కార్యకర్తలు దాడికి యత్నించారని కూడా వారు తమ మెమోరాండంలో ఆరోపించారు. జరుగుతున్న పరిస్థితులు గమనిస్తుంటే, టీడీపీ నాయకులు, చంద్రబాబు రాష్ట్రంలో బీజేపీ నాయకులను భౌతికంగా నిర్మూలించడానికే ప్రయత్నిస్తున్నట్లు అర్థమవుతోందని, గవర్నర్ వెంటనే జోక్యం చేసుకోవాలని వారు కోరారు.

అందరికీ సమాన అవకాశాలు

- బీజేపీ అధ్యక్షుడు కే లక్ష్మణ్

విజయక్రాంతి, హైదరాబాద్: ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈబీసీ) విద్య, ఉద్యోగాల్లో కేంద్ర ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని బీజేపీ స్వాగతించింది. తద్వారా అందరికీ సమాన అవకాశాలు కలుగుతాయని పేర్కొంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ కే లక్ష్మణ్ సోమవారం మీడియాతో మాట్లాడారు. వాజ్‌పేయి హయాంలోనే ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం కమిషన్ వేశారని వెల్లడించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ఈ కమిషన్‌ను పక్కన పెట్టిందన్నారు.

ఇప్పుడు తాజాగా 10 శాతం ఈబీసీలకు రిజర్వేషన్లను కల్పించడం ద్వారా రిజర్వేషన్ల శాతం 60 శాతానికి పెరగనుందని తెలిపారు. ఈ మేరకు రాజ్యాంగ సవరణకు అవకాశమేర్పడిందన్నారు. ఈబీసీలకు రిజర్వేషన్లను కల్పించడం ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఎలాంటి కోత విధించడం జరగదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో బీసీలకు రిజర్వేన్లను కుదించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కనువిప్పు కలగాలన్నారు. ఇప్పటికైనా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కొనసాగించేలా కేసీఆర్ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈబీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ప్రధాని మోడీకే దక్కుతుందన్నారు. సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యమవుతుందనడానికి నిదర్శనమన్నారు. 'సబ్ కా సాథ్ – సబ్ కా వికాస్' లో భాగంగా అన్ని కులాలకు, వర్గాలకు సమన్యాయం కల్పిస్తూ మోడీ ప్రభుత్వం తీసుకున్న చర్య అని కొనియాడారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం రాజ్యాంగ విరుద్ధమైన మతపరమైన రిజర్వేషన్లు కల్పించేందుకు తహతహలాడుతున్న కాంగ్రెస్, టీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు.

మోడీ కొత్త డ్రామా: సీపీఐ నారాయణ



ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ డ్రామాగా అభివర్ణించారు. అధికారంలోకి వచ్చిన నాలున్నరేళ్లలో ఈ అంశాన్ని పట్టించుకోకుండా.. ఎన్నికల ముందు తీసుకోవడం డ్రామా కాక మరేమిటన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓడిపోవడంతో ఈ డ్రామాకు తెర తీశారని విమర్శించారు. ఈబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుందన్నారు. దీనికి రాష్ట్రాల నుంచి అమోదం పొందాల్సి ఉంటుందని చెప్పారు. కేవలం ఎన్నికల్లో లబ్ది పొందడానికి ఈబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ఒక్క రోజులో పార్లమెంట్ సమావేశాలు ముగుస్తాయనగా.. ఈ విధంగా నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు.

ఆర్థికపరమైన రిజర్వేషన్లను రాజ్యాంగం అనుమతించదు: ఓవైసీ



ఈబీసీ రిజర్వేషన్లను ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ తప్పుబట్టారు. ఆర్థికపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగం అనుమతించదన్నారు. పేదరికాన్ని నిర్మూలించేందుకు అనేక పథకాలు తేవచ్చని సూచించారు. దళితులకు సామాజిక న్యాయం కోసమే రిజర్వేషన్లు కల్పించారన్నారు. దేశంలో ఇప్పటివరకు 49.5 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5శాతం, ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలు అవుతోంది. 10శాతం పెంపుతో మొత్తం రిజర్వేషన్లు 59.5 శాతానికి చేరనుందని తెలిపారు. ఈ సందర్భంగా రిజర్వేషన్లు 50 శాతానికి మించవద్దని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన ప్రస్తావించారు.

హమారా షహర్



వీరు మారరా ? ఖైరతాబాద్ బీఎస్ మక్తా రైల్వే గేట్ దగ్గర ప్రతిరోజూ ఇదే తంతు. రైలు వస్తోందని తెలిసి కూడా ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు స్థానికులు. ప్రమాదం జరిగితే అధికారులను నిందించటానికి సిద్ధంగా ఉంటారు జనం. కానీ కావాలని ప్రమాదంలో ఇరుక్కునే వీరిని ఏమనాలి..?

ఓటరు నమోదు కార్యక్రమం

విజయక్రాంతి, మెహిదీపట్నం: ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని నాంపల్లి టీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ సి.హెచ్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తెలిపారు. జనవరి1 2019 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదుచేసుకొవాలని ఇందుకోసం మీ సే వా కేంద్రం, మండల ఆఫీసు లేదా ఆన్ లైన్‌లో నమోదు చేసుకొవాలని కొరారు.

PUBLIC NOTICE

Notice is hereby given that the partnership firm under the name and style of M/s. Circle park investment advisors vide firm registration no: 3235/2016 having its office at H NO : A - 419 western plaza near ou colony shaikpet Hyderabad Telangana 500008, is being dissolved by Mutual Consent on and from 22 /12/2018 if any one having objection for the above said dissolution send your reason for the same along with the details to the following undersigned with in 10 days of this publicationn Srilakshmi vanka D/O vanka viswanadhm, aged about 38 years resident of A-419,western plaza, near ou colony, shaikpet, Hyderabad, Telangana-500008 [party of the second prty]

దీనావస్థలో ఉన్న వృద్ధునికి చేయూత

- విజయక్రాంతి విలేకరి చొరవతో పోలీసుల స్పందన

విజయక్రాంతి, మల్కాజిగిరి: రెండు రోజుల నుంచి అన్న పానీయాలు లేక రోడ్డు పక్కన చావుబతుకుల మధ్య దీన స్థితిలో పడివున్న గుర్తు తెలియని ఓ వృద్ధుడిని 'విజయాక్రాంతి' ప్రతినిధి చొరవతో చేరదీసి మానవత్వాన్ని చాటుకున్నారు కుషాయిగూడ పోలీసులు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన పోలీసులు అతనికి తగిన చికిత్స అందించడంతో ప్రాణాలు కాపాడారు. నగర శివారులోని ఈసీఐఎల్ చౌరస్తా ప్రాంతంలో ఆదివారం రాత్రి వెలుగు చూసిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఎక్కడి నుంచి వచ్చాడో తెలియదు కానీ సుమారు 60 సంవత్సరాలపైగా వయస్సు గల ఓ వృద్ధుడు ఈసీఐఎల్ బస్‌టర్మినల్ పక్కన ఉన్న పాలబూత్ దగ్గర ఓ మూలకు పడి ఉన్నాడు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఇతను రెండురోజుల నుంచి ఆహారం తీసుకోకుండా చలిలో వణుకుతూ నేలపై దుర్గంధంలోనే పడి ఉన్నాడు. రెండు రోజులు అక్కడే ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో స్థానికంగా తోపుడు బండిపై అరటి పళ్ళు అమ్ముకునే ఒకతను చూసి తనకు పరిచయం ఉన్న విజయాకాంత్రి విలేకరి వెంకటరెడ్డికి సమాచారమిచ్చారు. వెంటనే అతను అక్కడికి వెళ్ళి వృద్ధుడి దీన స్థితిని చూసి చలించిపోయి 108కు ఫోన్ చేయడంతో పాటు పక్కనే ఉన్న కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి సీఐ చంద్రశేఖర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లాడు. వెంటనే స్పందించిన సీఐ చంద్రశేఖర్ స్వయం గా వెళ్ళి వృద్ధుడికి మంచినీళ్ళు తాగించాడు. తగిన చికిత్స అందించిన తర్వాత అతన్ని కాప్రాలోని 'సెకండ్ ఛాన్స్' పేరిట నడుస్తున్న ఓ వృద్ధాశ్రమానికి తరలించారు.

బీజం వేసిన పీవీ- తెరపైకి తెచ్చిన బీజేపీ

- గతంలో కొట్టేసిన సుప్రీంకోర్టు
- సర్వే జరిపి వృత్తిని ప్రాతిపదికగా తీసుకోవాలని సూచన
- ఓబీసీలకు అమలులో అన్యాయం, వీటితో మరింత ఇబ్బందే
- సామాజిక వేత్తలు

విజయక్రాంతి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికలకు కొన్ని నెలల ముందు కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లపై తీసుకున్న కీలక నిర్ణయం తీవ్ర చర్చకు దారితీసింది. అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడినవారికి 10శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే ఈ నిర్ణయం వెనక బారీ నేపథ్యమే ఉంది. 1987లో వీపీ సింగ్ హయాంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం మండల్ కమిషన్ అమలు నిర్ణయం ఓ సంచలనం రేపింది. అప్పట్లో దేశవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తాయి. అదేసమయంలో రాజకీయంగా తలెత్తిన సంక్షోభంతో కొంతకాలం అమలులో జాప్యం జరిగింది. ఆ తరువాత 1992లో వాటి అమలుకు అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు నిర్ణయం తీసుకున్నారు. ఓబీసీలకు కేంద్రంలో 27శాతం రిజర్వేషన్లు, ఈబీసీలకు 10శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టడం జరిగింది. కాని ఈబీసీ రిజర్వేషన్లను సుప్రీం కోర్టు కొట్టివేసింది. రాజ్యంగంలోని ఆర్టికల్ 15లోని 4,5 సెక్షన్, 16 ఆర్టికల్ లోని 4వ సెక్షన్ ప్రకారం కేవలం ఆర్థిక పరిస్థితినే కాదు వృత్తిని ప్రాతిపదికగా తీసుకోవాలని సూచించింది. ఆ కోణంలో సర్వే చేపట్టిన రాజ్యాంగం పరిధిలో వారిని గుర్తించి రిజర్వేషన్లు పెట్టుకోవచ్చని సూచించింది. దాంతో ఈబీసీ రిజర్వేషన్లకు అప్పట్లోనే బీజం పడినట్లైంది. ఆ తరువాత అంశాన్ని ఎవరూ పట్టించుకోకపోవటంతో ఈ ప్రతిపాదన మూలన పడింది. ఇటీవల కొంతకాలంగా రిజర్వేషన్లు కావాలంటూ మహారాష్ట్రలో మరాఠాలు, రాజస్థాన్‌లో గుజ్జర్లు, గుజరాత్‌లో పటేళ్లు, హర్యానాలో జాట్లు ఉద్యమాలు చేయటంతో మరోసారి ఈ అంశం తెరమీదకు వచ్చింది. ఇంతకాలం ఈ విషయంపై ఎక్కడా బయట పడని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల ముగింపు సమయంలో నిర్ణయం తీసుకొని సంచలనం రేపింది. వార్షికాదాయం రూ.8లక్షల లోపు ఉన్న అగ్రవర్ణాలకు చెందినవారంతా ఈ కోటా పరిధిలోకి వస్తారు. ఈ మేరకు రాజ్యాంగ సవరణ బిల్లును రేపు కేంద్రం పార్లమెంట్ ముందు పెట్టే అవకాశం ఉంది. చాలా కాలంగా ఈ డిమాండ్ ఉండగా, ఎన్నికలకు ముందే కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ బిల్లు కోసం రేపటితో ముగియనున్న పార్లమెంట్ సమావేశాలను రెండు రోజులపాటు పొడిగించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వ్యక్తికి రూ.8లక్షల కంటే తక్కువ వార్షిక ఆదాయం, 5 ఎకరాల కంటే తక్కువ సొంత వ్యవసాయ భూమి, వెయ్యి చదరపు అడుగుల కంటే తక్కువ విస్తీర్ణంలో ఇల్లు, నోటిఫైడ్ పురపాలిక పరిధిలో 109 గజాల కంటే తక్కువ నివాస స్థలం, నోటిఫైడ్ కాని మున్సిపాలిటీ పరిధిలో 209 గజాల కంటే తక్కువ స్థలం ఉన్నవారిని ఆర్థికంగా వెనుకబడిన వారిగా పరిగణించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు రిజర్వేషన్ వల్ల ఎలాంటి ప్రయోజనం పొందని ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈ రిజర్వేషన్లు అందుతాయని కేంద్ర ప్రభుత్వ భావిస్తోంది. కుల ఆధారిత రిజర్వేషన్లు 50శాతం మించకూడదని గతంలో సుప్రీంకోర్టు వెల్లడించిన నేపథ్యంలో ఈ నిర్ణయం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే ఈ 10 శాతం రిజర్వేషన్లపై సవరణలను పార్లమెంటు ఆమోదిస్తే కోటా 50శాతం దాటిపోనుంది.

కొందరికి మోదం, మరికొందరికి ఖేదం: దొంతి నరసింహారెడ్డి, సామాజికవేత్త



పెరిగిపోతున్న నిరుద్యోగానికి శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్న ప్రభుత్వాలు రిజర్వేషన్లను పరిష్కారంగా భావిస్తున్నాయని సామాజికవేత్త దొంతి నరసింహారెడ్డి వ్యాఖ్యానించారు. ఓ వైపు రిజర్వేషన్లను నియంత్రించాలని సుప్రీం కోర్టు చేబుతుండగా ప్రభుత్వాలు ఇలాంటి నిర్ణయాలు తీసుకోవటం చర్చకు దారితీస్తోందని ఆయన అన్నారు. కొత్తగా వచ్చే రిజర్వేషన్లతో ఇప్పటికే రిజర్వేషన్లు పొందుతున్నవారు కొంతమేర నష్టపోయేందుకు అవకావముందని, జాట్లు, గుజ్జర్లు, మరాఠాలు పటేల్‌లు చేసిన పోరాటం కూడా ఈ నిర్ణయానికి కారణమైందని ఆయన అభిప్రాయపడ్డారు.

రాజ్యాంగ విరుద్ధం: జస్టిస్ ఈశ్వరయ్య



ఓబీసీలకు కేంద్రంలో 27శాతం రిజర్వేషన్లు పెట్టినా అమలు మాత్రం 15శాతానికి మించటం లేదు. ముందుగా దీనికి అడ్డంకిగా ఉన్న క్రిమిలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని బీసీ కమిషన్ చైర్మన్‌గా తాను కేంద్ర ప్రభుత్వానికి ఎన్నో సార్లు విన్నవించినా స్పందించలేదు. ముందుగా అత్యంత దయనీయంగా ఉన్న బీసీ అంశాన్ని పరిష్కరించకుండా, కొందరిని ఆకట్టుకోవటానికి ఈబీసీ రిజర్వేషన్లను తెరపైకి తెచ్చారని ఆయన అన్నారు. ఇది సుప్రీం కోర్టులో నిలిచే అవకాశం లేదు. బీజేపీలో అగ్ర వర్ణాల ప్రాబల్యం ఎక్కువ కావటంతో వారిని పార్టీకి దూరం కాకుండా చూసే పనిలో భాగంగా దీన్ని భావించాల్సి వస్తోందని జస్టిస్ ఈశ్వరయ్య అభిప్రాయపడ్డారు.

సిండికేట్ బ్యాంక్
R.P.రోడ్ బ్రాంచ్, 8-1-384, 385 & 468
R.P.రోడ్, సికింద్రాబాద్-500003, తెలంగాణ రాష్ట్రం
ఫోన్ నం. 040-27702266, 27805566, ఫ్యాక్స్: 27307755

Ref: RPR/3018/ADV/2019 తేది:01/01/2019

//రిజిస్టర్డ్ పోస్ట్ అక్నాలెడ్జ్‌మెంట్ డ్యూ ద్వారా//

[illegible]

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు

[illegible]

(మొత్తం రూ.లలో)

క్ర.సం.	సదుపాయ స్వభావం/అకౌంట్ నం.	పరిమితి	31-12-2018 నాటికి బకాయి
1	సెక్యూర్డ్ ఓవర్‌డ్రాఫ్ట్ [illegible] (SOD A/c. నం. 30181400000080)	రూ. 90,00,000	రూ.95,29,050.18
	మొత్తం	రూ. 90,00,000/-	రూ. 95,29,050.18

[illegible]

తేది: 01-01-2019, ప్రదేశం: సికింద్రాబాద్ సం/- అధీకృత అధికారి, సిండికేట్ బ్యాంక్

సిండికేట్ బ్యాంక్
R.P.రోడ్ బ్రాంచ్, 8-1-384, 385 & 468
R.P.రోడ్, సికింద్రాబాద్-500003, తెలంగాణ రాష్ట్రం
ఫోన్ నం. 040-27702266, 27805566, ఫ్యాక్స్: 27307755

Ref: RPR/3018/ADV/2019 తేది:01/01/2019

//రిజిస్టర్డ్ పోస్ట్ అక్నాలెడ్జ్‌మెంట్ డ్యూ ద్వారా//

[illegible]

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు

[illegible]

(మొత్తం రూ.లలో)

క్ర.సం.	సదుపాయ స్వభావం/అకౌంట్ నం.	పరిమితి	31-12-2018 నాటికి బకాయి
1	సెక్యూర్డ్ ఓవర్‌డ్రాఫ్ట్ [illegible] (SOD A/c. నం. 30181250001517)	రూ. 83,00,000	రూ.56,69,771.25
	మొత్తం	రూ. 83,00,000/-	రూ. 56,69,771.25

[illegible]

తేది: 01-01-2019, ప్రదేశం: సికింద్రాబాద్ సం/- అధీకృత అధికారి, సిండికేట్ బ్యాంక్

ఎన్నికల కోసమే బీజేపీ జిమ్మిక్కులు

- శ్రీధర్‌బాబు



విజయక్రాంతి, హైదరాబాద్: ఎన్నికల కోసమే బీజేపీ జిమ్మిక్కులు చేస్తున్నదని మాజీ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 50 శాతానికి మంచి రిజర్వేషన్‌లు ఉండొద్దని సుప్రీంకోర్టు చెప్పింది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు ఎలా సాధ్యమో బీజేపీ చెప్పాలని ఆయన ప్రశ్నించారు. గత ఎన్నికల్లో గెలిచిన వెంటనే ఎందుకు రిజర్వేషన్ గురించి ఆలోచన చేయలేదని ఆయన నిలదీశారు.

అగ్రకులాల ఓట్లను ఆకట్టుకునేందుకే: వీహెచ్



ఎన్నికలు దగ్గర పడడంతో అగ్రకులాల ఓట్లను ఆకట్టుకునేందుకు మోది కొత్త అస్త్రం తెరపైకి తెచ్చారని ఏఐసీసీ కార్యదర్శి వి.హనుమంతరావు విమర్శించారు. 25 సంవత్సరాల క్రితం మండల కమిషన్ బీసీలకు 27 శాతం రిజర్వేషన్ ఇస్తే దాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ తగ్గించారని, మరి అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్ ఎలా సాధ్యమౌతుందో తనకు అర్థం కావడం లేదు.

కృతజ్ఞతలు– రెడ్డి సంఘాల ఐక్యవేదిక

అగ్రవర్ణ పేదలకు విద్య, ఉద్యోగ రంగాల్లో 10 శాతం ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై రెడ్డి సంఘాల ఐక్య వేదిక హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఒక ప్రకటనలో ఐక్యవేదిక పక్షానా బీజేపీ ప్రభుత్వానికి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపింది.


కులవృత్తుల అభ్యున్నతికి సీఎం పెద్దపీట

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

విజయక్రాంతి, అంబర్‌పేట్: ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని కులవృత్తుల అభ్యున్నతికి కృషి చేస్తుందని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మండెపల్లి గంగపుత్ర సంఘం హైదరాబాద్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2019 క్యాలెండర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలో అన్ని కులవృత్తులకు పూర్వవైభవం సంతరించుకుంటుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిగా సద్వినియోగం చేసుకొని అభివృద్ధి బాటలో ముందుకు సాగాలని ఆయన కోరారు. అనంతరం అంబర్‌పేట్ డివిజన్‌లో ప్రేంనగర్‌లో పాదయాత్ర చేసి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలో ప్రధానంగా ఉన్న డ్రైనేజీ మురుగునీరు, మంచినీటిలో ప్రెషర్, వీధి దీపాలు, రోడ్ల మరమ్మతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ పులిజగన్ ఎమ్మెల్యే దృష్టి తీసుకువచ్చారు. దీనిపై స్పందించి ప్రణాళికబద్ధంగా ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు గుంటి యాదగిరిగంగపుత్ర, పాక చందర్, ఆర్.కె.బాబు, సాయి, లవంగు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శూద్రులకే రిజర్వేషన్లను వర్తింపజేయాలి

- 9వ షెడ్యూల్‌లో చేర్చాలి
- కంచ ఐలయ్య



విజయక్రాంతి, హైదరాబాద్: విద్య, ఉద్యోగాల్లో శూద్రులకే రిజర్వేషన్లను వర్తింపజేయాలని బహుజన మేధావి ప్రొఫెసర్ కంచ ఐలయ్య తెలిపారు. సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ కేబినెట్ సమావేశంలో అగ్రకులాలకు 10శాతం రిజర్వేషన్లను కల్పిస్తున్నట్లు కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ అంశంపై కంచ ఐలయ్య మాట్లాడుతూ దేశంలో శూద్ర కులాల్లో ఆర్థికంగా వెనకబడిన వారికి రిజర్వేషన్లను ఇవ్వడం సరైనా నిర్ణయమే. కానీ బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ కులాలకు ఈ రిజర్వేషన్ల నుంచి మినహాయించాలని ఆయన సూచించారు. ఈ రిజర్వేషన్లను కులాలకు లింకు చేసి శూద్ర అనే పదాన్ని తప్పనిసరిగా వాడాలన్నారు. శూద్రుల్లో ఉన్న జాట్లు, పటేళ్లు, గుజ్జర్లు, కాపు, రెడ్డి, కమ్మ, వెలమ కులాల్లో ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు 10శాతం రిజర్వేషన్లను ఇస్తే తాము వ్యతిరేకించడం లేదన్నారు. ఈ రిజర్వేషన్లకు చట్టబద్ధత చేయాలంటే రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పొందుపర్చాలని సూచించారు. అప్పుడే అయా వర్గాలకు మేలు చేకూరుతుందన్నారు. ఎన్నికల్లో లబ్ధి కోసం రిజర్వేషన్లను కల్పిస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయని పేర్కొన్నారు. రిజర్వేషన్లు 50శాతం మించవద్దని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఎత్తివేస్తే తాను స్వాగతిస్తానని కంచ ఐలయ్య అన్నారు.

రాజ్యాంగానికి వ్యతిరేకం: మల్లేపల్లి లక్ష్మయ్య

ప్రధానమంత్రి నరేంద్రమోడీ కేబినెట్ అగ్రకులాల్లో ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు 10శాతం రిజర్వేషన్లను కల్పించడం రాజ్యాంగానికి వ్యతిరేకమని సీనియర్ జర్నలిస్టు మల్లేపల్లి లక్ష్మయ్య అన్నారు. ఆర్థికాంశాలను తీసుకొని రిజర్వేషన్లను ఇవ్వడం సరైంది కాదన్నారు. విద్య, సాంస్కృతికంగా వెనకబడిన వర్గాలు, తరతరాలుగా సామాజికంగా వివక్షకు గురైనా వర్గాలకు రిజర్వేషన్లను కల్పించాలని రాజ్యాంగంలో పొందుపర్చారని గుర్తు చేశారు. ఏదో కారణాల వల్ల రిజర్వేషన్లను అయా వర్గాలకు కల్పిస్తే వ్యవస్థ చిన్నభిన్నమౌతుందన్నారు. కులాల మధ్య అంతరుధ్యం మొదలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజస్థాన్‌లోని గుజ్జర్లకు అక్కడి ప్రభుత్వం రిజర్వేషన్లను కల్పిస్తే సుప్రీంకోర్టు కొట్టి వేసిందని గుర్తు చేశారు. రిజర్వేషన్లను కల్పించేందుకు ఒక సిద్ధాంతం ఉందన్నారు. ఎవరికీ పడితే వారికి రిజర్వేషన్లను కల్పిస్తే.. దేశంలో అన్ని కులాలకు జనాభా ప్రాతిపదికనా రిజర్వేషన్లను కల్పించాలని సూచించారు. ఓట్ల కోసం రాజకీయ పార్టీలు ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల కోసం కేంద్ర ప్రభుత్వం ఇలాంటి జిమ్మిక్కులు చేయడం దుర్మార్గమని అన్నారు.

ఆర్థికపరమైన రిజర్వేషన్లు చెల్లవు: ప్రొఫెసర్ వెంకటేష్

ఆర్థికపరమైన రిజర్వేషన్లు చెల్లవని, ఇది రాజ్యాంగ విరుద్ధమని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ రాజనీతిశాస్త్ర ప్రొఫెసర్ వెంకటేష్ అన్నారు. రిజర్వేషన్లను సామాజికంగా వెనకబడిన వర్గాలకు ఇవ్వాలని రాజ్యాంగంలో పొందుపర్చడం జరిగిందన్నారు. ఆర్థికపరమైన రిజర్వేషన్లపై గతంలో సుప్రీంకోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. మాజీ ప్రధాని స్వర్గీయ విపిసింగ్ హయంలో మండల్ కమిషన్ ఆర్థికపరమైన రిజర్వేషన్లను తీసుకొస్తే, దాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసిందని తెలిపారు. మహారాష్ట్రలోని మరాఠాలు, రాజస్థాన్‌లో గుజ్జర్‌లకు రిజర్వేషన్లను ఇచ్చినప్పుడు ఇలాంటి సంఘటనలే పునరావృతమైనాయని గుర్తు చేశారు. ఎన్నికల కోసం బీజేపీ ప్రభుత్వం అగ్రకులాల్లో ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు ఇవ్వడం సరైంది కాదన్నారు. రాజకీయ పబ్బం గడుపుకోవడానికి ఇలాంటి నిర్ణయాలను తీసుకుంటారని తెలిపారు. రిజర్వేషన్లు 50శాతం మించరాదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, ఒకవేళ కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణ చేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జనాభా ప్రాతిపదికనా రిజర్వేషన్లను ఇవ్వాల్సి వస్తుందని తెలిపారు.

అగ్రకులాలకు రిజర్వేషన్లు ఎన్నికల స్టంట్: టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

అగ్రకులాల్లో ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు 10శాతం రిజర్వేషన్లను కల్పించనున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ కేబినెట్ తీసుకున్న నిర్ణయం ఎన్నికల స్టంట్‌యని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల కోసం ఇలాంటి ప్రకటనలు చేయడం సరైంది కాదన్నారు. దేశంలో గుజ్జర్లు, జాట్‌లు, ఆంధ్రప్రదేశ్‌లో కాపులు రిజర్వేషన్ల కోసం ఎప్పటి నుంచో పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. అప్పుడు చేయకుండా ఎన్నికల ముందు చేయడం సరైంది కాదన్నారు. రిజర్వేషన్ల కోసం ఉభయ సభల్లో చట్ట సవరణ చేయడం కష్టమేనని అన్నారు.

బ్యాంకు ప్రయోజనాలను వినియోగించుకోవాలి



విజయక్రాంతి, హైదరాబాద్: ఇండియన్ బ్యాంక్ వారు సోమవారం ఐబి–కామధేను–కరెంట్, సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ జోన్ జోనల్ మేనేజర్ ఆర్.మనోహర్ ప్రారంభించి, హిమాయత్‌నగర్ నుండి నారాయణగూడ వరకు జరిగిన రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ ప్రచారంలో భాగంగా ప్రజలందరూ కరెంట్, సేవింగ్స్ అకౌంట్లను తెరచి, బ్యాంక్ అందించే ప్రయోజనాలను వినియోగించుకోవలసిందిగా ఆయన కోరారు.

10న బీజేవైఎం ఆధ్వర్యంలో మిస్టర్ యువ బాడీ బిల్డింగ్ పోటీలు

విజయక్రాంతి, అంబర్‌పేట్: దేశంలోని యువత అందరికి వివేకానంద జీవితం ఆదర్శప్రాయమని బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడు వినయ్‌కుమార్ అన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో 10వ తేదిన నారాయణగూడలోని వైఎంసీఏ గ్రౌండ్‌లో మిస్టర్ యువ 2019 పేరిట బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 12న స్వామి వివేకానంద 156వ జయంతి, మాజీ ప్రధాని, శ్రీ.శే. అటల్ బిహారి వాజ్‌పేయి జయంతిలను పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివేకానందస్వామి కష్టకాలంలో సైతం పట్టువదలని విక్రమార్కుని వలె ఎన్నో విజయాలు సాధించారని చెప్పారు. ఆయన జీవిత చరిత్రను తెలిపే ఉద్దేశంతోనే ఆ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఢిల్లీ గద్దెను నిర్ణయించే శక్తి రావాలి

(మొదటి పేజీ తరువాయి) మెదపలేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అగ్రనేతలు తెలంగాణలో ప్రచారం చేసినా వారి డొల్ల మాటలకు తెలంగాణ ప్రజలు పడిపోలేదు. తండాల్లో చైతన్యం వచ్చిందని జానారెడ్డిని ఇన్నేళ్లు ఏం చేశావు అని నిలదీశారని గుర్తు చేశారు. నెల రోజుల్లో మిషన్ భగీరథ పూర్తి కాబోతున్నదని, ఫ్లోరోసిస్‌ను శాశ్వతంగా తరిమికొడతామని పిలుపునిచ్చారు. 3,400 తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావుదేనని తెలిపారు. ట్రక్ గుర్తు వల్లనే నాగార్జునసాగర్‌లో మెజార్టీ తగ్గిందని, నకిరేకల్లో ఓడిపోయామని వెల్లడించారు. తెలంగాణలో ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వంటి అగ్రనేతలు ప్రచారం చేసినా ప్రజలు నమ్మలేదన్నారు. ఢిల్లీ గద్దెను తెలంగాణ ప్రజలు నిర్ణయించే పరిస్థితి రావాలని, పదవుల మీద పెట్టిన శ్రద్ధ కాంగ్రెస్ నేతలకు అభివృద్ధిపై లేదని విమర్శించారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో 25 శాతం మంది గిరిజనులు సర్పంచ్‌లను కాబోతున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో 50 వేల మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

రాజేంద్రనగర్‌లో జోరుగా చెరువుల కబ్జాలు



(మొదటి పేజీ తరువాయి) తదితర స్థలాలు కనుమరుగైపోయాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూముల కబ్జాల వెనుక రెవెన్యూ, నీటి పారుదల, హూడా విభాగాల అధికారుల చేతివాటంతో పాటు నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో ప్రభుత్వ భూములు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చారిత్రక చెరువులు కబ్జాలకు గురవుతున్నా పట్టించుకోనే నాథుడేలేడా..?

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఎన్నో చారిత్రక చెరువులు ఉన్నా అవి నేడు కబ్జాదారుల పాలైన కనుమరుగై పోయాయని నియోజకవర్గం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పేరుతో కొన్ని చెరువులు, స్వార్థం అక్రమ సంపాదన కోసం కొన్ని చెరువులను కబ్జాదారులు మట్టి, బండరాళ్లతో పూడ్చి కబ్జాలు చేస్తున్నా పట్టించుకొనే నాథుడే కరవయ్యాడు. నియోజకవర్గంలోని ఫిరంగినాలా మొదలు కొని మీరాలం చెరువు, మైలార్‌దేవ్‌పల్లిలోని పల్లెచెరువు, శివరాంపల్లిలోని ఊర చెరువు, గగన్‌పహాడ్‌లోని మామిడి చెరువు, పెద్ద చెరువు, ఉప్పర్‌పల్లిలోని మల్కచెరువు, కోకపేట, పుప్పాల్‌గూడ, పీరంచెరువు, గంధంగూడ, శంషాబాద్ మండలంలోని కామునీ చెరువు, నర్కుడ, పాల్మాకుల, కాచారం, లక్ష్మీగూడలోని మద్దికుంట, ఖానాపూర్ గ్రామాల్లోని చెరువులు, కుంటలు, చెరువులో వచ్చే వరదనీటి కాలువలు పూర్తిగా కబ్జాల పాలైన అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంలోని ఆంతర్యమేమిటనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మిషన్ కాకతీయ పనులను కూడా కొన్ని చెరువుల్లోనే జరగడంతో చాలా చెరువులు కబ్జాలతో అస్తిత్వాన్ని కోల్పోయాయి. మైలార్‌దేవ్‌పల్లిలోని పల్లెచెరువులో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే చెరువు గత నెలరోజులగా కబ్జాదారులు రాత్రి, పగలు అనేతేడా లేకుండా పూడ్చుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జాలు చేస్తే కఠిన చర్యలు: చంద్రకళ, ఆర్డీవో రాజేంద్రనగర్

రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎక్కడ ప్రభుత్వ భూమి, చెరువులు, కుంటలు కబ్జాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ డివిజన్ ఆర్డీవో చంద్రకళ తెలిపారు. గత ఎన్నికల సందర్భంగా అధికారులు తమ విధుల్లో ఉండగా కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జాలు జరిగితే రెవెన్యూ అధికారులు వెళ్లి అడ్డుకోవడం జరిగిందన్నారు. కబ్జాదారులు ఎంతటి వారైన సరే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని తెలిపారు.

వృద్ధులకు బాసటగా ఎల్డర్స్ క్లబ్ ఫౌండేషన్

విజయక్రాంతి, ఖైరతాబాద్: సమాజంలో అణిచివేతకు మరియు ఒంటరితనానికి లోనవుతున్న 50 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ తెలిపింది. విలేకరుల సమావేశంలో ట్రస్ట్ సభ్యులు రిటైర్డ్ హైకోర్ట్ జడ్జ్ చంద్రయ్య, రిటైర్డ్ డీజీపీ గోపి నాథ్ రెడ్డి ,సోషల్ వర్కర్ గౌరి శంకర్, డాక్టర్ ఆవుల అప్ప మాట్లాడారు ఎల్డర్ క్లబ్ 36 దేశాలలో సేవలు నిర్వహిస్తూ ఇప్పటికే ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందింది అన్నారు త్వరలోనే వృద్ధుల కోసం 24 /7 కాల్ సెంటర్ ని ప్రారంభించి వృద్ధులకు అన్ని విధాలుగా బాసటగా నిలుస్తామని తెలిపారు.

టోలిచౌకిలో పారిశుధ్య పనులు సమీక్షించిన జోనల్ కమిషనర్

విజయక్రాంతి, మెహిదిపట్నం: కార్వాన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దిన్, టోలిచౌకి హకింపేట్ ప్రాంతాలలో ఉన్న స్థానిక, నాలా, రోడ్డు సమస్యలను జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ముషారఫ్ ఫారుఖి, డిప్యూటి కమిషనర్ సుదాన్ష్‌లకు వివరించారు. జోనల్ కమిషనర్ మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కలప స్మగ్లర్లపై పీడీ చట్టం

- అటవీశాఖ సమీక్షలో కేసీఆర్ ఆదేశం
- ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు



విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లో కలప స్మగ్లింగ్‌కు అవకాశం లేని విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు. పోలీసుల సహకారంతో కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాలని, తరచూ స్మగ్లింగ్‌కు పాల్పడే వారిపై పిడి యాక్టు నమోదు చేయాలని, స్మగ్లర్లు ఎంతటి వారైనా, ఎంత పలుకుబడి కలిగిన వ్యక్తయినా, ఏ రాజకీయ పార్టీకి చెందినా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణను నాలుగు విభాగాలుగా విభజించుకుని చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది మొక్కల పెంపకం, అడవి పునరుద్ధరణ, హైదరాబాద్ నగరం లోపలా బయటా పచ్చదనం పెంచడం, కలప స్మగ్లింగ్ అరికట్టడంపై కార్యాచరణ రూపొందించుకుని రంగంలోకి దిగాలని సీఎం సూచించారు.

పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకంపై ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. హోంమంత్రి మహమూద్ అలీ, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, సలహాదారు అనురాగ్‌శర్మ, సీఎస్ ఎస్.కె.జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, పీసీసీఎఫ్ పీకే.ఝా, సీనియర్ అధికారులు ఎస్. నర్సింగ్ రావు, రామకృష్ణరావు, రాజీవ్ త్రివేది, నిరంజన్‌రావు, స్మితా సబర్వాల్, రాజశేఖర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, ప్రియాంక వర్గీస్, పలువురు అటవీశాఖ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

'అడవుల్లో సహజంగా చెట్లు పెరుగుతాయి. అడవుల ద్వారా లభించే పచ్చదనమే ఎక్కువ. ఓ వైపు అడవులు నశించిపోతుంటే, హరితహారం లాంటి కార్యక్రమాల ద్వారా ఎన్ని చెట్లు పెంచినా పెద్దగా ప్రయోజనం ఉండదు. అడవులను కాపాడితే పచ్చదనం కాపాడినట్లే. అడవులను కాపాడడమంటే, భూమి ధర్మాన్ని కాపాడినట్లే. కలప స్మగ్లింగ్ వల్ల అడవులకు పెద్ద ముప్పు వాటిల్లుతోంది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో కలప స్మగ్లింగ్ జోరుగా సాగుతున్నది. కొందరు కలప స్మగ్లింగ్ చేయడమే పనిగా పెట్టుకున్నారు. అలాంటి ప్రాంతాలను, వ్యక్తులను గుర్తించాలి. అక్కడ నిబద్ధత కలిగిన అధికారులను నియమించాలి. కలప స్మగ్లింగ్ అరికట్టడమే లక్ష్యంగా వారు పనిచేయాలి. పోలీసుల సహకారంతో అటవీశాఖ అధికారులు కార్యాచరణ రూపొందించాలి. సాయుధ పోలీసుల అండతో కలప స్మగ్లింగ్‌ను నూటికి నూరు శాతం అరికట్టాలి. కలప స్మగ్లింగ్‌కు పాల్పడే వారు ఎవరైనా సరే ఉపేక్షించవద్దు. కఠిన చర్యలు తీసుకోవాలి. వారికి సహకరించే అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాలి. రాజకీయ నాయకులు ఎవరైనా స్మగ్లింగ్‌కు పాల్పడినా వదిలిపెట్టవద్దు, టీఆర్ఎస్ నాయకులు ఎవరైనా ఈ పనిచేస్తే ముందు వారిపైనే చర్యలు తీసుకోండి. గతంలో నక్సలైట్ల కారణంగా అడవుల్లోకి వెళ్లడం సాధ్యం కావట్లేదు అని సాకులు చెప్పేవారు. ఇప్పుడు అలాంటి సమస్య కూడా లేదు. అడవులను కాపాడడమే లక్ష్యంగా పనిచేయండి. పోలీస్, అటవీ అధికారులు సంయుక్త సమావేశం ఏర్పాటు చేసుకుని కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలి" అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

కొందరు పలుకుబడి కలిగిన వ్యక్తులు ఇండ్లు నిర్మించుకునే సందర్భంలో తాము ఎంత కావాలంటే అంత కలప అందిస్తామని కొందరు అధికారులు తరచూ చెబుతుంటారని, అడవుల్లో చెట్లు నరకడం వల్లే ఈ కలప సమకూరుతున్నదని, ఇలాంటి అక్రమాన్ని అరికట్టాలని సీఎం సూచించారు. కట్టె కోత మిషన్ల (సామిల్స్) నిర్వహణపై కూడా నియంత్రణ ఉండాలని, కొత్తగా ఎలాంటి సామిల్స్‌కు అనుమతి ఇవ్వవద్దన్నారు. అడవులను రక్షించడంతో పాటు, చెట్ల నరికివేత వల్ల పోయిన అడవిని పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని, రూట్ స్టాక్‌ను ఉపయోగించుకుని అడవుల పునరుద్ధరణ చేపట్టాలని, సామాజిక అడవుల అభివృద్ధి కన్నా, అటవీ ప్రాంతంలో అడవి పెంచడం సులువు, ఎక్కువ ఉపయోగం అని ముఖ్యమంత్రి అన్నారు. 'తెలంగాణకు హరితహారం కార్యక్రమం కింద ప్రతి ఏటా నాటే మొక్కల సంఖ్యను పెంచాలి. వచ్చే వర్షాకాలం నుంచి ఏడాదికి వంద కోట్ల చొప్పున మొక్కలు నాటాలి. దీనికి అవసరమైన కార్యాచరణ రూపొందించాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు. "హైదరాబాద్ నగరం పరిధిలో లక్షా 50 వేల ఎకరాల అటవీ బ్లాకులున్నాయి. కానీ అందులో చెట్లు లేవు. ఈ అటవీ బ్లాకుల్లో పెద్ద ఎత్తున చెట్లు పెంచాలి. దేశ రాజధాని నగరం ఢిల్లీలో ప్రస్తుతం విపరీతమైన వాయు కాలుష్యం ఉంది. చెట్లు లేకపోవడం, వాహన కాలుష్యం వల్ల ఈ పరిస్థితి వచ్చింది. హైదరాబాద్ నగరంలో కూడా వాహనాల సంఖ్య పెరుగుతోంది. కాలుష్యం పెరుగుతోంది. దీన్ని నివారించాలంటే చెట్లు పెంచడం ఒక్కటే మార్గం. అన్ని పార్కులు, అటవీ బ్లాకుల్లో విరివిగా చెట్లు పెంచాలి. వాటిలో వాకింగ్ పాతులు కూడా నిర్మించి ఉపయోగంలోకి తేవాలి" అని ముఖ్యమంత్రి సూచించారు.

చెట్ల పెంపకం కార్యక్రమానికి నిధుల కొరత లేదని సీఎం అన్నారు. కాంపా నిధులు, నరేగా నిధులు, బడ్జెట్ నిధులు, నగర పాలక సంస్థల ద్వారా వచ్చే నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. పచ్చదనం పెంచడానికి తీసుకునే చర్యలకు నిధుల కొరత ఉండదని, చిత్తశుద్ధితో పనిచేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు కోరారు.

ఈ టర్మ్‌లోనే ప్రాజెక్టులన్నీ పూర్తి

(మొదటి పేజీ తరువాయి) వహించే వర్క్ ఏజన్సీలను మార్చాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. "తెలంగాణ రాష్ట్రం కోసం ప్రజలు దశాబ్దాల తరబడి పోరాడారు. ప్రాణాలు కూడా అర్పించారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే సాగునీరు వస్తుందని ఆశ పడ్డారు. మొదటి టర్మ్ లో సాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించాం. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు పునరుద్ధరించే పనులు చేపట్టాం. అన్ని పనులు పురోగతిలో ఉన్నాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో టిఆర్ఎస్ ప్రభుత్వానికున్న విశ్వసనీయతను ప్రజలు గుర్తించారు. ప్రాజెక్టులు పూర్తి చేయడం ఈ ప్రభుత్వం వల్లనే అవుతుందని నమ్మారు. 75 శాతం ఇదే కారణంతో టిఆర్ఎస్ కు మళ్లీ ఓటు వేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి, సాగు నీరు అందించాం. వలసలు పోయిన వారు వాపస్ వచ్చారు. ఈ పరిస్థితి చూసే అక్కడి ప్రజలు 13 సీట్లలో టిఆర్ఎస్ ను గెలిపించారు. ఈ టర్మ్ లో ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి, తెలంగాణలో కోటి ఎకరాల్లో నీరు పారించాల్సిన బాధ్యత మనపై ఉంది. ఐదేళ్ల పూర్తి సమయం మనకుంది. రాజకీయ సుస్థిరత ఉంది. నిధులకు కొరతలేదు. రైతులకు సాగునీరు అందివ్వడమే ధ్యేయంగా పనిచేయడానికి పునరంకితమవుదాం" అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

ఒక్క ప్రాజెక్టునైనా జాతీయ ప్రాజెక్టుగా గుర్తించండి

"తెలంగాణ రాష్ట్రం వెనుకబడింది. సాగునీటి రంగంలో వివక్షకు గురైంది. అందుకోసమే ఇక్కడి ప్రజలు పోరాటం చేశారు. కాబట్టి తెలంగాణలో ఓ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించండి అని ప్రధాని మోడీకి అనేక సార్లు చెప్పాను. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం 2030 వేల కోట్లిచ్చి సాయపడండి అని వేడుకున్నా. అయినా సరే నరేంద్ర మోడి డబ్బులు ఇవ్వలేదు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు పునరుద్ధరిస్తున్న తీరును చూసి దేశమంతా మెచ్చుకున్నది. వాటర్ మాన్ ఆఫ్ ఇండియా రాజేందర్ సింగ్ వరంగల్ జిల్లా నెక్కొండలో చెరువులో పుట్టిన రోజు చేసుకుని మిషన్ కాకతీయ పనులను మెచ్చుకున్నారు. దేశమంతా ప్రశంసించారు. నీతి ఆయోగ్ కూడా మిషన్ కాకతీయ గొప్ప పథకమని చెప్పింది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథలకు రూ.24వేల కోట్లివ్వాలని నీతి ఆయోగ్ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. అయినా సరే, నరేంద్ర మోడీ ప్రభుత్వం 24 రూపాయలు కూడా ఇవ్వలేదు. ఈ సారి కేంద్రంలో మనది క్రియాశీల పాత్ర ఉంటుంది. కావాల్సిన నిధులు రాబట్టుకునే అవకాశం ఉంటుంది. దీంతో పాటు మన రాష్ట్ర ఆదాయాభివృద్ధి రేటు కూడా బాగుంది. మొదటి నాలుగు సంవత్సరాలలో 17.17 శాతం వృద్ధిరేటుంటే, ఈ సంవత్సరం ఇప్పటి వరకు 29.17 శాతం వృద్ధి రేటు నమోదైంది. నిధులకు కొరతలేదు. ప్రాజెక్టులు కట్టుకోవడమే మన లక్ష్యం" అని చెప్పారు. నిజాంసాగర్, ఘనపురం ఆయకట్టుకు సాగునీరు అందించాలి. గండిపేట, హిమాయత్ సాగర్ చెరువులు నింపాలి. వాటి ద్వారా క్రమం తప్పకుండా నీటిని విడుదల చేస్తూ మూసీ నది మురికిని వదిలించాలి. మూసీ రివర్ ఫ్రంట్ ను అహ్మదాబాద్ లో సబర్మతి రివర్ ఫ్రంట్ లాగా అభివృద్ధి చేస్తాం. దానికి కూడా గోదావరి నీళ్లు అందాలి. చివరికి మూసీ నది నీళ్ల ద్వారా పాత నల్గొండ జిల్లా పొలాలకు నీరు చేరాలి" అని ముఖ్యమంత్రి కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యాలను వివరించారు. ఈ లక్ష్యాలను చేరుకోవడానికి అవసరమైన కార్యాచరణ రూపొందించి, అమలు చేయాలని ముఖ్యమంత్రి వివరించారు. 'గోదావరి నదిపైనే నిర్మించిన దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి స్థాయిలో సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఇంద్రావతి నది గోదావరిలో కలిసిన తర్వాత తుపాకుల గూడెం వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. ఆ నీటిని ఉపయోగించుకోవడానికి బ్యారేజి కడుతున్నాం. ఏడాదికి 75 టిఎంసిలకు పైగా నీరు తీసుకునే అవకాశం ఉంది. ఇప్పుడున్న డిజైన్లు, కాల్వలు, ఇతర నిర్మాణాలు పెద్దగా ఉపయోగపడేలా లేవు. మొత్తం పాత వరంగల్ జిల్లాకు దేవాదుల ద్వారా నీరు అందించాలి. పాఖాల, రామప్ప, గణపురం, లక్నవరం చెరువులను నింపాలి. తుంగతుర్తి నియోజకవర్గంలో ఒక రిజర్వాయర్ నిర్మించి, తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ తదితర నియోజకవర్గాలకు నీరివ్వాలి. దీనికోసం మొత్తం ప్రాజెక్టును రివ్యూ చేసి, కొత్త ప్రతిపాదనలు తయారు చేయాలి" అని ఆదేశించారు.



సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం సస్యశ్యామలం

"దుమ్ముగూడెం వద్ద నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలి. మే నెలలో కూడా దుమ్ముగూడెం వద్ద ఆ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటితో నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు నీరివ్వాలి. బయ్యారం వరకు నీటిని తీసుకురావాలి. ఎస్ఆర్ఎస్పి ఆయకట్టుకూ నీరు అందాలి. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని అవసరమైన నిర్మాణాలు చేపట్టాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు. "ఉమ్మడి మహబూబ్ నగర్, నల్గొండ, రంగారెడ్డి(ప్రస్తుత వికారాబాద్) జిల్లాలకు సాగునీరు అందివ్వడానికి ఉద్దేశించిన పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం వేగం పెరగాలి. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా మహబూబ్ నగర్ జిల్లా ప్రజల్లో ప్రభుత్వంపై ఎంతో నమ్మకం వచ్చింది. పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేసి, మహబూబ్ నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయాలి. శ్రీశైలం సోర్సు నుంచి 70 టిఎంసిల వరకు తీసుకునే అవకాశం ఉంది. మహబూబ్ నగర్ జిల్లా ప్రజలకు ఎంతో మేలు చేసే ఈ ప్రాజెక్టును ఆ జిల్లాకు చెందిన రాజకీయ నాయకులే కోర్టుల్లో కేసులు వేసి, అడ్డుకున్నారు. దానివల్లే కొంత జాప్యం జరిగింది. ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తున్నంత వేగంగా ఇక పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణం సాగాలి. అవసరమైన నిధులను ఈ బడ్జెట్లోనే కేటాయిస్తాం" అని ముఖ్యమంత్రి చెప్పారు.

ప్రాజెక్టుల ద్వారా చెరువులు నింపాలి

ప్రాజెక్టుల ద్వారా వచ్చే నీటితో ముందుగా చెరువులు నింపాలని సిఎం ఆదేశించారు. గొలుసుకట్టు చెరువుల వ్యవస్థను ఉపయోగించుకుని చెరువులను నింపేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సాగు నీటితో పాటు, తాగునీటికి ఎంత నీరు అవసరమవుతుందో, భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని అంచనాలు తయారు చేసి, నీటి కేటాయింపు జరపాలని సిఎం కోరారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణ రావు, సిఎంఒ కార్యదర్శి స్మితా సభర్వాల్, నీటి పారుదల శాఖ ఇఎన్సిలు మురళీధర్ రావు, అనిల్ కుమార్, హరిరామ్, ఓఎస్డీ శ్రీధర్ దేశ్ పాండే, సలహాదారు పెంటారెడ్డి, సిఇలు వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాస రెడ్డి, బి.శంకర్, కె.బంగారయ్య, వి.సుధాకర్, వి.నర్సింహ, ఆర్.మధుసూదన్ రావు, వి.రమేశ్, టి.ఖగేందర్, రిటైర్డు ఇంజనీర్లు శ్యాం ప్రసాద్ రెడ్డి, చంద్రమౌళి, వెంకటరామారావు, వేణుగోపాలరావు, రాంరెడ్డి, దామోదర్ రెడ్డి, వెంకటేశం, సత్తిరెడ్డి, రమణానాయక్, ఎస్.ముత్యంరెడ్డి, జగదీశ్వర్, జియావుద్దీన్, ఇంద్రసేనా రెడ్డి, కెప్టెన్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శం అబ్దుల్ కలాం: కలెక్టర్ ఎం.రాంమోహన్‌రావు

విజయక్రాంతి, నిజామాబాద్‌అర్బన్: మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా ప్రసిద్ధి చెందిన దివంగత మాజీ రాష్ట్రపతి, భారతరత్న అబ్దుల్ కలాంను మించిన ఆధర్శవంతులు ఎవ్వరూ లేరని జిల్లా కలెక్టర్ ఎం.రాంమోహన్‌రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బ్లుమింగ్‌బడ్స్ పాఠశాలలో ఉమ్మడి జిల్లాల విద్యావైజ్ఞానిక ప్రదర్శన సైన్స్‌ఫెయిర్–2019ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు తమ లక్ష్యాలను ఎంచుకుని సాధించుకునే దిశలో అడుగులు ఉన్నతపాఠశాల స్థాయిలోనే పడతాయని అన్నారు. విద్యార్థులలో కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలరని అన్నారు. ముఖ్యంగా అబ్దుల్ కలాం, శ్రీనివాస రామానుజం, న్యూటన్ లాంటి ఆదర్శవంతుల జీవితాలను పరిశీలిస్తే.. వారి బాల్యం కడు పేదరికం నుంచి వచ్చినప్పటికీ వారి ఆలోచనా విధానం ప్రపంచానికి వారిని కొత్తగా పరిచయం చేసిందని అన్నారు. విద్యార్థి దశలోనే విద్యార్థులకు పుస్తకాల కన్నా సమాజ స్థితిగతులు తెలియడం వలన వారు కొత్త ఆవిష్కరణలు రూపొందిస్తారని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు ఉపాధ్యాయులు, గైడ్‌లు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్, కామారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి రాజు, పరిశీలకులు అముల్ జాదవ్ ఉమ్మడి జిల్లాల డీఎస్ఓలు గంగాకిషన్, సిద్ధిరాంరెడ్డిలతో పాటు ప్రదర్శనకు వచ్చిన సైన్స్ టీచర్‌లు, గైడ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలు లేకపోవటం దురదృష్టకరం



- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి

విజయక్రాంతి, ఉప్పల్: నగరంలో అతి పెద్దదైన ఉప్పల్ నియోజకవర్గంలోని ఒక్క ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలు లేక పోవడం దురదృష్టకరమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి అన్నారు. సోమవారం హబ్సీగూడ చౌరస్తాలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ మొదటి మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి, మేడ్చల్ జిల్లా కార్యదర్శి సంతోష్, జిల్లా విద్యార్థిని విభాగం కన్వీనర్ సౌమ్య, జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ముందుండి పోరాడుతామన్నారు. రాష్ట్రంలో నేడు నియంత పాలన నడుస్తోందని ఎన్నికలు జరిగి 20 రోజులు గడుస్తున్నా అసెంబ్లీకి దిక్కేలేదన్నారు. విద్యార్థులు స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక ఉన్నత విద్యకు దూరమవుతున్నారని విమర్శించారు. ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ ఉప్పల్‌లో కనీసం ఒక్క ప్రభుత్వ జూనియర్ కళాశాల , డిగ్రీ కళాశాల గాని లేదని ప్రభుత్వం కార్పొరేట్ల విద్యాసంస్థలను ప్రోత్సహిస్తుందని, పేద వాళ్ల గురించి ఆలోచించే పరిస్థితి లేదని ఆరోపించారు. కళాశాలలో ఏర్పాటు చేసేంతవరకు పోరాటం కొనసాగించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షులు అఖిల, కార్యదర్శి శివ, డిగ్రీ కాలేజి కన్వీనర్ మానస, సభ్యులు శిరీష, నాగరాణి, వినయ్, ఉమా, కావేరి తదితరులు పాల్గొన్నారు.

అన్ని పార్టీలలో రిజర్వేషన్ ప్రకంపనలు

(మొదటి పేజీ తరువాయి) ప్రతిపాదన పచ్చి 'అబద్ధం' తప్ప మరోటి కాదని అన్నారు. కేంద్రం నిర్ణయం లీగల్ పరమైన చిక్కులకు తావిస్తుందని, పార్లమెంటు ఉభయసభల్లోనూ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి సమయం కూడా లేదని అన్నారు. ఈ విషయాలన్నీ తెలిసే ప్రభుత్వం ఈ ప్రకటన చేసిందన్నారు. దీనిని బట్టే ప్రభుత్వ వైఖరి ఏమిటో అర్థమవుతుందని ఓ ట్వీట్లో ఆయన ఎద్దేవా చేశారు.

అగ్రవర్ణాల్లో పేదలకు రిజర్వేషన్ మంచిదే: పినరాయి విజయన్



తిరువనంతపురం: అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని కేరళ ప్రభుత్వం స్వాగతించింది. అగ్రవర్ణాల రిజర్వేషన్కు సీపీఎం చాలాకాలంగా డిమాండ్ చేస్తోందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. 'రిజర్వేషన్ సిస్టమ్ను ధ్వంసం చేయాలని చాలాకాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే మేము మాత్రం అగ్రవర్ణాల వారిలో ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రతిసారి డిమాండ్ చేస్తూనే ఉన్నాం. ఎట్టకేలకు వాళ్లు ఇందుకు సంబంధించిన నిర్ణయం తీసుకున్నారు. ఇది స్వాగతించదగిన పరిణామం' అని పినరయి విజయన్ అన్నారు.

మోదీ అమ్ములపొదిలో చివరి లాలీపాప్: హార్దిక్ పటేల్



అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై పటీదార్ రిజర్వేషన్ ఉద్యమ నేత హార్దిక్ పటేల్ స్పందించారు. మోదీ 'తూణీరంలో చివరిబాణం' ఇదేనని అన్నారు. ఇది ప్రజలకు ఇచ్చిన 'లాలీపాప్' అయితే అది తప్పే అవుతుందన్నారు. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నెరవేర్చడంలో విఫలమైన పక్షంలో ప్రజలే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కేంద్రం తీసుకున్న కోటా నిర్ణయానికి రాజ్యాంగ సవరణ కీలకమని, ఆ దిశగా అడుగు పడాల్సి ఉంటుందని హార్దిక్ పటేల్ అన్నారు.

ఎన్నికల జిమ్మిక్ తప్ప మరేమీ కాదు: హరీష్ రావత్



అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కేంద్రం చేసిన ప్రకటనపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి హరీష్ రావత్ స్పందించారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఇలాంటి ఆర్భాటమైన ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. చాలాకాలం నాన్చి ఇప్పుడు ఆర్భాటంగా ప్రకటన చేశారని, ఐదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. అబద్ధాలతోనే ఇన్నేళ్లూ కాలం గడిపిన బీజేపీకి ప్రజలు చరమగీతం పాడతారని, ఈ ప్రభుత్వాన్ని ఎవరూ కాపాడలేరని ఆయన అన్నారు.

నేడు, రేపు సార్వత్రిక సమ్మె



(మొదటి పేజీ తరువాయి) భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేస్తామని ఎస్టీయూ ప్రకటించింది.

సమ్మెలో ఆర్టీసీ కార్మికులు

జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఆర్టీసీ కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నాయి. ఈ సమ్మెలో ఎంప్లాయిస్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, కార్మిక పరిషత్, బహుజన వర్కర్స్ యూనియన్లు పాల్గొంటున్నాయి. ఈ మేరకు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కే రాజిరెడ్డి, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు తెలిపారు. మోటారు వాహనాల చట్టం, ఎంటీడబ్ల్యూ యాక్ట్ సహా కార్మిక చట్టాలకు సవరణ తేవడం ద్వారా కార్మిక వర్గాన్ని ఇబ్బంది పెట్టాలని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. సమావేశంలో ఆయా సంఘాల ప్రతినిధులు బీ యాదగిరి, ఎస్ సురేశ్ పాల్గొన్నారు.

టీఎంయూ నిరసన

సార్వత్రిక సమ్మెకు గుర్తింపు కార్మిక సంఘం టీఎంయూ మద్దతు ప్రకటించింది. భోజన విరామ సమయంలో ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేయాలని ఆ సంఘం కార్య నిర్వాహక అధ్యక్షుడు ఎం థామస్‌రెడ్డి పిలుపునిచ్చారు. సమ్మెలో పాల్గొనకుండా.. నిరసన వ్యక్తం చేస్తామని టీఎంయూ ప్రకటించడంపై ఎంప్లాయిస్ యూనియన్, ఎస్‌డబ్ల్యూయూ మండిపడ్డాయి. సమ్మెలో పాల్గొనకపోవడాన్ని తప్పుపట్టాయి. ఈ సార్వత్రిక సమ్మెలో పాల్గొనకుండా నేషనల్ మజ్దూర్ యూనియన్ తటస్థంగా వ్యవహరిస్తోంది. ఆర్ఎస్ఎస్ అనుబంధ కార్మిక సంఘమైన బీఎంఎస్ సమ్మెకు దూరంగా ఉంటోంది.

కంపోస్ట్ యూనిట్లను ఏర్పాటు చేయని
హోటళ్లపై బల్దియా కొరడా

- బావర్చీ తో పాటు పలు హోటళ్ళను సీజ్ చేసిన అధికారులు
- కొన్నింటికి జరిమానాలు

విజయక్రాంతి, హైదరాబాద్: బల్క్ గార్బేజ్ ను ఉత్పత్తి చేస్తూ పలు మార్లు నోటీసులు జారీచేసినప్పటికీ కంపోస్ట్ ఎరువుల తయారీ యూనిట్ ను ఏర్పాటు చేయని (ఆర్టీసీ క్రాస్ రోడ్డు)ముషీరాబాద్ బావర్చి హోటల్ ను జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. దీంతో పాటు కూకట్ పల్లి సర్కిల్ నిజాంపేటలోని సహారా కేఫ్ రెస్టారెంట్లో అపరిశుభ్రమైన వాతావరణంలో కిచెన్ నిర్వహించడంతో సీజ్ చేశారు. దీంతో పాటు వ్యర్థాలను డ్రైనేజీలో వేయడం, సిల్ట్ చాంబర్లను నిర్మించుకోకపోవడంతో త్రిపురా బార్ అండ్ రెస్టారెంటుకు రూ. 20వేల జరిమానాను విధించారు. మూసాపేట సర్కిల్లోని దేవి గ్రాండ్ హోటల్లో అపరిశుభ్ర వాతావరణం, ధృవీకరించని మాంసం ఉపయోగించడం, డ్రైనేజీలో వ్యర్థాలను వేయడం పట్ల రూ. 30,100 లను జీహెచ్ఎంసీ అధికారులు జరిమానాగా విధించారు. వ్యర్థపదార్థాల నిర్వహణ చట్టం అనుసరించి 50 కిలోలకు పైగా వ్యర్థాలను ఉత్పత్తిచేసేవారు తప్పనిసరిగా కంపోస్ట్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలి. జీహెచ్ఎంసీ నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు,ఫంక్షన్ హాళ్లు , కళ్యాణ మండపాలు, బాంకెట్ హాళ్లకు ఇప్పటికే పలుమార్లు నగరమేయర్ బొంతు రామ్మోహన్, కమిషనర్ ఎం.దానకిషోర్‌లు నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాళ్ల యజమానులతో సమావేశాలు నిర్వహించారు . ఐనప్పటికి ఈ హోటళ్ల యాజమాన్యాలు నిర్లక్ష్యం వహించడంతో తాజాగా చర్యలు చేపట్టారు.

చెరువు శిఖం భూమి కబ్జాపై తహశీల్దార్‌కు వినతి

విజయక్రాంతి, కోరుట్ల: జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గ కేంద్రంలోని చిలుక చెరువు శిఖం భూమి కబ్జాపై గంగపుత్ర సంఘం అనుబంధంగా ఉన్న మత్స్య సహకార సంఘ సభ్యులు సోమవారం కోరుట్ల తహశీల్దార్‌ను కలిసి వినతి చేశారు. ఈ మేరకు ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు భూమయ్య, నరేశ్‌లు మాట్లాడుతూ కోరుట్ల పట్టణ శివారులోని చిలుక చెరువు శిఖంలో రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 670లో 17ఎకరాల 6గుంటల స్థలం ఉందన్నారు. ప్రస్తుతం అట్టి భూమి కబ్జాకు గురవడంతో చెరువు ఆనవాళ్లు కోల్పోతుండడంతో పాటూ తమ జీవనోపాధి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాదారులపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని, చెరువును కాపాడాలని వారు తహశీల్దార్‌ను కోరారు. కాగా ఈ విషయంగా శాఖాపరమైన విచారణ జరిపి, అవసరమైన చర్యలు తీసుకుంటామని కోరుట్ల తహశీల్దార్ కోమల్‌రెడ్డి పేర్కొన్నారు.



2019 క్యాలెండర్ ఆవిష్కరణ

- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, సుడా చైర్మన్

విజయక్రాంతి, మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది ఆధ్వర్యంలో రూపొందించిన 2019 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఎరుపుల బాలకిషన్ సోమవారం ఆవిష్కరించారు. తిమ్మాపూర్ మండలం అల్గునూర్ గ్రామంలోని కార్యాలయ ఆవరణలో సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావుతో కలిసి ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయరావు, లెక్చరర్లు శరత్ చంద్ర, శ్రీధర్, రమేశ్ బాబు, లలిత, రమేశ్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

- గైర్హాజరైన అధికారులపై సీరియస్
- జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.ఖీమ్యా నాయక్

విజయక్రాంతి, సిరిసిల్ల: డయల్ యువర్ కలెక్టర్, ప్రజావాణిల ద్వారా వచ్చే ప్రజల అర్జీలను త్వరగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.భీమ్యానాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. డబుల్ బెడ్‌రూంల మంజూరు కోరుతూ 183, పెన్షన్‌ల కోసం 24, రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారం కోరుతూ 33 అర్జీలు వచ్చాయి. డయల్ యువర్ కలెక్టర్‌కు 4 ఫోన్ కాల్స్ వచ్చాయి. అనంతరం డిఆర్వో మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంపై అధికిఆరులు నిర్లక్ష్యం వహించవద్దన్నారు. శాఖల వారిగా సమావేశాలు ఏర్పాటు చేసుకుని త్వరితగతిన పరిష్కారం చేయాలని అధికారులకు ఆదేశించారు. పెండింగ్ ఫిర్యాదులపై లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ప్రాదాన్యత పథకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పథకాల అమలులో అధికారుల పాత్ర కీలకంగా ఉంటుందన్న విషయం మరిచిపోవద్దన్నారు. ప్రజావానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు విదిగా హాజరు కావాలన్నారు. అనుమతి లేకుండా గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ రాహుల్ శర్మ, ఆర్డీవో శ్రీనివాస రావు, ప్రభుత్వ శాఖల అధికారులు, తహశీల్దారులు పాల్గొన్నారు.

సింగరేణి అధికారుల్ని అడ్డుకున్న గిరిజనులు

- కాలుష్యంతో ప్రాణాలు పోతున్నాయంటూ ఆందోళన..

విజయక్రాంతి, ఇల్లందు: మా ఊరి దగ్గర ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు, మాకు ఈ కోల్‌యార్డు వద్దు, వెంటనే రద్దు చేయండి, కాలుష్యంతో మా ప్రాణాలు పోతున్నాయంటూ, సింగరేణి అధికారులను ఈర్యతండా వాసులు అడ్డుకున్నారు. తడికెలపూడి రైల్వే స్టేషన్, ట్రాక్ పక్కనే – ఈర్యతండా దగ్గర సింగరేణి యాజమాన్యం వే బ్రిడ్జి నిర్మించేందుకు నిర్ణయించింది. అందులో భాగంగా వే బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించి, కొలతలు వేయడానికి గాను సింగరేణి అధికారులు సోమవారం ఈర్యతండాకు వచ్చారు. గ్రామస్తులకు ఎలాంటి సమాచారం గాని, గ్రామ సభ నిర్వహించడం గాని, గ్రామ సభలో వే బ్రిడ్జి నిర్మాణం గురించి అక్కడి గిరిజనులకు వివరించి, అందుకు వారి నుంచి సమ్మతి పొందకుండానే, సింగరేణి అధికారులు హడావిడిగా అక్కడికి చేరుకుని ఊరిని ఆనుకునే స్థలాన్ని పరిశీలించి, వే బ్రిడ్జి నిర్మించేందుకు టేపుతో కొలతలు వేయడం ప్రారంభించారు. ఏమి జరుగుతుందోనని చూస్తున్న ఈర్యతండా వాసులకు అసలు విషయం తెలిసి, తీవ్రంగా స్పందించారు. వెంటనే గ్రామస్తులు మూకుమ్మడిగా కొలతలేస్తున్న అధికారుల్ని అడ్డుకున్నారు. ఇక్కడ వే బ్రిడ్జి నిర్మించడానికి వీలులేదని, అందుకు తాము అంగీకరించమని వారు అడ్డుపడ్డారు. దాంతో అధికారులకు, ఊరి ప్రజలకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది.

డివైజ్ ద్వారా నిందితులకు చెక్

- ఖమ్మం నగర ఏసీపీ వెంకట్రావ్

విజయక్రాంతి, ఖమ్మంటౌన్: మొబైల్ సెక్యూరిటి చెక్ డివైజ్ ద్వారా నిందితులను సులువుగా పసిగట్టే పింగర్ ఐడెంటిఫికేషన్ సిస్టం అందుబాటులో ఉందని ఖమ్మం నగర ఏసీపీ వెంకట్రావ్ వెల్లడించారు. సోమవారం ఖమ్మం డివిజన్ పోలీస్ సిబ్బందికి ఒక రోజు తరగతులను టిఎన్‌జీఓస్ పంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ రాష్ట్ర పోలీసులు పటిష్టమైన ప్రణాళికతో టెక్నాలజీ ఉపయోగిస్తూ ముందుకు వెళుతున్నారని ఆయన అన్నారు. నేరాలకు పాల్పడే నేరస్తులకు చెక్ పెట్టేందుకు ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని ఈ యాప్‌పై పోలీసులందరికి అవగాహన ఉండాలని ఆయన పేర్కొన్నారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ వాహనాల తనిఖీల్లో ఎవరైన అనుమానిత వ్యక్తుల్ని గుర్తించినట్లైతే వెంటనే మొబైల్ సెక్యూటి చెక్ డివైజ్ ద్వారా వేలిముద్రలు పరిశీలించినట్టయితే 30 సెకన్లలో రాష్ట్రంలో ఆ వ్యక్తి ఏ కేసులో ఉన్నా సమాచారం వెంటనే తెలిసిపోతుందన్నారు. తమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివిధ అప్లికేషన్లపై పూర్తి అవగాహన ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సిఐలు నరేందర్, షుకూర్, ఎస్ఐలు నరేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఎల్‌బీసీ నీటిని విడుదల చేయాలని రైతుల ధర్నా

విజయక్రాంతి, దేవరకొండ: టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పీఏపల్లి మండల రైతులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. సోమవారం అంగడిపేట స్టేజిపై అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌పై ఆయకట్టు రైతులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ పరిధిలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 15కి.మీలు కాలువ ద్వారా ఉట్లపల్లి, ఎల్లాపురం వరకు పోయి నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్‌లో కలుస్తుంది. పులిచర్ల, మేడారం, దుగ్యాల, చలకుర్తి, ఉట్లపల్లి అంగడిపేట, పిఏపల్లి గ్రామాల వ్యవసాయ పొలాలకు నీరందిస్తుంది. ఈగ్రామాల రైతులు రెండవపంటకు తమపొలాలను సాగు చేసుకుని వరినారు తదితర పంటలను వేసారు. కాని గత 15రోజులుగా ఎస్ఎల్‌బీసీ నుండి నీరువిడుదల కాలేదనీ, వేసిన పంటలు ఎండి పోతున్నాయనీ నీటి విడుదల చేయాలంటూ అధికారులకు విన్నవించుకున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఎసెల్‌బీసీ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆయకట్టు రైతులు అంగడిపేట స్టేజీపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.

విజయక్రాంతి Classifieds

బోర్ పాయింట్ చూపబడును
[illegible] భూమిలోనైన, మీ ఇంట్లో, ప్లాట్‌లోనైన గాని 100% [illegible] బోర్ పాయింట్ చూపబడును, వేయబడును. జలసిద్ధ్: 7396981999.

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా [illegible]

VK - 2158

కరీంనగర్‌లో హిందూ ధర్మాగ్రహ ర్యాలీ ఉద్రిక్తం

- బీజేపీ నేత బండి సంజయ్ అరెస్టు

విజయక్రాంతి, కరీంనగర్: హిందువులు పవిత్రంగా భావించే కేరళలోని శబరిమలలోగల అయ్యప్ప స్వామి దేవస్థానాన్ని అపవిత్రం చేస్తూ హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్న కేరళ ముఖ్యమంత్రి విజయన్ తీరుకు నిరసనగా బీజేపీ నేత బండి సంజయ్ ఆధ్వర్యంలో తలపెట్టిన హిందూ ధర్మాగ్రహ ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. పవిత్ర దేవాలయం అయిన శబరిమలలో మహిళలు అక్రమంగా దర్శించుకోవడం, హిందువులపై కేరళలో దాడులను నిరసిస్తూ కరీంనగర్‌లో సోమవారం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండి సంజయ్ ఆధ్వర్యంలో స్థానిక సర్కస్ గ్రౌండ్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు.

బీజేపీ నాయకులు, కార్యకర్తలు, హిందువాదులు పెద్ద ఎత్తున ర్యాలీకి హాజరై నినాదాలు చేస్తు తెలంగాణ చౌక్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించేందుకు బీజేపీ నాయకులు బండి సంజయ్ ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ అయ్యప్ప స్వామి సన్నిధానాన్ని అపవిత్రం చేస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్న కేరళ ప్రభుత్వం యొక్క హిందూ వ్యతిరేఖ విధానాలను భారతీయ జనతాపార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు.



అపవిత్రం చేయడమే మీ లక్ష్యమా..

సుప్రీం కోర్టు ఆదేశాలుప్రకారం నడుచుకుంటామన్న కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ దానికి భిన్నంగా దేవుళ్లను నమ్మకుండా హిందూ విశ్వాసాలను పరిగణలోకి తీసుకోకుండా వ్యవహరించి ఇద్దరు మహిళలను బలవంతగా నియమ నిబంధనలకు విరుద్ధంగాస్వామి వారి దర్శనానికి పంపించిన ఘటన పూర్తి హిందూ సమాజాన్ని కలచివేసిందని అన్నారు. భక్తులు కాని వారిని బలవంతంగా కాని, అడ్డదారిలో కాని పంపించాలని సుప్రీం కోర్టు ఆదేశించలేదన్న విషయాన్ని కేరళ ప్రభుత్వం గ్రహించకపోవడం ద్వారా హిందువుల మనోభావాలు దెబ్బతీయడమే కాకుండా అయ్యప్పస్వామి వారి సన్నిధానాన్ని అపవిత్రం చేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టం అవుతుందని అన్నారు. కోట్లాది మంది భక్తుల విశ్వాసాలను పరిగణలోకి తీసుకొని మంచి ఆలోచనతో వ్యవహరిస్తూ ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించి శాంతి భద్రతలను కాపాడాల్సిన కేరళ ముఖ్యమంత్రి వ్యవహారశైలి అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తుందని అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న హిందు సంస్థల నాయకులు, కార్యకర్తల పట్ల అమానుషంగా వ్యవహరిస్తూ దాడులతో పాటు హత్యాకాండలను ప్రేరేపిస్తున్న కేరళ ముఖ్యమంత్రి వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

ఇప్పటికే కేరళలో అనేక మంది బీజేపీ, హిందు సంస్థల కార్యకర్తలు నాయకుల ఇళ్లపై బాంబులతో, మారణాయుధాలతో కమ్యునిస్తు పార్టీకి చెందిన కార్యకర్తలు దాడులు చేస్తున్న సంఘటనలు చూసి కేరళ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతున్నట్లు స్పష్టమౌవుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రజ్ఞాభారతి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు నరహరివిజయభారతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బాస సత్యనారాయణరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కొట్టె మురళీకృష్ణ, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బోయిన్‌పల్లి ప్రవీణ్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, నగర అధ్యక్షుడు బేతి మహేందర్, నాయకులు రాపర్తి విజయ, కొరటాల శివరామయ్య, కడార్ల రతన్‌కుమార్, దాసరి రమణారెడ్డి, ఎన్నం ప్రకాశ్, గాజె రమేష్, బండ రమణారెడ్డి, కటకం లోకేష్, సంపత్,సింగిరాల రామరాజ్, మంతెన కిరణ్, కచ్చు రవి, ఉప్పరపెల్లి శ్రీనివాస్, చెల్లోజు చిట్టిబాబు, ఆకుల నరేష్, దేవిశెట్టి నవీన్, మాసం గణేష్, కావేటి కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

గత ఎన్నికల్లో లెక్కలు చూపని నేతలకు నోఛాన్స్

- పంచాయతీ రణరంగానికి జిల్లాలో 1593 మంది దూరం
- న్యాయస్థానం నుంచి స్టే పొందిన 6 గురు

విజయక్రాంతి, పెద్దపల్లి: గత పంచాయతీ ఎన్నికల్లో లెక్కలు చూపని కారణంగా పెద్దపల్లి జిల్లాకు చెందిన 1593మంది తాజా ఎన్నికల్లో పోటీచేసేందుకు అనర్హులుగా మిగిలారు. గతంలో వార్డు సభ్యులుగా, సర్పంచ్‌లుగా, ఎంపిటీసీ సభ్యులుగా పోటీచేసి గెలిచిన వారు, ఓడిన అభ్యర్థులు తమ ఎన్నికల వ్యయం వివరాలను చూపని కారణంగా ప్రభుత్వం ఎన్నికల నియమావళి ప్రకారం సదరు అభ్యర్థులపై వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకుండా వేటు వేసింది. అయితే అప్పట్లో అంతగా పట్టించుకోని సదరునేతలు తాజాగా పంచాయితీ ఎన్నికలు రావడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలో ఎలాగైనా ఎన్నికల్లో పోటీచేయాలని దారులు వెతుకుతున్నారు. పలువురు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టేఉత్తర్వులు పొందారు ఈలెక్కన వారు ఎన్నికల్లో పోటీచేసేందుకు తాత్కాలికంగా అర్హులే అవుతున్నప్పటికి, భవిష్యత్‌లో ఈ కేసుతీర్పు ప్రతికూలంగా ఉంటే ఎన్నికల్లో గెలిచిన అనర్హులవుతారు. ప్రస్తుతం ఆరుగురు అభ్యర్థులు న్యాయస్థానాలను ఆశ్రయించి పోటీచేసేందుకు స్టే ఉత్తర్వులు తెచ్చుకున్నారు. రిజర్వేషన్లు అనుకూలంగా లేని ఎంతో మంది నాయకులు అనర్హులుగానే మిగిలిపోవాలని నిర్ణయించుకున్నారు. మరికొందరు గ్రామస్థాయి నాయకులు సతీమణులు అనర్హులుగా ఉంటే, భర్తలు రంగంలోకి దిగుతున్నారు. భర్తలు అనర్హులుగా ఉంటే సతీమణులను పోటీకి దింపుతున్నారు. కాగా, అనర్హులుగా ప్రకటించిన వారు పోటీచేస్తే స్క్యూటీన్‌లో నామినేషన్లను తిరస్కరించేలా చూసేందుకు పావులు కదుపుతున్నారు. ఈ నేపథ్యంలో పంచాయితీ ఎన్నికల రాజకీయాలు గ్రామాల్లో వేడెక్కాయి.

పోటీకి దూరంగా మరెందరో...

నిబంధనల కారణంగా పల్లెల్లో సర్పంచ్‌లుగా, వార్డుసభ్యులుగా పోటీ చేసేందుకు పలువురు నాయకులకు అవకాశం లేకుండా పోతోంది. రైతు సమన్వయ సమితి సభ్యులు, చైర్మన్‌లు ముందుగా తమ పధవులకు రాజీనామాలు సమర్పించిన పిదపనే నామినేషన్లు వేయాలి. మండల సభ్యులు ఏడీకి, జిల్లా స్థాయి సభ్యులు జేడీకి రాజీనామాలు సమర్పించాల్సి ఉంటుంది. అలాగే 1995 జూన్1 తరువాత ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉంటే ఆవ్యక్తి పోటీచేయడానికి అనర్హుడు. ఈ గడువులో ఇద్దరికంటే ఎక్కువ పిల్లలు కలిగి ఉండి దత్తత ఇవ్వడం చెల్లదు. ఉద్యోగులు రాజీనమా ఆమోదం పొందిన తరువాతనే పోటీచేయాల్సి ఉంటుం ది. అంగన్‌వాడి వర్కర్లు, నీటి వినియోగదారుల సంఘం సభ్యులు పోటీచేయడానికి అర్హులు కారు.

హక్కుల పరిరక్షణకు కార్మికులు ఉద్యమించాలి

విజయక్రాంతి, మిర్యాలగూడ: కార్మికులు, ఉద్యోగులు ఉద్యమాలు చేయడంతోనే హక్కులు సాధించబడతాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ వారి జీవితాలకు మనుగడ లేకుండా చేస్తుందన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక సామాన్యులు జీవించలేని పరిస్థితి నెలకొందన్నారు. అనేక హామీలిచ్చి గద్దెనెక్కాక కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న పరిశ్రమలు మూతపడేలా చేసి నిరుద్యోగ సమస్య పెంచుతున్నారన్నారు. నిత్యావసరాల ధరలు అడ్డూ అదుపు లేకుండా పెరుగుతున్నాయని, కార్మికులకు ఉపయోగపడే చట్టాలు కూడా అమలు చేయడం లేదని, ఉన్న చట్టాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా మారి కార్మిక, ఉద్యోగుల శ్రమను దోచుకుంటున్నారని, కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని సుప్రీంకోర్టు సూచించినా దాన్ని అమలు చేయలేదన్నారు. జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు నేడు, రేపు జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డబ్బికార్ మల్లేష్, సహాయ కార్యదర్శి మహ్మద్‌బీన్‌సయాద్, పట్టణ కార్యదర్శి తిరుపతి రాంమ్మూర్తి, నాయకులు పగిడోజు రాంమ్మూర్తి, చంద్రశేఖర్ యాదవ్, గునగంటి రాంచంద్రు, శివరాజు, నల్లగుంట్ల సోమయ్య, నర్సయ్య, బ్రహ్మచారి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, BADDAM GANGA REDDY, R/o. H.No. 5-104, Uploor Village, Kammarpally Mandal, Dist Nizamabad (TS), India. Here state that my father name in my Passport no. L2771993 were wrongly mentioned as BADDAM GANGARAM. Actually my father correct name is BADDAM CHINNA GANGARAM.

CHANGE OF NAME

I, BADDAM GANGA REDDY, R/o. H.No. 5-104, Uploor Village, Kammarpally Mandal, Dist. Nizamabad (TS), India. Here state that my mother Name is my Passport No. L2771993 were wrongly mentioned as BADDAM RAJU. Actually my mother correct name is BADDAM DEVAI.

CHANGE OF NAME

I, BADDAM GANGA REDDY, S/o. BADDAM CHINNA GANGARAM, R/o. H.No. 5-104, Uploor Village, Kammarpally Mandal, Dist. Nizamabad (TS), India. Here state that my Name in my Passport No. L2771993 were wrongly mentioned as BADDAM GANGADHER. Actually my correct name is BADDAM GANGA REDDY.

పత్తి రైతులపై సీసీఎస్ గుదిబండ

- సీసీఎస్ కొనుగోళు కేంద్రం వద్ద రైతుల ఆందోళన..
- కొనుగోళ్లు చేపట్టాలనీ రోడ్డుపై బైఠాయించిన రైతులు..

విజయక్రాంతి, వేములవాడ: రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోగా.. పత్తిని కొనుగోళు కేంద్రానికి తీసుకవచ్చినా తీసుకోకుండా రైతులను పడిగాపులు కాచేలా అధికారులు తీసుకున్న నిర్ణయానికి రైతుల రోడ్డెక్కారు. తాము ఇప్పిటికే ఆశించినంతగా దిగుబడులు రాక పెట్టుబడులు మీద పడ్డాయనీ ఆవేదనలో ఉంటే, పండి కాస్త పత్తిని కొనుగోలు చేయకుండా సీసీఎస్ అధికారులు రైతులు పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారనీ పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ నియోజక వర్గ పరిధిలోని కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని సీసీఎస్ కొనుగోలు కేంద్రానికి ఆయా గ్రామాల నుండి పత్తి రైతులు వాహనాల్లో పత్తిని తీసుకోని రాగా, అధికారులు కొనుగోళ్లు ప్రారంభించకుండా నిలిపివేశారు. దీంతో పొద్దున కేంద్రానికి వచ్చిన పత్తి రైతులు అధికారులను ఎంత బతిమిలాడిన పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు. దీంతో తేమ మిషన్ అందుబాటులో లేదనీ, దానికి తీసుకవచ్చిన తరువాత కొనుగోళ్లు చేపడతమని చెప్పిన అధికారులు కొంత వరకు పత్తిని కొనుగోలు చేసి, మిగితా పత్తిని కొనుగోళు చేయకుండా నిలిపివేశారు.

తేమశాతం పేరుతో రైతులకు ఇబ్బందులు

సీసీఎస్ కేంద్రానికి పత్తిని విక్రయించేందుకు పత్తిని తీసుకవచ్చిన రైతులకు అధికారులు తేమ శాతం పేరుతో కొర్రిలు పేడుతున్నారు. కొద్ది రోజులుగా సీసీఎస్‌కు పత్తిని విక్రయించేందుకు రైతులు రాకపోవడంతో కేంద్రం వెల వెలబోయింది. రెండు మూడు రోజులుగా పత్తిని దళారులు తక్కువ ధరకు కొనుగోళ్లు చెపట్టడంతో రైతులు గత్యంతరం లేక సీసీఎస్ కేంద్రానికి తీసుకరావడంతో రైతుల పత్తి బెళ్లు పెరిగిపోయాయి. దీంతో రైతులు తీసుకవచ్చిన పత్తిలో తేమ శాతాన్ని బట్టి కొనుగోళ్లు చేపట్టడమే కాకుండా ధరను నిర్ణయం తీసుకుంటామని మొండికేస్తున్నారు.

పత్తి కొనుగోళ్లు చేపట్టాలనీ రోడ్డెక్కిన రైతులు..



పత్తి కొనుగోళ్ల కేంద్రం సుద్దాల గ్రామానికి తీసుకవచ్చిన రైతులకు నిరాశే ఎదురైంది. ఎందుకంటే తేమ శాతం మిషన్ అందుబాటులో లేదనీ, ధర లేదనీ అధికారులు చెపడ్డంతో రైతులు చుక్కెదురైంది. కేంద్రాని తీసుకవచ్చిన పత్తిని కొనుగోళు చేసే వరకు ఇక్కడి నుండి వెళ్లెది లేదనీ, వేములవాడ– కోనరావుపేట రహదారి పై బైఠాయించి రైతులు అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటునే రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదనీ రైతులు ఆరోపించారు. ఇప్పటికైనా రైతులు తీసుకవచ్చిన పత్తిని కొనుగోళ్లు చేపట్టి రైతులను ఆదుకోవాలనీ వారు డిమాండ్ చేశారు.

ఆంధ్రా బ్యాంక్
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
కాచిగూడ బ్రాంచ్
3-2-844 & 844A, ఖద్రుక కాలేజ్ దగ్గర, స్టేషన్ రోడ్, కాచిగూడ, హైదరాబాద్, పిన్-500027

అమ్మకం గురించి తెలియజేస్తూ రుణగ్రహీతకు నోటీసు (30 రోజుల నోటీసు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 6(2)/8(6))

రుణగ్రహీత పేరు: మెసర్స్ అల్లూరి ఓవర్‌సీస్ ప్రైవేట్ లిమిటెడ్, ప్లాట్ నం. 92, రోడ్ నం. 72, ప్రశాసన్ నగర్, రోడ్ నం. 17, జూబ్లీహిల్స్, హైదరాబాద్, పిన్-500033.

[illegible]

GHMC [illegible]

ప్రదేశం: హైదరాబాద్, తేదీ: 05-01-2019 సం/- అధీకృత అధికారి, ఆంధ్రా బ్యాంక్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
RACPC-L.B.నగర్, మన్సూరాబాద్, L.B.నగర్ దగ్గర, హైదరాబాద్-500068.
స్వాధీనత ప్రకటన (స్థిరాస్తులు కొరకు)

[illegible]

తేదీ: 03-01-2019, ప్రదేశం: హైదరాబాద్ అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

గ్రామాల్లో పంచాయతీ సందడి

- ఏకగ్రీవ నజరానాపై అభ్యర్థుల నజర్

విజయక్రాంతి, నాగార్జునసాగర్: అన్న నేను ఐదులక్షల రూపాయలు ఇస్తనే.. ఈ ఒక్కసారికి నన్ను మనూరికి సర్పంచ్‌ను చేయండ్రి చాలు.. రాత్రి పట్నం నుంచి పంతులొచ్చిండు ఆయన్ను ఏకగ్రీవం చేస్తే మనూరికి పదిలచ్చల రూపాయలు ఇస్తన్నడంట మరేంచేద్దాం నీవే చెప్పు తమ్మి.. ఇది ప్రస్తుతం పెల్లెలో జరుగుతున్న తతంగం..

మరో వారం రోజుల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో గిరాకి ఉన్న గ్రామాల్లో సర్పంచ్ పదవికి పలుకుతున్న ధరలు ఇవి. డబ్బులున్న వారే రాత్రికి రాత్రి సర్పంచ్ పదవి కొనుక్కున్నేందుకు వేలం పాటలు. మంచి మానవత్వం.. సేవాధృకృధం ఇవేవి కానరుకుండా చేస్తున్నారు ఈ డబ్బులున్నోళ్లు. సర్పంచ్ అంటే ఒక గౌరవప్రదమైన పదవి, అలాంటి పదవిని దక్కించుకునేందుకు డబ్బులున్న మారాజులు అడ్డదారులు తొక్కుతు డబ్బులను ఎగజల్లేందుకు ఊళ్లలో మకాం వేశారు.

ఏకగ్రీవ నజరానాలకు పురుగొల్పుతున్న పార్టీలను దిక్కరిస్తు సరైన నాయకున్నే ఎన్నుకునేందుకు అడుగులు వేస్తున్నాయి పల్లెలు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఏకగ్రీవానికి ముందుకు వస్తున్న పార్టీలను వారి తరుపున ఉన్న నాయకులను ఒకటికి రెండుసార్లు ఆలోచించి ప్రజాపక్షాన నిలబడే నాయకునికే తమ మద్ధతు ప్రకటిస్తామంటు ఓటర్లు మరింత నొక్కానించి చెబుతున్నారు. అధికార టీఆర్ఎస్ నుంచి పోటీలో ఉండే నాయకులు గ్రామాభివృద్ధికి వేలం పాట ద్వారా నిధులు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు.

నాగార్జునసాగర్ నియోజకవర్గంలో త్రిపురారం, నిడమనూరు, పెద్దవూర, తిరుమలగిరి, గుర్రంపోడు మండలాల్లో ఈపోటీ తీవ్రత అధికంగా ఉంది. నియోజకవర్గంలో సుమారు 175 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరుగనున్నాయి. వీటిల్లో అధికశాతం అధికారపార్టీ నుంచే పోటీదారుల్లో ఉన్నారు.

మేజర్ పంచాయతీల్లోనే ఈపోటీ తీవ్రంగా ఉంది. చిన్నపాటి పంచాయతీల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు ఎవరూ ముందుకు రావడం లేదు. అయితే ఈ ఎన్నికల్లో ఎక్కువ శాతం యువతనే సర్పంచ్‌లుగా పోటీ చేసేందుకు ఆసక్తి కనబర్చడం చర్చనీయాంశం అయింది. ఏదేమైనా రానున్న ఎన్నికల్లో యువత ఓట్లు కీలకం కావడంతో పాటు పోటీలో ఉన్న యువత కూడా ఏమేర విజయం సాధిస్తారో వేచి చూడాల్సిందే. గెలుపుపై ఎవరి ధీమా వారే వ్యక్తం చేస్తుండటంతో అధికారం టీఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థుల సంఖ్య మరింతగా పెరిగిపోతుంది. అధికారపార్టీలో పెరిగిపోతున్న అసమ్మతి కొంతైనా తమకు ఉపయోపడుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు.



లింగ సమానత్వానికి చాలా దూరం...!

మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నా ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో లింగ భేదం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఆర్థికం, రాజకీయం, ఉద్యోగం ఇలా దాదాపు అన్ని రంగాల్లో ఇంకా మహిళలు వివక్షకు గురవుతూనే ఉన్నారు. అంతర్జాతీయంగా అధ్యయనం చేసిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం స్త్రీ పురుష సమానత్వం సాధించడానికి ఇంకా 200 ఏళ్ల పడుతుందని తేల్చింది. భారతదేశంలోని ఆర్థిక రంగంలో ఉన్న లింగ అసమానతలను పరిష్కరించుకోవాల్సిన తక్షణ ఆవశ్యకతను వరల్డ్ ఎకనమిక్ ఫోరం నొక్కి చెప్పింది. దేశంలో, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అవకాశాలు, రాజకీయ సాధికారత, విద్య, ఆరోగ్య రంగాల్లో స్త్రీపురుష అంతరాలను కొలమానంగా తీసుకుని లింగపరమైన ఆర్థిక అసమానతలను అంచనా వేసింది. మన దేశంలో కొనసాగుతున్న అసమానతలపై దృష్టి సారించాలని చెప్పింది. ఆరోగ్యం విషయంలో గత దశాబ్దకాలంగా ప్రపంచంలోనే మన దేశం చివరి నుంచి మూడో స్థానంలో ఉండటం ప్రమాదానికి సంకేతంగా వరల్డ్ ఎకనమిక్ ఫోరంపేర్కొంది. రాజకీయ సాధికారతలో మాత్రం భారత్ కొంత మెరుగ్గా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా రాజకీయ సాధికారతలో మన దేశం 15వ స్థానంలో ఉండగా, 33వ స్థానంలో యుకె, 54వ స్థానంలో అమెరికా ఉన్నాయి. బంగ్లాదేశ్, శ్రీలంకతో పోలిస్తే మన దేశం లింగ అసమానతలను జయించటానికి చాలా విషయాలను మెరుగుపర్చుకోవాలని పేర్కొంది. దేశంలో 100 ప్రధాన కంపెనీల్లో కేవలం 5 శాతం మంది మహిళలు మాత్రమే కీలక స్థానాల్లో ఉన్నారు. అలాగే అతి కొద్ది మందికి మాత్రమే నూతన కంపెనీల స్థాపనకు ఆర్థిక తోడ్పాటు ఇచ్చారు. ప్రపంచ దేశాల్లో ఐస్‌లాండ్ గత పదేళ్లగా మహిళా సాధికారతలో మెరుగ్గా ఉంది. సమాన వేతన విధానాలు, మహిళల అవసరాలకు తగినట్లుగా గర్భిణులకు ప్రత్యేక ప్రోత్సాహ కాలు, అవకాశాలు కల్పించడం, ప్రసవానంతరం మహిళలకు చట్టబద్ధమైన ఉద్యోగ భరోసా ఇవ్వడం ద్వారా స్త్రీ పురుషుల ఆర్థిక అంతరాలను కొంతవరకైనా తగ్గించవచ్చని నిపుణుల అభిప్రాయం.

అగ్రవర్ణాల పేదలకు రిజర్వేషన్లు స్వాగతయోగ్యం

ఆర్థికంగా వెనుకబడిన అగ్రకులాల ప్రజలకు విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ఉద్యోగ నియామకాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సోమవారం మోడీ కేబినెట్ తీసుకున్న నిర్ణయం విప్లవాత్మకమైనది. మిగతా రిజర్వేషన్లను స్పృశించకుండా, వాటిని తగ్గించకుండా ఈబీసీ రిజర్వేషన్లకు నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ రిజర్వేషన్ సదుపాయం అమలు కావాలంటే కొన్ని షరతులు కూడా విధించింది. కేంద్ర క్యాబినెట్ నిర్ణయం మేరకు రూ.8లక్షల లోపు వార్షికాదాయం ఉండి, అయిదెకరాల లోపు వ్యవసాయ భూమి, వెయ్యి చదరపు అడుగుల లోపు ఇల్లు, మునిసిపాలిటీలో 109 గజాల ఇల్లు ఉన్న అగ్ర వర్ణ పేదలు ఈబీసీ కోటాకు అర్హులు.

అయితే ఈ రిజర్వేషన్లు అమలు చేస్తే మొత్తం రిజర్వేషన్ల వాటా 59 శాతానికి పెరుగుతుంది. 1992లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రస్తుతం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదు. ప్రస్తుతం బీసీలకు 27 శాతం, షెడ్యూల్డు కులాలకు 16 శాతం, షెడ్యూల్డు తెగలకు రిజర్వేషన్లు ఉన్నాయి. కేంద్రం నిర్ణయం మేరకు ఈ రిజర్వేషన్లలో ఎలాంటి తగ్గుదలా ఉండబోదు. అంటే వారి రిజర్వేషన్లు యథాతథంగా ఉంటూనే అదనంగా పదిశాతం రిజర్వేషన్లు ఇవ్వడం జరుగుతుంది. దీని కోసం రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఉంటుంది. అగవర్ణాల రిజర్వేషన్ బిల్లును వీలైనంత త్వరగా ప్రవేశపెట్టాలన్నదే మోడీ ప్రభుత్వం ఆలోచన.

ఆంధ్రప్రదేశ్‌లో కాపులు, ఉత్తరాదిలో జాట్లు, గుజరాత్‌లో పటేళ్ల వంటి ఉన్నత సామాజిక వర్గాలు తమ తమ కులాల్లోని పేదలకు ఉద్యోగం, ఉపాధి, విద్యావకాశాలు కావాలని ఇప్పటికే ఆందోళన బాట పట్టాయి. అగ్రవర్ణాలలోని పేదలలో ఈ విషయంలో తీవ్ర అసంతృప్తి కూడా ఉంది. గుజరాత్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో ఈ అసంతృప్తి ఎన్నికల ఫలితాలపై ప్రభావం కూడా చూపింది. నిజానికి ఆర్థిక కారణాల వల్ల వెనుకబడిన అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, గతంలోఅవిభక్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖర రెడ్డిలు పలు సార్లు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పేద అగ్రవర్ణాల వారికి సాయం చేసేందుకే బ్రాహ్మణ కార్పొరేషన్ల వంటి సంస్థలకు ఈ ప్రభుత్వాలు పురుడు పోశాయి. అలాగే కాపు రిజర్వేషన్లను కోరుతూ, రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ తీర్మానాన్ని కూడా ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపింది.

అగ్రవర్ణాలలోని పేదలకు పది శాతం రిజర్వేషన్లను ఏ పార్టీ రాజకీయంగా వ్యతిరేకించే పరిస్థితి ఉండదు. ఇలా చేస్తే వారికి అగ్రవర్ణాల ఓట్లు పోయే ప్రమాదం ఉంది. కాబట్టి రాజకీయ పార్టీలు అగ్రవర్ణాల ఓట్ల కోసమైనా మౌనాన్ని పాటించాల్సి ఉంటుంది. బీజేపీ ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించాల్సి ఉంటుంది. ఈ బిల్లును ఆమోదింపజేసేందుకు శీతకాల సమావేశాలను మరో రెండు రోజుల పాటు పొడిగించేఅవకాశం కూడా ఉంది. మంగళవారం బిల్లును ప్రవేశపెట్ట వచ్చునని కూడా తెలుస్తోంది. ఈబీసీ బిల్లుకు పార్లమెంట్లో మూడింట రెండొంతుల మెజార్టీ అవసరం ఉంది. అయితే లోక్‌సభలో బిల్లు ఆమోదానికి అడ్డంకి ఉండకపోవచ్చు. కానీ రాజ్యసభలో రాజకీయ ఇబ్బందులు ఉండే అవకాశం ఉంది. కానీ అదే జరిగితే బీజేపీ దీని నుంచి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం ఖచ్చితంగా చేస్తుంది. తాను ఉన్నత కులాల్లోని పేదల కోసం రిజర్వేషన్లు ఇచ్చే ప్రయత్నం చేసినా విపక్షాలు అడ్డుకున్నాయని, మళ్లీ అధికారంలోకి రాగానే ఇస్తానని మోడీ చెప్పుకునే అవకాశం ఉంది.

ఎన్నికలకు సరిగ్గా నెలా రెండు నెలల సమయం మాత్రమే ఉండగా ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక రాజకీయాలు ఉన్నాయని కొందరు భావించడం సహజం. కానీ 2009 ఎన్నికలకు ముందు నోటిఫికేషన్ కొద్ది రోజుల్లో వెలువడుతుందనగా మన్మోహన్ సింగ్ నాయకత్వంలోని యుపీఏ ప్రభుత్వం రూ. 50000 కోట్ల మేరకు రైతు ఋణమాఫీని ప్రకటించింది. అదే విధంగా నంద్యాల ఉప ఎన్నిక సమయంలో కేవలం నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో మాత్రమే డ్వాక్రా ఋణమాఫీ మొత్తం లబ్ధిదారుల ఖాతాలో వేయడం జరిగింది. గత ఎన్నికల్లో నోటిఫికేషన్‌కు కొద్ది రోజుల ముందే ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో రైతు ఋణమాఫీని తెరమీదకి తీసుకురావడం జరిగింది. అవన్నీ రాజకీయ అవకాశం కాదు, కేవలం బీజేపీ చేస్తున్నది మాత్రమే రాజకీయ అవకాశవాదమని వాదించడం సరైనది కాదు.

ఇళ్ల నిర్మాణంలో జాప్యం

తెలంగాణ ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా చేపట్టిన రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణ పథకం అమలులో జాప్యం జరుగుతోంది. నాలుగేళ్ల కిందట ప్రారంభించిన పథకంలో జిల్లాలో కొన్ని ఇళ్ల నిర్మాణం పూర్తికాగా వాటిలో గృహ ప్రవేశం జరగలేదు. మరోవైపు లబ్ధిదారుల ఎంపికలో కూడ జాప్యం జరుగుతోంది. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గంలో రెండుపడక గదుల ఇళ్ల నిర్మాణం కోసం 23 గ్రామాల్లో స్థలాలను ఎంపిక చేశారు. మొత్తం 4049 మంది లబ్ధిదారులకు ఆ స్థలాల్లో ఇళ్లు కట్టించే బాధ్యతలను పంచాయతీరాజ్, ఆర్‌అండ్ బి శాఖ అధికారులకు అప్పగించారు. ఆదిలాబాద్ పట్టణంలో 582 ఇళ్లను ఆర్‌అండ్ బికి , 900 ఇళ్లను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 318 ఇళ్లకు కాంట్రాక్టులతో ఒప్పందం పూర్తయి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. కొన్నిచోట్ల పునాదులు తవ్వి వదిలేయగా, మరికొన్ని చోట్ల ఇసుకను వేసి పనులు ప్రారంభమైనట్లుగా నివేదికల్లో పేర్కొంటున్నారు. బోథ్ నియోజకవర్గంలో కొన్నిచోట్ల నిర్మాణాలు చేపట్టేందుకు కాంట్రాక్లర్లు ముందుకు రావడం లేదు. పట్టణ ప్రాంతంలో ఇంటి నిర్మాణానికి రూ.5.30 లక్షలు, గ్రామీణ ప్రాంతంలో రూ.5.04లక్షల చొప్పున ధర నిర్ణయించారు. ఈ ధరలో ఇళ్లు కట్టడం కష్టమని భావిస్తున్న కాంట్రాక్లర్లు ఒక్కోచోట మూడు నాలుగుసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రావటం లేదు. ఇటీవల ఇనుము, సిమెంటు, ఇసుక, ఇటుక ధరలు పెరగడంతో పాటు భవననిర్మాణ కార్మికులు తమ కూలీ పెంచారు. ఇవన్ని కాంట్రాక్లర్లు రాకపోవటానికి కారణమని అధికారవర్గాలు అంటున్నాయి. కొన్ని చోట్ల పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించలేదు. పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించటంతోపాటు, అన్ని ఇళ్లు నిర్మించేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నారాయణరావు, బోథ్

శిథిలమవుతున్న పురాతన కట్టడాలు

అద్భుత శిల్ప కళా సంపద శిథిలమవుతున్నా పురావస్తుశాఖ పట్టించుకోవటం లేదు.అలనాటి కాకతీయుల కట్టడాలు ప్రాభవం కోల్పోతున్నాయి. నిత్యం పూజలు, అభిషేకాలు, భక్తుల సందర్శనలతో కళకళలాడే దేవాలయాలు కళ తప్పుతున్నాయి. చరిత్ర కాలగర్భంలో కలిసిపోతోందా అన్న సందేహాలు వ్యక్త మవుతున్నాయి. పురాతన ఆలయాలు, కట్టడాల కింద గుప్త నిధులు ఉన్నాయన్న దురాశతో కొంత మంది ముఠాలుగా ఏర్పడి రాష్ట్రవ్యాప్తంగా తవ్వకాలు చేపడుతున్నారు. కాకతీయుల కాలంలో ప్రాధాన్యత సంతరించుకున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం మండలంలోని రామప్ప ఆలయం, చుట్టూఉన్న ఆలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు రామప్ప గుడిలోని రామలింగేశ్వర స్వామిని దర్శించుకుంటారు. ఆలయం ముందు గల నల్లరాయి నంది విగ్రహం ఆకర్షనీయంగా ఉన్నా ముందు తలభాగం దెబ్బతింది.గుప్త నిధుల కోసం రామప్ప ఆలయం చుట్టూ తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. ఇదే జిల్లా గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్ల పరిస్థితి అంతే.ఇక్కడ ఉన్న గణపేశ్వర ఆలయం పై భాగం శిథిలమై వర్షం వస్తే నీరంతా గుడిలోపలకు వస్తోంది. కేంద్ర పురావస్తుశాఖ అధీనంలో గల ఈ ఆలయాలు వారి నిర్లక్ష్యం వలన ఎలాంటి అభివృద్ధికి నోచుకోవటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడ కాకతీయుల కాలం నాటి ఆలయాల అభివృద్ధికి ఎలాంటి నిధులు విడుదల చేయటం లేదు.శిథిలావస్థకు చేరిన ఆలయాలను చూసి చరిత్రకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆలయాలు, పర్యాటక ప్రదేశాలకు పూర్వవైభవం తీసుకురావాలి.

–కామిడి సతీష్‌రెడ్డి, జడలపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

పరమాత్మ సర్వాంతర్యామి

పరమాత్మ ఎక్కడో దూరంగా ఆకాశంలో లేడు. ఆయన ప్రపంచం నిండా నిక్షిప్తమై ఉన్నాడు. ప్రతి జీవిలో జీవాత్మగా ఉండి వారి ఆలోచనలు, మాటలు, క్రియలు గమనిస్తుంటాడు.

ఆ పరమాత్మనే వివిధ మతాలవారు, వివిధ నామములతో, వివిధ పద్ధతులలో కొలుచుకుంటారు. నామములు వేరైనా నామి ఒక్కరే.

పురాణగాథ – హిరణ్యకశిపుడు శివుడి గురించి తపస్సుచేసి, తనకు నరులతోగాని, మృగముతో గాని, ఇంటిలో గాని, బయటగాని, భూమి మీద గాని, ఆకాశంలో గాని, ఏ ఆయుధంతో గాని, పగలు గాని, రాత్రి గాని మరణం సంభవించగూడదని వరం పొందుతాడు. వర గర్వంతో, తానే దైవం అని ప్రజలంతా తననే దైవంగా భావించి పూజలు చెయ్యాలని కట్టడి చేశాడు. కాని అతని కుమారుడు ప్రహ్లాదుడు శ్రీహరి భక్తుడు – పరమాత్మ అంతటా, అందరిలో ఉన్నాడని చెప్పినా తండ్రి అంగీకరించక, ప్రహ్లాదుడిని తన దారికి తేవాలని, నానా హింసలు పెట్టి, చివరకు స్తంభంలో శ్రీహరిని చూపించమని, స్తంభాన్ని పగులగొట్టగా, అందులోనుండి శ్రీహరి మనిషి, మృగం కాని నరసింహావతార రూపంలో ప్రత్యక్షమై, గడపపై, తన తొడలమీద పెట్టుకొని సంధ్యా సమయంలో, హిరణ్యకశిపుడి పొట్టను తన గోళ్ళతో చీల్చి సంహరిస్తాడు. తండ్రిని క్షమించి, సద్గతి కలిగించమని, ప్రహ్లాదుడు శ్రీహరిని ప్రార్థిస్తాడు.

కథ: ఒక గురవు గారు తన శిష్యులకు పరమాత్మ అంతటా నిండి ఉన్నాడని పాఠం చెప్పి, తలా ఒక పండు ఇచ్చి, ఎవరూ చూడకుండా తిని రమ్మని పంపించాడు. కొందరు గదిలోకి వెళ్ళి తలుపుమూసి తిన్నారు, మరి కొంతమంది గోడ చాటున, చెట్టు చాటున దాగి తిన్నారు. ఒక శిష్యుడు మటుకు పండు తినకుండా వెనక్కు వచ్చాడు. ఎందుకు తినలేదని గురవుగారు అడిగితే, పరమాత్మ అంతటా నిండి ఉన్నపుడు, ఆయన చూడకుండా తినటం ఎలా సాధ్యం అని బదులు ఇచ్చాడు. గురవుగారు అతనికి పాఠం సరిగ్గా అర్థం అయిందని మెచ్చుకున్నారు.

తప్పు జరిగితే క్షమించమని అడిగే సంస్కారం ఉండాలి

అన్ని తప్పులు మనమే చేసి అనుభవం సంపాదించి, సరి చేసుకోవటానికి మనిషి జీవితం చాలదు. కనుక ఇతరులు సాధించిన విజయాలనుండి నేర్చుకోవాలి. మన వలన ఏదైనా తప్పు జరిగితే లేక ఇతరులకు మనవలన నష్టం, కష్టం కలిగితే, ధైర్యంగా ఒప్పుకొని, క్షమించమని అడిగే సంస్కారం ఉండాలి. తప్పుచేసి తప్పించుకోటానికి చూస్తే అది ఇంకో తప్పవతుంది. తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలి. ఇతరుల తప్పులను సహృదయంతో క్షమించే సంస్కారం ఉండాలి. విమర్శ నిజమైతే మనస్ఫూర్తిగా ఒప్పుకొని తప్పును సరిదిద్దుకోవాలి. అసత్యమైతే నవ్వి ఊరుకోవాలి. అంతేగాని స్పందించి దాడికి దిగరాదు. అప్పుడే సమాజంలో సుఖ శాంతులతో ఉండగలుగుతారు.

మనిషి చేపలా నీటిలో ఈదటం నేర్చుకున్నాడు, పక్షిలా నింగిలో ఎగరటం నేర్చుకున్నాడు. కాని భూమిపై సంస్కారంతో ప్రవర్తించటం నేర్వలేదు. తప్పులు పునావృతం కావటానికి కొన్ని కారణాలు – పాప భీతి లేకపోవటం, జన ధన, భుజ బలంతో ఏమైనా చెయ్యగలమనే ధీమా, అహంకారం, చట్టమంటే భయం లేకపోవటం, ఎంత నీచానికైనా దిగజారటం, నేరస్థులకు తగిన శిక్షలు లేకపోవటం మొదలగునవి.

నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంది

కోపంతో మాట్లాడితే గుణాన్ని కోల్పోతారు. అధికంగా మాట్లాడితే ప్రశాంతతని కోల్పోతారు. అనవసరంగా మాట్లాడితే అర్థాన్ని కోల్పోతారు. అహంకారంతో మాట్లాడితే ప్రేమని కోల్పోతారు. అబద్ధాలు మాట్లాడితే పేరుని కోల్పోతారు. ప్రేమతో మాట్లాడితే అందరి మన్ననలను పొందుతారు. నోటిని అదుపులో ఉంచుకుంటే, మనస్సు కూడా అదుపులో ఉంటుంది.

శ్రీకృష్ణుడు ఒకసారి ధర్మరాజును, దుర్యోధనుడిని పిలిచి ఊరిలో మంచివారు ఎంతమందో, చెడ్డవారు ఎంతమందో చూచి వచ్చి చెప్పమంటాడు. ఇద్దరూ చూచి వచ్చారు. ధర్మరాజు 'ఊరిలో అందరూ మంచివారే' అని దుర్యోధనుడు 'ఊరిలో అందరూ చెడ్డవారని' చెబుతారు. 'దృష్టిని బట్టి సృష్టి' అనటానికి ఇది తార్కాణం. ఒకసారి ఒక ఊరిలో అన్ని ఇండ్లకు పచ్చ రంగు వేస్తున్నారు. ఎందుకని అడిగితే 'రాజుగారు ఈ ఊరు వస్తున్నారు. పచ్చ రంగు ఆయనకు ఇష్టం' అని మంత్రి చెప్పాడు. దానికి ఇంత ఖర్చు ఎందుకు, ఆయనను పచ్చ రంగు అద్దాలు ధరించమని చెప్పండి' అన్నాడు ఓ తెలివైన ఆసామి.

కథ : ఓ ఎగ్జిబిషన్‌లో అన్నిటికంటే మంచి పరికరం, అన్నిటికంటే చెడ్డ పరికరం పెట్టమన్నారు. ఓ తెలివిగలతను రెండు చోట్ల 'నాలిక బొమ్మ' పెట్టాడు. దానికే మొదటి బహుమతి వచ్చింది. రెండు చోట్ల నాలికను వాడుకోవటం బట్టి ఉంటుంది మంచైనా, చెడైనా. ఏదైనా విషయం ఇతరులకు చెప్పేముందు 1. అది సత్యమేనా, 2. మంచి విషయమేనా, 3. ప్రయోజనమైనదేనా అని ఆలోచించి, 'అవును' అయితేనే చెప్పాలి.

నాలిక ఒకసారి పళ్లతో అన్నది – 'మీరు మంచిగా నోటిలో వేసిన పదార్థాలన్నీ కొరికి నాకు అందిస్తున్నారు. మీకు నేనేమి ప్రత్యుపకారం చెయ్యగలను'. దానికి పళ్లు ఈ విధంగా సమాధానం చెప్పాయి 'నువ్వు మా కేమీ ప్రత్యుపకారం చెయ్యనక్కర లేదు, మంచిగా మాట్లాడితే చాలు, నువ్వు చెడ్డగా మాట్లాడితే పళ్లు ఊడగొడతా మంటున్నారు'.

అబద్ధం అనర్థదాయకం

మనిషికి మాట బట్టే విలువ ఉంటుంది. వినయం, ప్రవర్తన, మౌనం, క్రమశిక్షణ, వస్త్రం, వాక్కు, వ్యక్తిత్వం, విద్య, ఓరిమి, ఇచ్చిన మాటమీద నిలబడటం లాంటి మంచి అలవాట్లు మనిషి విలువను పెంచుతాయి. అబద్ధం ఆడే వారిని ఎవరూ నమ్మరు.

కథ : వీరన్న ఒక గొఱ్ఱెల కాపరి. అతను తన స్నేహితులతో కలిసి గొఱ్ఱెలను తోలుకొని అడవికి మేపటానికి వెళ్ళాడు. అడవి నుంచి తోడేలు వచ్చి గొఱ్ఱెలను తీసుకెళ్ళి చంపి తినటం జరుగుతుండేది. అలా తోడేలు వచ్చినప్పుడు కేకలు వేస్తే, తోటి గొఱ్ఱెల కాపరులు వచ్చి తోడేలును వెళ్ళగొట్టటంలో సహాయ పడేవారు. వీరన్న పరాచికానికి 'తోడేలు, తోడేలు' అని అరిచాడు. వెంటనే తోటి కాపర్లు కఱ్ఱలు తీసుకొని వచ్చారు. కాని తోడేలు లేదు, వీరన్న నవ్వుతూ సరదాగా అలా అరిచానని అన్నాడు. తోటి కాపర్లు వెనక్కు వెళ్ళిపోయినారు. అలా ఇంకోసారి కూడా పరాచికానికి అరిస్తే, తోటి కాపర్లు వచ్చి తిట్టుకుంటూ వెళ్ళారు. మూడోసారి నిజంగానే తోడేలు వచ్చింది. వీరన్న 'తోడేలు, తోడేలు' అని అరిచినా అది పరాచికానికే అనుకొని ఎవరూ రాలేదు, తోడేలు గొఱ్ఱెను తీసికెళ్ళింది. అప్పుడు తను చేసిన తప్పుకు వీరన్న దుఃఖంచాడు. కనక అబద్ధం అనర్థదాయకం అని గుర్తుంచుకోవాలి.

– వ్యాకరణం వేణుధర శాస్త్రి

ఏకపక్షంగా 'అష్టసూత్ర' కార్యక్రమం

తెలంగాణ సమస్యపై ఏ నిర్ణయమైనా గైకొనడానికి ముందు ప్రధాని తెలంగాణను సందర్శించాలనీ లేకుంటే కేంద్ర మంత్రివర్గ ఉపసంఘాన్ని తెలంగాణా ప్రాంతం సందర్శించేందుకు పంపించాలని, వారు అక్కడి వాస్తవ పరిస్థితులను, ప్రజల అభీష్టాన్ని తెలుసుకొని ఏదైనా నివేదిక సమర్పించిన అనంతరమే ఏ చర్యలైనా గైకొనవలెనని శ్రీ చెన్నారెడ్డి ప్రభృత నాయకులు శ్రీమతి ఇందిరాగాంధీకి నివేదించారు. ఢిల్లీ నుండి ఎవరైనా ఇక్కడకు వస్తే తన బండారం బయట పడుతుందని భయపడిన బ్రహ్మానందరెడ్డి ఈ ప్రతిపాదనను జయప్రదంగా ప్రతిఘటించారు.

ప్రధానమంత్రి ఏర్పాటు చేయనున్న సమావేశాన్ని దృష్టిలో ఉంచుకునే ముఖ్యమంత్రి మార్చి 24వ తేదీన ఒక పత్రికా గోష్ఠి జరిపి తెలంగాణా అభివృద్ధి విషయంలోను, ఉద్యోగుల సాధక బాధకాలను పరిశీలించి పరిష్కరించేందుకు ప్రభుత్వం గైకొన్న కొన్ని చర్యలను గురించి వివరించారు. అయితే ఢిల్లీ వెళ్ళడానికి ముందు శ్రీ కొండా లక్ష్మన్ బాపూజీ ముషీరాబాద్ జైలుకు వెళ్ళి శ్రీ మదన్ మోహన్, ఆదిరాజు వెంకటేశ్వరరావు, శ్రీ మల్లిఖార్జున్‌తో చర్చలు జరిపి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

ఉద్యమంతో సంబంధం ఉన్నవారెవరినీ ఢిల్లీ చర్చలకు పిలవనందున ప్రధానమంత్రి ఏర్పాటు చేసిన సమావేశం పెండ్లి కొడుకు లేని పెండ్లిలా జరిగింది. తెలంగాణ నాయకులు కూడా ఆమెతో ఏ అంగీకారానికి రాలేకపోయారు. ఫలితంగా ఏకపక్షంగానే ప్రధాని కొన్ని నిర్ణయాలు గైకొని 'అష్టసూత్ర కార్యక్రమం' ఒక దానిని రూపొందించారు.

తాము దీనిని ఆమోదించలేదని, తమ వైఖరి స్పష్టం చేస్తూ శ్రీ చెన్నారెడ్డి , శ్రీ రామచంద్రారెడ్డి, శ్రీ చొక్కారావు ఒక సంయుక్త ప్రకటన చేశారు. అష్టసూత్ర కార్యక్రమంలోని ముఖ్య అంశాలు: వివాదగ్రస్తమైన మిగులు నిధులను తేల్చేందుకు ఒక రిటైర్డ్‌న్యాయ మూర్తి అధ్యక్షతన ఉన్నతాధికార సంఘాన్ని ఏర్పాటు చేయడం, తెలంగాణ అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేసి అది నిర్వహింపబడుతున్న తీరును పర్యవేక్షించేందుకు రాష్ట్రస్థాయిలో ఒక ఉన్నతాధికార సంఘాన్ని ఏర్పాటు చేయడం; ముల్కీ నిబంధనలు చెల్లవని కోర్టు తీర్పు చెప్పినందున, ఆ తీర్పును పరిశీలించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను సూచించేందుకు ఇంకొక రిటైర్డ్‌న్యాయమూర్తి అధ్యక్షతన మరొక సంఘాన్ని ఏర్పాటు చేయడం మొదలైనవి. ఇంచుమించు ఇవే చర్యలు తాను గైకొననున్నట్టు మార్చి 24వ తేదీననే ముఖ్యమంత్రి ప్రకటించియుండిరి.

ప్రధాని ఈ విషయం పార్లమెంటులో ప్రకటించినప్పుడు ప్రతిపక్ష నాయకులు కూడా అభినందించలేదు. తెలంగాణ సభ్యులు మాత్రం వ్యతిరేకించలేదు. మార్చి, ఏప్రిల్ మాసాలలో తెలంగాణలో పోరాట జ్వాలలు ఎంతో ఎత్తున లేచి, పోలీసు కాల్పులలో అనేకమంది మరణించినప్పటికీ పార్లమెంటులో తెలంగాణ సభ్యులు బెల్లం కొట్టిన రాళ్ళవలె కూర్చున్నారు తప్ప నోరు మెదపలేదు.

ఏప్రిల్ మూడవ వారంలో శ్రీ దామోదరం సంజీవయ్య, శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ, శ్రీ చెన్నారెడ్డి, డాక్టర్ మెల్కోటే ప్రభృతులు జైళ్ళకు వచ్చి డిటెన్యూలను సందర్శించినప్పుడు కూడా ప్రజాసమితి నాయకులు తమ వైఖరిని స్పష్టం చేసి అష్టసూత్ర కార్యక్రమంపై తమ నిరసనను తెలియజేయడంతో గంగవెర్రులెత్తిన ప్రభుత్వం, డిటెన్యూలను సందర్శించేందుకు ప్రాంతీయ సంఘం అధ్యక్షునితో సహా ఆ తర్వాత ఎవరికీ అనుమతి ఇవ్వలేదు.

కార్మిక నాయకులు శ్రీ జి. వెంకటస్వామి ప్రభృతులు కొందరు అప్పుడు ముఖ్యమంత్రికి సన్నిహితులుగా ఉండగా మరికొందరు శ్రీ బ్రహ్మానందరెడ్డికి భయపడి తమకెందుకు ఈ గొడవ అనుకున్నారు. కొందరు తెలంగాణ నుండి ఎన్నికైనప్పటికీ వారు ఆంధ్ర ప్రాంతం వారు కనుక వారి ప్రయోజనాలే వేరు. ఇక మహిళా సభ్యులు రాష్ట్ర మంత్రివర్గంలో వారి వారి స్నేహితుల కనుసన్నలలో ఉంటూ, వారు ఆడించినట్టే ఆడటానికి అలవాటైనారు. అది నాడు తెలంగాణ దురదృష్టం. క్రమంగా, ఆ తర్వాతనైనా శ్రీ వెంకటస్వామి, డాక్టర్ మెల్కోటే, శ్రీమతి సంగం లక్ష్మీ బాయి ప్రభృతులు ప్రజాభీష్టానికి అనుగుణంగా ఉద్యమంలో చేరి ప్రముఖ పాత్ర నిర్వహించారు. ఇది చెన్నారెడ్డి చలువ. ముఖ్యమంత్రి సలహా మేరకు, పార్టీ రాజకీయాలు ముఠా కీచులాటలు మనసులో ఉంచుకొని ఆంధ్ర పాలకులను సంతృప్తి పరిచేందుకు రూపొందించిన, ప్రదాని అష్టసూత్ర కార్యక్రమం తెలంగాణ ప్రజలను సంతృప్తి పరచకున్నా, దమన నీతిని కొనసాగించేందుకు ప్రభుత్వానికి మాత్రం ప్రోత్సాహాన్ని ఇచ్చింది. ప్రాంతమంతటా ప్రతినిత్యం వేల మందిని నిర్బంధించి చిత్రహింసలకు గురిచేశారు.

ఏప్రిల్ మాసంలో అడ్వకేట్స్ ఫోరం కన్వెన్షన్‌కు ముందు శ్రీ అవ్వా సత్యనారాయణ, శ్రీ సుబ్బారాయుడు వంటి సీనియర్ న్యాయవాదులు కూడా అనేక మంది ఉద్యమంలో చేరేందుకు ముందుకు రాగా, తెలంగాణ పట్టభద్రుల సదస్సు జరిగే సందర్భంలో రిటైర్డ్ అధికారులు శ్రీ రావులపాటి మధుసూధనరావు, శ్రీ యల్.ఎన్.గుప్త వంటివారు ఎంతో చొరవతో పని చేశారు. వీరిద్దరూ రిటైర్డు ఐఎఎస్ అధికారులు శ్రీ మాదిరాజు లక్ష్మీ నరసింహారావు, శ్రీ సి. మానిక్‌రావు మొదలైనవారి పట్టుదల చొరవ పట్టభద్రుల సదస్సు జయప్రదమయ్యేందుకు ఎంతో దోహదం చేసినది. అయితే మహిళల సదస్సు అంతకు ముందే ఏప్రిల్ మొదటి వారంలోనే జరిగింది.

పోలీసుల దమనకాండతో తెలంగాణ అంతటా మారణ హోమం ఉధృతమైంది. విసిగి వేసారిన ప్రజలు కొందరు పోలీసులపై కూడా ప్రేలుడు వస్తువులను ప్రయోగించారు. ప్రభుత్వం తన అక్కసును తీర్చుకునేందుకు భద్రివిశాల్, పొలసాని నరసింగరావు వంటి ప్రముఖ శాసన సభ్యులపై కూడా హత్య, దోపిడీ వంటి నేరాలు ఆరోపించి దొంగ కేసులు బనాయించి నిర్బంధించింది. **(సశేషం)**

– ఆదిరాజు వెంకటేశ్వర రావు

సమన్వయ వ్యవస్థ లేక రైతుల అవస్థలు

దేశంలో ప్రధానమైన వరి ధాన్యం , గోధుమ ఆహార ధాన్యాల్లో ప్రాధాన్యత ఉన్న పంటలు. భారతదేశంలో సాగవుతున్న భూభాగంలో 40 శాతం సుమారు 18 కోట్ల ఎకరాల్లో వరి, గోధుమ పంటలను రైతులు సాగుచేస్తున్నారు. దిగుబడి కూడా అదే స్థాయిలో వస్తోంది. సుమారు 11 కోట్ల టన్నుల వరి ధాన్యాన్ని , 9 కోట్ల టన్నుల గోధుమలను ప్రతి ఏటా రైతులు దేశంలో పండిస్తున్నారు. సగటున ఒక మనిషికి ఏడాదికి కావలసిన ఆహారధాన్యాలు 100 నుంచి 110 కేజీలు కాగా 130 కోట్ల మంది భారతీయులకు మొత్తం 13 నుంచి 14 కోట్ల టన్నులు ఆహార ధాన్యాలు అవసరం అవుతాయి. భారతదేశ మొత్తం జనాభా తినడానికి సరిపోగా 5 నుంచి 6 కోట్ల టన్నులు సుమారు 30 శాతం అదనంగా మిగులు పంట దేశంలో ప్రతి ఏటా పండుతోంది. 1960 నాటికి ఆహార కొరత ఉన్న స్థితి నుంచి నేడు దేశంలో మిగులు ఆహార ధాన్యాల ఉత్పత్తి కావడం భారతదేశం సాధించిన ప్రగతిగా అభివర్ణించవచ్చు . హరిత విప్లవం ఫలితంగా సాగు భూముల విస్తీర్ణం పెరిగింది . భారతదేశంలో పంటల సాగు తీరులో మార్పు వచ్చింది.

మొత్తం పంటల ఉత్పత్తిలో ఆహార ధాన్యాల ప్రాధాన్యత పెరిగి పప్పు దినుసుల ప్రాధాన్యత తగ్గుతూ వచ్చింది . 1960 నాటికి మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో పప్పు దినుసుల వాటా పదహారు శాతం ఉన్న ఉత్పత్తి నేడు తొమ్మిది శాతానికి తగ్గింది. ఆహార ధాన్యాల వాటాలో వరి, గోధుమల వాటా 1960లో ఉన్న 66 శాతం నుంచి నేడు 82 శాతానికి పెరిగింది. అప్పట్లో 34 శాతం ఉన్న ముతక ధాన్యాలు, పప్పు దినుసుల వాటా నేడు 18 శాతానికి తగ్గింది. ఆహార ధాన్యాల ఉత్పత్తి మెరుగు పరిచినప్పటికీ అత్యంత పోషక విలువలు కలిగిన ముతక ధాన్యాలు, పప్పు దినుసుల ఉత్పత్తి పెంపుపై ప్రభుత్వం దృష్టి పెట్టలేక పోయింది. దేశంలో ఆహార కొరత ఏర్పడకుండా రక్షణాత్మకంగా ప్రభుత్వం చర్యలు, ప్రభుత్వ విధానాలు అవలంభిస్తోంది. ఇది ప్రభుత్వాల ఆత్మ రక్షణ ధోరణి అవుతుంది. దేశంలో వ్యవసాయ రంగంలో కీలకమైనది హార్టికల్చర్, కూరగాయలు,



పండ్లు , పూల తోటలు. ఆహార ధాన్యాలతో పోల్చితే తక్కువ విస్తీర్ణంలో పండిస్తున్నప్పటికి రైతులకు పండ్లు, కూరగాయలు అధిక దిగుబడి లభిస్తుంది . దేశంలో సుమారు 6 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో ఇవి సాగు చేస్తున్నారు. సుమారు 25 కోట్ల టన్నుల కూరగాయలు, పండ్లు దిగుబడి నందిస్తూ 60 శాతం కూరగాయలు, 30 శాతం పండ్లు, 10 శాతం పూలు దిగుబడులు వస్తున్నాయి. సగటున ఒక రోజుకు 350 గ్రాములు చొప్పున 130 కోట్ల మంది భారతదేశ ప్రజలకు సరిపడా వీటి లభ్యత ఉంది.

భారతదేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయగలిగిన వ్యవసాయరంగం అత్యున్నతమైన స్థానంలో ఉంది. భారత ఆర్థిక వ్యవస్థను పరిశీలిస్తే ప్రపంచ జీడీపీలో భారత దేశం 5వ స్థానంలో ఉంది. ఈ లెక్కలు భారత దేశాన్ని ఆకాశానికి ఎత్తుతుంటే! ప్రభుత్వం తీసుకునే ఆత్మరక్షణ ధోరణి నిర్ణయాలు రైతులకు శాపంగా మారుతున్నాయి. ప్రభుత్వాలకు దేశ ప్రజల ప్రయోజనాలు ఎంత ముఖ్యమో, దేశ ప్రజల ప్రయో జనాల కోసం, దేశ ప్రజలకు ఆహారాన్ని అందించే రైతుల ప్రయోజనాలను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. గడిచిన 15–20 సంవత్సరాలు వెనక్కుపోయి చూస్తే ఒక ప్రభుత్వ ఉద్యోగి ఒక నెల జీతంతో 20 క్వింటాళ్ల ధాన్యం కొనగలితే ఈ రోజు అదే ఉద్యోగి నెల జీతంతో 50 క్వింటాళ్ల ధాన్యం కొనవచ్చు. ఈ ఒక్క ఉదాహరణ చాలు దేశంలో రైతు శ్రమకి తగ్గుతున్న విలువ గురించి తెలియ చేయడానికి.

దేశంలో సగటున సుమారు రోజుకు 47 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. సగటు మనిషి ఆదాయంలో భారతదేశం యొక్క స్థానం 144. ప్రపంచ ఆకలి సూచికలో భారత దేశం 60 స్థానంలో ఉంది. దేశంలో 18 కోట్ల మంది ప్రజలు అర్ధాకలితో ఉన్నారు. గ్లోబల్ ఫుడ్ వేస్ట్ నాట్, వాంట్ నాట్ అనే సంస్థ జరిపిన సర్వేలో పంటను నిల్వ చేసేందుకు సరైన గోదాములు లేక భారతదేశంలో ఒక సంవత్సర కాలంలో వృధా అవుతున్న కేవలం ఒక్క గోధుమ పంట రెండుకోట్ల పది లక్షల టన్నులు. ఒక్క గోధుమ పంటను వృధా కాకుండా చూడ గలిగితే సుమారు 20 కోట్ల మందికి మూడు పూటలు తిండి పెట్టవచ్చు.

అత్యధిక పోషకవిలువలు కలిగిన ఆహారం పండ్లు, కూరగాయలు లభ్యత సగటున ఒక మనిషికి రోజుకు 350 గ్రాములు దేశంలో ఉంది. కానీ రైతులు పంటను సరైన సమయంలో అమ్ముకోలేక గిట్టుబాటు ధర రాని పరిస్థితి ఒక వైపు, మరో వైపు దేశంలో 70 శాతం మంది పేద, మధ్యతరగతి ప్రజలు పండ్లు కొని తినలేని స్థితిలో ఉన్నారు . అందుకు కారణం పంటను నిల్వ చేయటానికి సరైన గోదాములు లేకపోవటమే. మొత్తం దేశంలో పండుతున్న కూరగాయలు, పండ్లలో దాదాపు 40 శాతం వృధా అవుతున్నాయి. దేశంలో ఉన్న సహజ వనరులు, మానవ వనరుల కారణంగా వ్యవసాయరంగం అభివృద్ధి చెందింది. కావలిసిన పంట దిగుబడి వస్తోంది. డిమాండ్, సరఫరా సమపాళ్ళలో ఉన్నప్పటికీ ఈ రెండింటిని సమన్వయ పరచడానికి సరైన వ్యవస్థ దేశంలో లేకపోవడంతో అభివృద్ధి ఫలాలు అటు రైతులకు, ఇటు ప్రజలకు అందటం లేదు.

ప్రభుత్వాలు ఈ దిశగా చర్యలు చేపడితే అటు పంటలు పండించే రైతులకు, ఇటు వినియోగించే ప్రజలకు మేలు జరుగుతుంది.



–మార్తా రామకృష్ణ
ఖమ్మం, 99486 73333

స్వచ్ఛందంగా ఓటెయ్యాలి

విజయక్రాంతి, పరకాల: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఓటెయ్యాలని పరకాల సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.మధు అన్నారు. పరకాల పోలీస్ స్టేషన్ పరిధిలోని నడికూడ మండలం నార్లా పూర్ గ్రామంలో ఆదివారం రాత్రి జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ప్రదర్శనలు నిర్వహించారు. మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు, మద్యపానం, ధూమపానం, సంఘ విద్రోహక శక్తుల వల్ల కలిగే అనర్థాలను ప్రదర్శనల్లో కళ్లకు కట్టినట్లు వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ ఓటుకు నోటు తీసుకోవడం వల్ల సమర్థవంతమైన నాయకత్వం కరువవుతుందని అన్నారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ పేపర్లు కలిగి ఉండాలన్నారు. సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవీందర్, కళాబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామాభివృద్ధి కోసమే రాజకీయాల్లోకి

- అర్జుల రమా సంపత్‌రెడ్డి

విజయక్రాంతి, జనగామ: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా నామినేషన్ మెదటిరోజు జోరుగా సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. తరిగొప్పుల మండలంలోని నర్సాపూర్ క్లస్టర్ పరిధిలోని అబ్దుల్ నాగారం గ్రామానికి చెందిన అర్జుల రమా సంపత్‌రెడ్డి గ్రామస్తుల ఆధ్వర్యంలో డప్పుచప్పుళ్ళు, కోలాటాలు, నృత్యాలు చేస్తూ భారీగా ర్యాలీ నిర్వహించి, సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎలాంటి అధికారం లేకున్నా గత 30 సంవత్సరాలుగా స్వగ్రామమైన అబ్దుల్ నాగారంలో పరోక్షంగా, ప్రత్యక్షంగా అభివృద్ధికి పాటుపడుతున్నానని, అయినా ఏదో వెలితిగా అనిపిస్తూ వుండేదన్నారు. నేడు రిజర్వేషన్ రావడంతో గ్రామానికి, ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాలనే లక్ష్యంతో గ్రామ ప్రజల అభిమానంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. తనను అభిమానిస్తున్న గ్రామస్తులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బైరగోని ఉప్పలయ్య, ఎంపీటీసీ అనితా రాజేశ్వర్‌గౌడ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

- ములుగు డీఎస్పీ విజయసారథి

విజయక్రాంతి, ములుగు: సర్పంచ్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ములుగు డీఎస్పీ విజయసారథి సిబ్బందికి సూచించారు. ఈ మేరకు సోమవారం ములుగు సీఐ సార్ల రాజు, వెంకటాపూర్ ఎస్సై నరహరితో కలిసి వెంకటాపూర్ మండలంలోని పెద్దాపూర్, బావుసింగ్‌పల్లి, గుర్రంపేట, సుబ్బక్కపల్లి, రాంనగర్ తండ తదితర గ్రామాల్లో ఉన్న పోలింగ్ బూత్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నామినేషన్లు, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం బూర్గుపేట ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా చదువు, ఆటలు, భోజనం, కూరలు, ఉపాధ్యాయుల పనితీరు బాగుండాలని హాస్టల్ వార్డెన్, సిబ్బందికి సూచించారు. అదేవిధంగా విద్యార్థులతో మాట్లాడుతూ ఏదైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

కుంగ్‌ఫూ, కరాటేలో విద్యార్థుల ప్రతిభ

విజయక్రాంతి, పాలకుర్తి: హన్మకొండలో జరిగిన జాతీయస్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో పాలకుర్తి మండలం కస్తూర్బా పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. పాలకుర్తి కస్తూర్బా విద్యాలయానికి చెందిన 22 మంది బాలికలు పతకాలు సాధించారు. విద్యార్థులు బి.శిరీష, జి.రాజేశ్వరి, ఆర్.కవిత, ఎ.శిరీషలు బంగారు పతకాలు, ఎమ్.అనిత, డి.రాజేశ్వరి, ఆర్.రమ్య, మనిష, జి.బుజ్జి వెండి పతకాలు సాధించారు. జి.మౌనిక, డి.దివ్య కాంస్య పతకాలు సాధించారు. పాలకుర్తి మండలం వావిలాల గ్రామంలో జరిగిన కబడ్డీ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటి బహుమతులు సాధించారు. పతకాలు సాధించి పాలకుర్తి కస్తూర్బా పాఠశాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు అభినందించారు.

పకడ్బందీగా ఎన్నికల ప్రక్రియ

- ఎన్నికల అబ్జర్వర్ ఎల్.శశిధర్

విజయక్రాంతి, మహబూబ్‌నగర్: స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికలకు సంబంధించిన నియమ నిబంధనలను, నియామావళిని పూర్తిగా అవగాహన చేసుకుని ప్రతి విషయంలో ఎటువంటి తప్పిదాలు దొర్లకుండా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఎల్.శశిధర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నియమించబడిన నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నోడల్ అధికారులు తమకు కేటాయించిన నిధులకు సంబంధించిన పనుల పురోగతిపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ రోనాల్డ్‌రోస్ మాట్లాడుతూ.. జిల్లాలో 721 గ్రామ పంచాయతీలకు గాను 719 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని, 6366 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందని, 6487 బ్యాలెటు బాక్సులు సమకూర్చడం జరిగిందని, ఇందులో 3000 బ్యాలెట్ బాక్సులను మొదటి విడత ఎన్నికల కొరకు సిద్ధం చేసి పంపిణీ చేయడం జరిగిందన్నారు. 17 లక్షల బ్యాలెట్ పేపర్లు ముద్రించి ఎన్నికలకు సిద్ధం చేశామని, నామినేషన్ల ప్రక్రియ ముగిసిన పిదప అవసరం మేరకు మిగిలిన బ్యాలెట్ పేపర్లు ముద్రించడానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్, ఫస్ట్ లెవల్ శిక్షణ పూర్తి చేశామని, ప్రతి మండలానికి ఒక ఫ్లయింగ్ స్క్వాడ్‌ను, ఎంసీఎంసీ టీమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, 25 మంది అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లను నియమించడం జరిగిందని అన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రతి 500 ఓట్లకు ఒక టేబుల్ చొప్పున ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ జరిపే ప్రాంతంలో తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని, పోస్టల్ బ్యాలెట్లు సకాలంలో డిస్‌ప్యాచ్ అయ్యేందుకు అవసరమైన చర్యలు చేపట్టాల్సిందిగా సూచించారు. అనంతరం మొదటి విడత ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సమావేశంలో ఎన్నికల ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌వో స్వర్ణలత, నారాయణపేట ఆర్‌డీవో సీహెచ్ శ్రీనివాసులు, మహబూబ్‌నగర్ ఆర్‌డీవో శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు గ్రామ పంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైం నేరస్తుడు అరెస్ట్

విజయక్రాంతి, మహబూబాబాద్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు అకౌంట్లు, ఏటీఎంలు, పిన్ నెంబర్లు, ఓటీపీల పట్ల జాగ్రత్తగా వ్యవరించాలని మహబూబాబాద్ జిల్లా అడిషనల్ ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. సోమవారం అన్‌లైన్, పేటీఎం ద్వారా నగదును దొంగతనం చేసిన నేరస్తుడు గజ్జెల బాలరాజును హమబూబాబాద్ జిల్లాలో మహబూబాబాద్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసారు. అతని దగ్గర నుంచి రూ.6,50,000 నగదు, రెండు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. గజ్జెల బాలరాజు, నవీన్ ఇద్దరూ కలసి గతంలో రేషన్ బియ్యం దందా చేసేవారని, ఈ దందాలో బాలరాజు డబ్బుల కలెక్షన్ చేసి నవీన్‌కు ఇస్తూ అతని సహాయకారిగా ఉంటూ అతని ఇంట్లో ఉండేవాడని విచారణలో చెప్పారు. తన మొబైల్‌తో నవీన్, నవీన్ భార్య లావణ్యల ఏటీఎం, వారికి తెలియకుండా అకౌంట్స్ క్రియేట్ చేసి పెట్టుకున్నాడని పోలీసులు తెలిపారు. ఈ విధంగా నవీన్, లావణ్యల బ్యాంకు అకౌంట్‌లలో డబ్బులు డ్రా చేసేవాడని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నరేష్ కుమార్, రవి కుమార్,ఎస్సై అరుణ్ కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరంలో హుండీ లెక్కింపు

విజయక్రాంతి, అచ్చంపేట: అచ్చంపేట నియోజకవర్గం పరిధిలోని ఉమామహేశ్వర దేవాలయంలో సోమవారం హుండీలను లెక్కించగా 9 నెలల 24 రోజుల్లో 7 లక్షల 86 వేల 424 రూపాయలు గా నమోదైందని దేవాలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్ తెలిపారు. సోమవారం ఆలయంలో హుండీలను లెక్కించిన దేవాలయ కమిటీ తొమ్మిది నెలల్లో ఇంతటి ఆదాయాన్ని గడించడం చరిత్రలో ప్రథమం అని, ప్రస్తుతం దేవాలయాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కూడా దాతలు పెద్ద ఎత్తున ఔదార్యాన్ని చాటారని, అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

నిలిచిన అభయ హస్తం అందేనా..?

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 20 నెలలుగా బంద్
- పేరుకుపోయిన రూ.26 కోట్ల బకాయిలు
- ఆసరా లేక ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు
- సంస్కరణల పేరుతో అయోమయం

విజయక్రాంతి, వరంగల్ అర్బన్: వృద్ధులైన డ్వాక్రా మహిళలకు ఎంతో ఆసరాగా వుండే అభయ హస్తం పథకం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 20 నెలలుగా నిలిచిపోయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 26వేల మంది లబ్ధిదారులకు పింఛన్ రావడం లేదు. అసలు అభయహస్తం అమలులో వుందా లేదా అన్న సందేహం లబ్ధిదారుల్లో కలుగుతోంది. పింఛన్ డబ్బుల కోసం వృద్ధురాళ్లు కార్యాలయాల చుట్టూ కాళ్ళరిగేలా తిరుగుతున్నారు. వారి పిల్లలకు రెండేళ్లుగా ఉపకార వేతనాలు కూడా అందడం లేదు. సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి జవాబు రావడం లేదు. అభయహస్తంలో కొన్ని మార్పులు చేర్పులు చేయడం ద్వారా నిరుపేద మహిళలకు మరింత సాయం అందచేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. అయితే మార్పులు, చేర్పులు పక్కన బెడితే 20 నెలలుగా నిలిచిన పింఛన్ ఎప్పుడు ఇస్తారో తెలియక లబ్ధిదారులు అయోమయంలో ఉన్నారు.

వృద్ధ మహిళలకు భరోసా..

స్వయం సహాయక (డ్వాక్రా) సంఘాల్లోని 60 ఏళ్ల పైబడిన మహిళలకు సామాజిక, ఆర్థిక భద్రత కోసం అభయహస్తం పథకాన్ని 2009 ఫిబ్రవరి7న అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్సార్ ప్రవేశపెట్టారు. ఏడేళ్లగా ఈ పథకం ఎటువంటి అవాంతరాలు లేకుండా సాగింది. ఆ తర్వాతే పథకానికి గ్రహణం పట్టింది. ఈ పథకంలోని సభ్యులు రోజుకో రూపాయి చొప్పున ప్రభుత్వానికి చెల్లించాలి. అంతే మొత్తంలో ప్రభుత్వం కూడా సభ్యులు పేరు మీద జమ చేస్తుంది. 60 యేళ్లు దాటగానే ప్రతీ ఒక్కరికి నెలనెలా రూ.500 పింఛన్ అందిస్తుంది. అంటే ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులకు అమలవుతున్న కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం మాదిరిగా అన్నమాట. 60 యేళ్లు నిండినవారు ఒకేసారి రూ.3685 చెల్లిస్తే ఈపథకం ద్వారా లబ్ధిపొందే వెసులుబాటు కూడా ప్రభుత్వం కల్పించింది. దీంతో చాలా మంది ఆ మొత్తాన్ని చెల్లించారు. వీరికి భీమా సౌకర్యం కూడా కల్పించడంతో డ్వాక్రా మహిళలకు పథకం ఎంతో ఆకట్టుకుంది. ఇందులో సహజ మరణానికి రూ.30వేలు, ప్రమాద మరణానికి రూ.75వేలు, పాక్షిక వైకల్యానికి రూ.37,500లు, పూర్తి వైకల్యానికి రూ.75వేలను ప్రభుత్వం జీవిత భీమా సంస్థ ద్వారా అందిస్తుంది.ప సభ్యురాలు చనిపోయినట్లైతే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు సమాచారమిచ్చిన గంటలోపే ఆ మొత్తాన్ని అందించాల్సి వుంటుంది.

ఉమ్మడి జిల్లాలో రూ.26 కోట్ల బకాయిలు

అభయహస్తం కింద ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం రూ.25,900 మంది పింఛనుదారులున్నారు. వీరికి నెలకు రూ.1కోటి29లక్షల50వేల చొప్పున 20నెలలకు గాను రూ.25.90 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి వుంది. ఈ పథకం కింద వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలో 3వేల మంది లబ్ధిదారులు, వరంగల్ రూరల్ జిల్లా పరిధిలో 4వేల మంది అభయహస్తం కింద నమోదయ్యారు. అయితే 20నెలలుగా పింఛను పంపిణీ నిలిపివేయడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.2016 అక్టోబర్ నుంచి 2017 జనవరి వరకు నాలుగు నెలలకు సంబంధించి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈతర్వాత నిలిపి వేసింది. ఇక నాలుగేళ్లగా ఈ పథకం కింద కొత్త సభ్యులను చేర్చుకోవడం మానేశారు. పాత సభ్యుల నుంచి చందాలను స్వీకరించడమూ నిలిపివేశారు. అయితే ప్రతీ నెల పింఛను వస్తుందన్న ఆశతో వృద్ధ మహిళలు ఐకేపీ, గ్రామపంచాయితీ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కష్టాలు పడుతున్నారు. గతంలో అయిదారు నెలలకు ఒకసారైనా పింఛను మొత్తం వచ్చేవి. ఈ సారి ఏకంగా 20 నెలలైనా రాకపోవడంతో బాధిత పింఛనుదారులు ఆందోళన చెందుతున్నారు.

నూతన విధానం ఓ కొలిక్కి వచ్చేనా..

అభయహస్తం పథకాన్ని ఉచితంగా అమలు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మహిళలకు శాపంగా మరింది. ఈ పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేసేందుకు తాజాగా కొన్ని ప్రతిపాదనలను సిద్ధం చేసినా, అవి అమలుకు నోచుకోవడం లేదు. మహిళా సభ్యుల వాటాను కూడా ఇకపై ప్రభుత్వమే చెల్లించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా గతంలో చెల్లించిన ప్రీమియం మొత్తాలను వారికి వాపసు ఇవ్వాలని, దీనికి తోడు సభ్యురాళ్ల భర్తలకు కూడా ఈ పథకం వర్తింపచేసేలా మార్పులు చేయాలని, భీమా పథకం ద్వారా పొందే లబ్ధి మొత్తాన్ని పెంచాలని నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఇంకా కార్యరూపం దాల్చలేదు. అయితే నూతన విధాలను అమలు చేయడం మంచిదే అయినా , మొదట 20నెలలుగా నిలిచిన మొత్తాన్ని చెల్లించి పుణ్యంకట్టుకోవాలని లబ్ధిదారులు సీఎం కేసీఆర్‌ను వేడుకుంటున్నారు. తమకు ఆసరాగా నిలిచిన అభయహస్తం పింఛను మొత్తం తమకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అభ్యర్థుల కోసం కుస్తీలు

- పోటీకి ముందుకు రాని నాయకులు
- ఖర్చులు చూసి భయం


విజయక్రాంతి, డోర్నకల్: గ్రామ పంచాయతీ ఎన్నికలు రావడంతో గ్రామాల్లో సందడి పెరిగింది. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు జంకుతున్నారు. పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితమైనప్పటికీ రాజకీయ పార్టీలే కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఎదుటి వ్యక్తిపై నేను గెలవగలనా లేదా అని ప్రశ్నించికుంటున్నారు. ఇంత ఖర్చు పెట్టి గెలవకపోతే నా పరిస్థితి ఏంటి అనిఆశావహులు అలోచిస్తున్నారు. తమ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారంలో తనతోపాటు కలసి కట్టుగా పని చేస్తారో లేదో అని భయపడుతున్నారు. అంతే కాకుండా మూడు విడతల్లో ఎన్నికలు జరుగుతున్నప్పటికీ అభ్యర్థులు తొలి విడత నుంచే ఓటర్లను మెప్పించేందుకు ఖర్చు చేయాల్సి ఉంటుందని, దీన్నిబట్టి భారీస్థాయిలో ఖర్చుచేయాలని అభిప్రాయపడుతున్నారు.

ఈ పరిణామాల నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు ముందుకు రావడం లేదని సమాచారం.పైగా ఇంత భారీ స్థాయిలో డబ్బులు ఖర్చు పెట్టి గెలిచినప్పటికీ ఆశించిన స్థాయిలో పంచయతీలకు నిధులు వచ్చే అవకాశం లేదు. పైగా కేంద్ర ప్రభుత్వం నేరుగా పంచాయతీకి నిధులు విడుదల చేస్తుంది. దీంతో సర్పంచ్‌గా పోటీ చేసేందుకు అభ్యర్థులు పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

పంచాయతీకి అభ్యర్థుల పోటాపోటీ

విజయక్రాంతి, నారాయణపేట: పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం సోమవారం ప్రారంభమైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో మొదటి విడతగా నారాయణపేట డివిజన్‌లోని 9 మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి గ్రామ పంచాయతీలలో అధికారులు సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 21వ తేదీన జరగనున్నాయి. నామినేషన్ల సేకరణ 9వ తేదీ వరకు జరగనుంది. దీనికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా మండలాల్లోని ప్రతి ఐదు గ్రామ పంచాయతీలకు ఒక క్లస్టర్ ఏర్పాటు చేసి ఆ క్లస్టర్ గ్రామ పంచాయతీలో సంబంధిత గ్రామ పంచాయతీల ఎన్నికకు నామినేషన్లు స్వీకరించనున్నారు. అయితే సోమవారం కొన్ని ప్రాంతాల్లో మాత్రమే సర్పంచ్ అభ్యర్థులకు నామినేషన్లు దాఖలు చేశారు. 9వ తేదీ పెద్ద ఎత్తున నామినేషన్లు నమోదయ్యే అవకాశం ఉంది. ఆయా గ్రామ పంచాయతీకి సంబంధించి పోటీ చేసే అభ్యర్థులు రిజర్వేషన్ల ప్రకారం కులధృవీకరణ పత్రాలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా గ్రామ పంచాయతీకి ఏదైనా బాకీ ఉంటే బాకీలను కట్టి నోడ్యూవ్ సర్టిఫికెట్లు ఇస్తున్నారు. నారాయణపేట నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామ పంచాయతీ కూడా ఏకగ్రీవం అయ్యే అవకాశాలు దాదాపుగా కనిపించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత టీఆర్ఎస్ పార్టీ బలంగా ఉన్నా ప్రతిపక్ష ప్రధాన కాంగ్రెస్ పార్టీ ఎక్కడా కనిపించడం లేదు. బీజేపీ నేతలు మాత్రం తమకు పట్టు ఉన్న స్థానాల్లో పోటీ చేయడానికి నామినేషన్లు సిద్ధం చేసుకుంటున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన శివకుమార్‌రెడ్డి తరుపున ప్రతి గ్రామంలో టీఆర్ఎస్ మద్దతుదారులకు పోటీగా అభ్యర్థులను నిలబెట్టడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో మాత్రం టీఆర్ఎస్ అభ్యర్థులకు తీవ్ర పోటీ నెలకొంది. ఇక్కడి ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో అభ్యర్థులను సూచించినా అదే గ్రామంలో ఉండే టీఆర్ఎస్ నాయకులు వర్గాలుగా విడిపోయి నామినేషన్లు వేస్తున్నారు. టీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య పోటీ ఉంటే కేఎస్ఆర్ తరుపున నిలబడే అభ్యర్థులు గెలిచే అవకాశాలు ఉన్నాయి. ఇది ఇలా ఉంటే నామినేషన్ల దరఖాస్తుల అనంతరం టీఆర్ఎస్ అసంతృప్తులను చల్లబరిచేందుకు టీఆర్ఎస్ నాయకులు ప్రయత్నాలు ఇప్పటి నుంచే ప్రారంభించారు. ఎలాగైనా ఈ పంచాయతీ ఎన్నికల్లో 140 సర్పంచ్‌లకు పైగా గెలవాలని ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతిపక్షాలు పూర్తిగా పనిచేయకపోవడంతో టీఆర్ఎస్‌కే ఎక్కువ జనాదారణ లభించే అవకాశం కనిపిస్తుంది. వీరికి గట్టి పోటీ కేఎస్ఆర్ వర్గీయుల నుంచి ఎదురు కానుంది. బీజేపీ మాత్రం తమకు పట్టున్న స్థానాల్లో గెలవడానికి ప్రయత్నిస్తున్నారు.

తేలని 'అక్రమ ఇసుక' వ్యవహారం



విజయక్రాంతి, బోధన్: రాష్ట్రమంతా గ్రామ పంచాయతీ ఎన్నికల హడావిడి ఉంటే బోధన్ మండలంలో మాత్రం అక్రమ ఇసుక రవాణా వ్యవహారం హడావిడి చేస్తుంది. ట్రాక్టర్లు పట్టుబడి వారం గడుస్తున్నా ఈ వ్యవహారంపై అధికారులు ఎటూ తేల్చకపోవటంతో ప్రజలు మండి పడుతున్నారు. ట్రాక్టర్ యజమానులు సైతం అధికారుల నాన్చివేత ధోరణితో సతమతమైపోతున్నారు. గ్రామాల్లో ఎన్నికలతో పాటు, వరి నాట్ల సీజన్ కావటంతో అక్రమ ఇసుక రవాణా కేసులో పట్టుబడ్డ ట్రాక్టర్ యజమానులు, గ్రామ పెద్దలు తరచూ ఎంఆర్వో, ఆర్డీఓ ఆఫీసుల చుట్టూ తిరగలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఇదివరకే జిల్లా మైనింగ్ అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి విచారణ చేపట్టినప్పటికీ ఈ వ్యవహారం ఎటూ తేల్చకపోవటంతో రెవెన్యూ అధికారులతో పాటు, పలువురు ఉన్నతాధికారులపై ప్రజలు మండిపడుతున్నారు. అక్రమ ఇసుక రవాణా వ్యవహారంపై అధికారులు విచారణ ఆలస్యం చేయటంతో అక్రమ ఇసుక రవాణాను అధికారులు ప్రోత్సహిస్తున్నారంటూ వస్తున్న వార్తలు వాస్తవమేనేమోననే సందేహం ప్రస్తుతం ప్రజల్లో కలుగుతుంది. అక్రమ ఇసుక రవాణా వ్యవహారంలో పలువురు రెవెన్యూ అధికారుల ప్రమేయం ఉందని తేలటంతోనే అధికారులు ఈ విచారణలో జాప్యం చేస్తున్నారని, రెవెన్యూ అధికారులు తమ డిపార్ట్‌మెంట్ అధికారులను కాపాడే ప్రయత్నాలు జోరుగా చేస్తున్నారనే వార్తలు ప్రస్తుతం జోరందుకుంటున్నాయి. రెవెన్యూ అధికారుల అనుమతితోనే తమ ట్రాక్టర్లలో ఇసుక నింపామని, లేదంటే పట్ట పగలే ఇంతటి దుస్సాహసం ఎవరూ చేయరని చెప్పుకొస్తున్న ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్‌లు ఈ వ్యవహారంలో అధికారులు జాప్యం చేయటంతో తమ భవిష్యత్తు ఏంటని, ఎలాంటి కేసుల్లో తమని ఇరికిస్తారో అని భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏది ఏమైనా అక్రమ ఇసుక రవాణా వ్యవహారంపై కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారని, విచారణలో దోషులుగా తేలిన వారికి కఠిన శిక్షలు తప్పవనే వార్తలూ వినిపిస్తున్నాయి. ఎంత ఎన్నికల బిజీ ఉన్నా ఇలాంటి విషయాలపై ప్రభుత్వం ఇంత సాగదీయటం ఏంటని ప్రజలు మండిపడుతున్నారు. అక్రమ ఇసుక రవాణాపై ఇలాంటి నాన్చివేత ధోరణి పనికి రాదని ఇలా జరిగితే భవిష్యత్తులో ఇసుక అక్రమ రవాణా పెరిగే అవకాశాలు ఎక్కువవుతాయని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

క్రీడలు నిజ జీవితంలో ముఖ్య భూమిక కావాలి

- ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

విజయక్రాంతి, స్టేషన్‌ఘన్‌పూర్: ప్రతి వ్యక్తికి క్రీడలు నిజ జీవితంలో ముఖ్య భూమిక కావాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య కోరారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో రాజన్న యువసేన ప్రతినిధి డాక్టర్ విరాజ్ ఆధ్వర్యంలో కేటీఆర్ క్రికెట్ కప్ టోర్నమెంట్స్‌ను సోమవారం ఎమ్మెల్యే రాజయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి యువసేన నాయకులు మల్లేష్ అధ్యక్షత వహించగా, ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ క్రీడల వల్ల మనిషి మానసికంగా, ఆరోగ్య పరంగా ఆరోగ్యవంతంగా ఉండగలుగుతారన్నారు. మనిషిలో ఉన్న అవయవాలకు వ్యాయామం అవసరమని, వాటిని ఆరోగ్యవంతంగా ఉంచాలంటే తప్పనిసరిగా వ్యాయామం కావాల్సి ఉంటుందన్నారు. వివిధ రకాల క్రీడలను ఆడడం వల్ల మనిషిలో ఉన్న అవయవాలు చైతన్యపడి ఒక రకమైన వ్యాయామం జరుగుతుందన్నారు. వ్యాయామం వల్ల వ్యక్తిలో ఉన్న కొవ్వు పదార్థం కరిగిపోయి ఊబకాయాన్ని తగ్గిస్తుందన్నారు. ఊబకాయం తగ్గినట్లయితే ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారన్నారు. క్రీడలు వ్యక్తిగత ప్రయోజనంతో పాటు ఉపాధిని కూడా కలిగించే విధంగా చూడాలని, అందుకు ప్రతి ఒక్కరూ పట్టుదలతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడల్లో ప్రతిరోజు సాధన చేసినట్లయితే అనుకున్న లక్ష్యాన్ని సాధించే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థి స్థాయి నుంచే యువకులు సామాజిక దృక్పథం వైపు మొగ్గు చూపాలని, దేశాన్ని అభివృద్ధి చేసే అవకాశం కేవలం యువతపైనే ఆధారపడి ఉందన్నారు. యువకుల్లో ఒకరి ఆలోచనలను మరొకరు పంచుకుని లక్ష్యసాధన కోసం ముందుకు సాగినట్లయితే దేశం, ప్రాంతం బాగుపడుతుందన్నారు. ఈ సమావేశంలో కరాటే ప్రతినిధి పెసరు సారయ్య, టీఆర్ఎస్ నాయకులు సీహెచ్ నరేందర్ రెడ్డి, ఆకుల కుమార్, పోగుల సారంగపాణి, హరీష్, రమేష్, మహేందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

గ్రామం నుంచి వెలివేసే హక్కు వారికెక్కడిది..?

- అలాంటి వారిని కఠినంగా శిక్షించాలి
- ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ నాయకులు

విజయక్రాంతి, బోధన్: నందిపేట మండలం మారంపల్లి గ్రామంలో 80 ఎస్సీ కుటుంబాలను భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఆ గ్రామ అగ్రవర్ణాల అభివృద్ధి కమిటీ గ్రామం నుంచి వెలివేయటంపై బోధన డివిజన్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ నాయకులు మండిపడ్డారు. సోమవారం నాడు బోధన్‌లోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎస్సీ కుటుంబాలను గ్రామం నుంచి వెలివేసిన అగ్రవర్ణాల వారిని కఠినంగా శిక్షించాని బోధన్ ఆర్డీఓ గోపీరాంకు లిఖిత పూర్వక ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ బోధన్ డివిజన్ అధ్యక్షులు పరిమి కోటేశ్వర్‌రావు విలేకరులతో మాట్లాడారు. గ్రామాల నుండి ప్రజలను వెలివేసే హక్కు వారికెక్కడిదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో నిమ్న వర్ణాల ప్రజలను ఇలా సొంత నిర్ణయాలు తీసుకుని గ్రామం నుంచి వెలివేస్తూ ఎస్సీ, ఎస్టీలను చిన్న చూపు చూస్తున్న అగ్రవర్ణాల వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి దుర్ఘటనలు జరగటం సిగ్గు చేటని, ప్రభుత్వ వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు బాసటగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు సింగాడే పాండు, సమతా సైనిక్ దళ్ డివిజన్ ఇన్‌చార్జ్ నరహరి రాజేంద్ర ప్రసాద్, నీరడి రవి, కొండ్ర వెంకటి, నీరడి ఈశ్వర్, మొగులయ్య, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్ప ఆలయ సంస్కృతిని కాపాడాలి

విజయక్రాంతి, నిజామాబాద్‌అర్బన్: పదేళ్ల పైబడి 50 సంవత్సరాల లోపు వున్న మహిళలకు అయ్యప్ప ఆలయ ప్రవేశాన్ని కల్పిస్తూ దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని నగరానికి చెందిన గురుస్వాములు ధన్‌పాల్ సూర్యనారాయణ, అయ్యప్ప ఆలయకమిటీ అధ్యక్షులు గడ్డం భక్తవత్సలంలు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ నుంచి కలెక్టరేట్ వరకు అయ్యప్ప మాలధారులు, భక్తులు పెద్ద ఎత్తున సేవ్ శబరిమల ర్యాలీని నిర్వహించారు. ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ ఎం.రాంమోహన్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గురుస్వాములు ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ... దేశంలో ఏకైక పవిత్ర ఆలయంగా శబరిమలకు దశాబ్దాల చరిత్ర ఉందని అన్నారు. అక్కడ ప్రవేశం అన్యులకు సాధ్యం కాదని, అది కూడా మాలధారులకు భారతీయ సాంప్రదాయాలను ఆచరించే వారికి మాత్రమే అని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు నుంచి ఉన్న ఆచార వ్యవహారాలకు విరుద్ధంగా అయ్యప్పభక్తుల మనోభావాలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు తీర్పును ఇవ్వడం యావత్తు భారతదేశంలోనే భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని అన్నారు. ఇప్పటికే దేశంలో అత్యున్నత న్యాయస్థానం పలు తీర్పులను పునఃసమీక్షించిన నేపథ్యంలో సేవ్ శబరిమలగా ఉద్యమిస్తున్నామని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్‌ను తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకుల శ్రీశైలం, గురుస్వాములు గుండయ్య స్వామి, లక్ష్మణ్‌స్వామి, ప్రకాష్‌రెడ్డి, భూమారెడ్డి, సత్యపాల్, సాయిరాం, మహేందర్, శ్యాం కుమార్, గోపాల్ శ్రీనివాస్, పరమేశ్ ,గంగాధర్ అయ్యప్పభక్తులు మాలధారులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

- యువత ఓటు హక్కును సరిచేసుకోండి
- కాంగ్రెస్ నాయకులు రఘువర్ధనరెడ్డి

విజయక్రాంతి, కొల్లాపూర్: సర్పంచ్ ఎన్నికల్లో మూడవ విడుతల్లో జరిగే ఎన్నికలకు నాయకులు, యువత సిద్ధం కావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు బి. రఘువర్ధనరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నాడు ఆయన విజయక్రాంతితో మాట్లాడారు. నియోజకవర్గంలో అధిక శాతం సర్పంచ్‌లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లోలా ఓట్లు గల్లంతు కాకుండా యువత, ప్రజలు సరిచూసుకోవాలన్నారు. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో నియోజకవర్గంలో దాదాపు 20వేల ఓట్లు గల్లంతు అయ్యాయని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి భీరం హర్షవర్ధన్‌రెడ్డికి 30వేలకు పైగా మెజార్టీ వచ్చేదని, గల్లంతు కావడంతో మెజార్టీ తగ్గిందన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చూపించాలని యువతకు పిలుపునిచ్చారు. అదే విధంగా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతి ఒక్కరూ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. అదే విధంగా కోడేర్ మండలంలో సంక్రాంతి పండుగ ఉత్సవాల్లో భాగంగా క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.



ప్రజావాణి రద్దుతో నిరాశతో వెనుదిరిగిన లబ్ధిదారులు

విజయక్రాంతి, నాగర్‌కర్నూల్: ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమం ఎన్నికల కోడ్ అమలులో భాగంగా రద్దు చేయడంతో సోమవారం నాడు తమ సమస్యలను వివరించేందుకు జిల్లాలోని నలు మూలల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు నిరాశతో వెనుతిరిగారు. ప్రతి సోమవారం మండల కార్యాలయాలలో తహసీల్దార్ల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో వివిధ శాఖల ఉన్నత అధికారులతో ఏర్పాటు చేసే ప్రజావాణి కార్యక్రమానికి తమ గోడును వెల్లబుచ్చేందుకు అనేక మంది ప్రజలు కార్యాలయానికి చేరుకున్నారు. ఎన్నికల కోడ్‌తో ప్రజావాణిని రద్దు చేయడం జరిగిందని, ప్రజలు తమ ఫిర్యాదులను ఇన్‌వార్డులో ఇవ్వాలని అధికారులకు తెలపడంతో ఇక్కడకు హాజరైన ఫిర్యాదు దారులు అధికారులకు లేకపోవడం వల్ల చేసేది లేక నిరాశతో వెనుదిరిగారు. ముందస్తుగా ప్రజావాణిని రద్దు చేసినట్లుగా సమాచారం ఉంటే ఇంత దూరం వచ్చేవారమే కాదని పలువురు ఫిర్యాదు దారులు వాపోయారు. ఇటీవల రెండు నెలలకు పైగా శాసన సభ ఎన్నికలతో ప్రజావాణి నిర్వహించలేదు. ఇప్పుడు స్థానిక ఎన్నికల పేరుతో ప్రజావాణి రద్దు చేయడంతో ఇప్పట్లో తమ సమస్యలు పరిష్కారం కావని వాపోయారు.

నామినేషన్లు వేసిన అభ్యర్థులు

విజయక్రాంతి, వనపర్తి: వనపర్తి నియోజక వర్గంలోని నాలుగు మండలాల్లో సోమవారం గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులకు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఖిశారు, గోపాల్‌పేట, వనపర్తి, రేవల్లి మండలాల్లో మొత్తం 34 మంది సర్పంచ్ అభ్యర్థులుగా, 30 మంది వార్డు సభ్యులుగా నామినేషన్లు దాఖలు చేశారు. మెదటిరోజు వనపర్తి మండలంలో 7 మంది అభ్యర్థులు సర్పంచ్‌లుగా నామినేషన్లు దాఖలు చేశారు. అదే విధంగా వార్డు సభ్యులుగా నలుగురు నామా పత్రాలు వేశారు. ఖిశారు మండలంలో 11 మంది అభ్యర్థులు సర్పంచ్ లుగా, వార్డు సభ్యులుగా 6 మంది నామినేషన్లు వేశారు. గోపాల్‌పేట మండలంలో సర్పంచ్‌లుగా 5 మంది, వార్డు సభ్యులుగా 8 మంది నామినేషన్లు దాఖలు చేశారు. రేవల్లి మండలంలో సర్పంచ్ పదవికి 11 మంది, 12మంది వార్డు సభ్యులుగా నామినేషన్లు వేశారు.

రుణాలివ్వాలటూ బ్యాంకు ఎదుట మహిళల ఆందోళన

విజయక్రాంతి, కల్వకుర్తి: తమకు మంజూరైన రుణాలు ఇవ్వాలంటూ పొదుపు సంఘాల మహిళలు కల్వకుర్తి గాంధీనగర్‌లోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ బ్రాంచ్ ఎదుట ధర్నా నిర్వహించారు. పొదుపు సంఘాల మహిళలకు శ్రీనిధి అకౌంట్‌లో రుణాలు పడినా ఇవ్వడంలేదని, బ్యాంకులో డబ్బులు లేవని మానసికంగా హింసిస్తున్నారని మహిళసంఘాలు ఆరోపిస్తున్నారు. ఇంతకుమునుపు జీరో అకౌంట్ ఉన్నా మళ్లీ కొత్తగా పదిహేను వందలతో కొత్త అకౌంట్ తీయాలని, అకౌంట్‌లోనే తమకు డబ్బులు వస్తాయని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారని పేర్కొన్నారు. పదిహేను వందల రూపాయలు ఎక్కడి నుంచి తేవాలని, డబ్బులు లేకనే మహిళాసంఘాల ద్వారా రూ.15 వేలు అప్పు తీసుకుంటుంటే మళ్లీ అకౌంట్ తీసుకోమంటున్నారని అవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కంప్యూటర్స్ పనిచేయడం లేదని గేటుకు తాళం వేయడంతో ఆగ్రహించిన మహిళలు బ్యాంకు ముందే ధర్నా నిర్వహించారు. మేనేజర్ డాం డాం అనడంతో గేటు లోపలి నుంచే మీకు ధమాక్ ఉందా అని మహిళలను అసభ్య పదజాలంతో తిట్టారని, బ్యాంకులో పనిచేసే అటెండర్ నుంచి మేనేజర్ దాకా మహిళలు అనే గౌరవం ఇవ్వకుండా మాట్లాడుతారని పేర్కొన్నారు. వాటికి సంబంధించిన వీడియోలు కూడా తమ దగ్గర ఉన్నాయని మహిళలు తెలిపారు. చివరకు కల్వకుర్తి ఎస్.ఐ నర్సింహులు, మేనేజర్, మహిళా సంఘాల నాయకులను కొంతమందిని లోనికి పిలిచి చర్చించి కొత్త అకౌంట్ తీయాల్సిన అవసరం లేదని, పొదుపు ఖాతాలోనే రుణాలు వేస్తామని, మహిళా సంఘాల లీడర్లను పిలిచి వారి ద్వారా రుణాలు అందజేస్తామని బ్యాంక్ మేనేజర్ హామీ ఇవ్వడంతో మహిళా సంఘాలు శాంతించి వెనుతిరిగారు.

పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

విజయక్రాంతి, వికారాబాద్: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఉన్నత ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం మేకవనంపల్లి ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలలోని పదవ తరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి ఉపాధ్యాయుల బోధనపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థుల హాజరు పట్టిక తదితర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా సకాలంలో పాఠశాలకు హాజరు కావాలన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసి పదవ తరగతి ఫలితాల్లో జిల్లా మొదటి స్థానంలో ఉండేలా చూడాలన్నారు.

తాగునీరు లేదు కానీ మద్యం పుష్కలం..!

పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన



విజయక్రాంతి, దుబ్బాక: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటీనుండి రాష్ట్రటం మద్యం ఏరులై పారుతుంది తప్పా బుక్కెడు మంచి నీళ్లు దొరకడం లేదని దుబ్బాక పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం దుబ్బాక పట్టణానికి చెందిన 7వ వార్డు మహిళలు నగర పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. గత 20రోజుల నుంచి తమ వార్డుకు చుక్క మంచి నీరు రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటీ సమస్య తీర్చడంలో ఇటు మున్సిపల్ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం చెప్పేది గొప్ప చేసేది ఏమి లేదన్నారు. ఇంటింటికి తాగునీరు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికి ఎంత మందికి అందించారో చెప్పాలని వారు ప్రశ్నించారు. ఇప్పటీకైనా స్పందించి తమ వార్డుకు తాగు నీరును అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మహిళలు పాల్గొన్నారు.

విజ్ఞప్తులను పరిష్కరించాలి



విజయక్రాంతి, సిద్దిపేట: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో వచ్చే విజ్ఞప్తులను వెంటనే పరిష్కరించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ దేవరకొండ కృష్ణభాస్కర్ అన్నారు. సోమవారం సిద్దిపేటలోని ఆర్ అండ్ బీ గేస్ట్‌హౌజ్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దరఖాస్తులను జాయింట్ కలెక్టర్ పద్మాకర్, డిఆర్ఓ చంద్రశేఖర్‌తో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణికి జిల్లా అధికారులంతా తప్పకుండా హాజరు కావాలని, గ్రీవేన్స్ సెల్‌కు వచ్చిన విజ్ఞప్తులను పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. అలాగే పరిష్కరించిన వాటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. నిర్వహించిన ప్రజావాణిలో వివిధ అంశాలపై దాదాపు 38 దరఖాస్తులును అధికారులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రవికాంత్, డిడబ్ల్యువో జరినాబేగం తదితర అధికారులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత



విజయక్రాంతి, బోథ్: బజార్‌హత్నూర్ మండలపరిధిలోని దేగామా గ్రామానికి చెందిన మర్రి భోజన్న తన స్వంత కిరాణా షాప్ పక్కన మద్యం విక్రయిస్తున్నాడన్న పక్కా సమాచారంతో సోమవారం ఎస్సై బాఖీ ఆధ్వర్యంలో గ్రామంలోని అతని షాప్ వద్ద దాడి నిర్వహించారు. ఈ దాడిలో దాదాపు 11,030 విలువ గల 126 బాటిల్లను స్వాధీనపరుచుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాగునీటి కోసం గ్రామస్థుల ఆందోళన

విజయక్రాంతి, పటాన్‌చెరు: త్రాగటానికి మంచి నీరు సరఫరా కావడం లేదని మండల పరిధిలోని ఇస్నాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు సోమవారం ఖాళీ బిందేలతో మహిళలు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల కథనం ప్రకారం పంచాయతీ అధికారులు గ్రామంలో వేసిన మిషన్ భగీరథ పైప్‌లైన్‌లో నుంచి బోరు వాటర్‌ను తాగటానికి సరఫరా చేస్తున్నారని వివరించారు. బోరునీరు సరఫరా చేయడంతో అవి కలుషితమై సరఫరా అవుతుండటంతో వాటిని తాగిన పిల్లలు, వృద్దులు అస్వస్థతకు గురవుతున్నారని పేర్కొన్నారు. కలుషితమైన నీరు తాగి అస్వస్థతకు గురై ఆసుపత్రుల పాలయ్యామని అన్నారు. గత కొన్ని రోజులుగా మంజీరా నీరు అధికారులు సరఫరా చేయడం లేదన్నారు. తాగటానికి మంచి నీరు ఎప్పుడు సరఫరా చేస్తారని అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రశ్నించగా ఈ రోజు, రేపు అని సమాధానం ఇస్తున్నారని తెలిపారు. ఈ రోజు సోమవారం కూడా అధికారులను మంచినీటి సమస్య గురించి అడగగా ఫోన్‌లోనే సమాధానాలు ఇస్తున్నారే తప్ప గ్రామానికి వచ్చి సమస్యను పరిష్కరిచడం లేదన్నారు. అందుకే చేసేది లేక అధికారులకు, ప్రజాప్రతినిధులకు గ్రామస్థుల త్రాగునీటి బాధ అర్థం కావాలని గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ఖాళి బిందేలతో నిరసన చేపట్టామని పేర్కొన్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.

సమ్మెతో సింగరేణికి నష్టమే

- 27 శాతం లాభాలను అందించాం
- సమ్మెలోకి కార్మికులు వెళ్లొద్దు సింగరేణి జీఎం



విజయక్రాంతి, చెన్నూర్ (మంచిర్యాల): మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజక వర్గంలోని మందమర్రి కేంద్రంలోని సింగరేణి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సింగరేణి జి.ఎం. ఎం.రాఘవులు మాట్లాడుతూ జాతీయ కార్మిక సంఘాల నాయకులు జాతీయ స్థాయిలో చేపడుతున్నటువంటి రెండు రోజుల సమ్మెలో భాగంగా, సింగరేణిలో సంస్థలో జరుగుతున్నటువంటి ఉత్పత్తికి, కార్మికులు నిర్వహిస్తున్నటువంటి విధులకు ఎటువంటి ఆటంకం కలగకుండా, కార్మికులు సమ్మెలో భాగస్వాములు కాకూడదని జీఎం రాఘవులు పిలుపునిచ్చారు. మందమర్రి జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాఘవులు మాట్లాడుతూ 8వ, 9వ తేదీలలో నిర్వహించే సమ్మె వలన సింగరేణి సంస్థకు 53 కోట్ల నష్టం జరగడమే కాకుండా, సంస్థలో పనిచేసే ఉద్యోగస్తులకు 20 కోట్ల రూపాయల జీతాల రూపంలో నష్టం వాటిల్లుతుందని అన్నారు. మందమర్రి ఏరియాలో ఉన్న గనులలో ఒక రోజుకు 17 వేల టన్నుల ఉత్పత్తి నష్టపోయే అవకాశం ఉందని, అభివృద్ధి పథంలో సింగరేణి సంస్థ ముందుకు వెళ్తున్నటువంటి తరుణంలో ఇలాంటి సమ్మెలు చేయడం సరికాదని భావించారు. ఇందులో భాగంగానే సింగరేణి సంస్థకు సంబంధంలేని డిమాండ్లలో పేర్కొన్న అంశాలు, సింగరేణి సంస్థకు సంబం ధించిన అంశాలు కావని, వారు లేవనెత్తిన డిమాండ్ల వివరాలు, వాటిపై నిర్ణయం తీసుకునే పూర్తి అధికారం కానీ, అవకాశం కానీ, ఒక్క కేంద్ర ప్రభుత్వానికే ఉందని పేర్కొన్నారు.

కార్మికులు నష్టపోతారు

గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ 1212 కోట్ల లాభాలను ఆర్జించిన తరుణంలో వచ్చినటువంటి లాభాల నుంచి కార్మికులకు 27శాతం వాటాను ప్రకటించి అందులో 328 కోట్ల రూపాయలు లాభాలను బోనస్ రూపంలో కార్మికులకు అందజేశామని తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా జరగుతున్నటువంటి సమ్మెలో మందమర్రిలో ఉన్నటువంటి గనులపై సమ్మె జరగకుండా కార్మికులకు ముందుగానే కడపత్రాలు అందచేశామని, సమ్మె జరగడం వలన సంస్థకు జరిగే నష్టాన్ని కూడా వివరించామని తెలిపామన్నారు. సింగరేణి కార్మికులు ఒక రోజు విధులకు హాజరు కాకపోతే జీతాల రూపంలో 4012 రూపాయలు నష్టపోయే అవకాశం ఉందని, మందమర్రి ఏరియాలో మొత్తం సింగరేణి కార్మికులు 5800 వందల మంది విధులు నిర్వహిస్తున్నారని, ఈ సమ్మె జరగడం వలన కార్మికులందరూ తమ జీతాల రూపంలో 231200 రూపాయలు నష్టపోయే పరిస్థితి నెలకొంటుందని వివరించారు. కార్మికుల సంక్షేమానికి సింగరేణి సంస్థ పూర్తిస్థాయిలో కోట్ల రూపాలయలు వెచ్చించి, ఏ ప్రభుత్వ రంగ సంస్థలు పని చేయనటువంటి విధంగా సింగరేణి సంస్థలో కార్మికుల సంక్షేమ అభివృద్దే ధ్యేయంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, సంస్థలో పనిచేస్తున్నటువంటి కార్మికులందరూ జరుగుతున్నటువంటి అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని, సమ్మెకు దూరంగా ఉంటూ, సంస్థ నిర్దేశించినటువంటి లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు. రేపు జరగబోయే సమ్మెను దృష్టిలో పెట్టుకొని విధులకు హాజరయ్యే కార్మికులకు పోలీసు యంత్రాంగం ద్వారా రక్షణ చర్యలు చేపడుతామని, అదనపు పనివేళల సమయానికి అనుమతులు కూడా ఇస్తున్నట్లు ఈ సందర్భంగా తెలియపరిచారు. కార్యక్రమంలో డివైపి.యం శ్యాంసుందర్, ఐఈడి.ఎస్ రాజన్న, ఎస్, ఓటు జి.ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇద్దరు ఘరానా దొంగల అరెస్ట్

రూ.22లక్షల 76వేల విలువైన అభరణాల స్వాధీనం



విజయక్రాంతి, ఆదిలాబాద్: జిల్లాలో వరుస చోరీలకు పాల్పడుతున్న ఇరువురు ఘరానా దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.22లక్షల 76వేల విలువైన అభరణాలు, ఎలక్ట్రానిక్‌వస్తువులు, నగదును స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. సోమవారం పోలీస్ పరేడ్ మైదానంలోని సమావేశమందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో దోపిడీ దొంగలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ నేతృత్వంలో ప్రత్యేక పోలీస్ బృందం దస్నాపూర్‌లోని పెట్రోల్‌బంక్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ ఆటో అనుమానాస్పదంగా వెళుతున్నట్లు గుర్తించారన్నారు. ఆ ఆటోను నిలిపి తనిఖీ చేయగా పాత నేరస్థులు మహ్మద్ మోయిస్(24, రాంటెంకి రాజేశ్వర్(24)లు మూడు కిలోల గంజాయి, రెండు టీవీలను తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. మరో నేరస్తుడు సలీం పరారీలో ఉన్నట్లుగా తెలిపారు.దొరికిన వారిని విచారించగా నేరాలను అంగీకరించారన్నారు.

ఇటీవల పట్టణంలో జరిగిన పలు దొంగతనాలకు సంబంధించిన సోమ్మును వారి నుంచి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. రూ.19లక్షల 20,000 విలువైన బంగారు అభరణాలు, రూ.30,000విలువైన వెండి, నగదు రూ.1,46,000 , టీవీలు–3 రూ.80,000, గంజాయి రూ.50వేలు, పది వాచీలు రూ.10వేలు, కెమెరాలు–2 రూ.40వేల చొప్పున మొత్తం రూ.22లక్షల 76వేలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ కె.మోహన్, డిఎస్పీ నర్సింహారెడ్డి, సీఐ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలపాలి

విజయక్రాంతి, ఆదిలాబాద్: ఈ విద్యాసంవత్సరానికి గాను పదో తరగతిలో మెరుగైన ఉత్తీర్ణతను సాధించి ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ దివ్యదేవరాజన్ ఆకాంక్షించారు. సోమవారం సాయంత్రం స్థానిక ఎస్సీ సమీకృత బాలికల వసతిగృహంలో ఎస్సీ, బీసీ వసతిగృహ పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ, శిక్షణ తరగతులను నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమయ పాలన పాటిస్తు ప్రణాళికా బద్ధంగా చదవడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఆదిశగా విద్యార్థులను సన్నద్దులను చేయాల్సిన బాధ్యత వసతిగృహ సంక్షేమాధికారులపై ఉందన్నారు. మోడల్ ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయడం ద్వారా సబ్జెక్ట్ సులభంగా అర్థమవుతుందని తద్వారా ఎవరిపై ఆధారపడకుండా పరీక్షలు ప్రశాంతంగా రాయవచ్చన్నారు. నకలుపై ఆధారపడాల్సిన అవసరముండదన్నారు. మెరుగైన ఫలితాలు సాధించడం ద్వారా ప్రభుత్వపరంగా ఐటీఐ కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఆ దిశగా ఉపాధ్యాయులు కూడా కృషి చేయాలని అన్నారు. విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించాలంటే కేవలం ఉపాధ్యాయుల కృషి ఉంటే సరిపోదని తల్లిదండ్రుల శ్రద్ధ, ప్రోత్సాహం కూడా అవసరం ఉంటుందన్నారు. ఆ దిశగా అందరూ కలిసికట్టుగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి జి.ఆశన్న, సహాయ సంక్షేమాధికారులు ప్రవీణ్‌కుమార్, సునీత, పర్యవేక్షకులు మనోహర్ పాల్గొన్నారు.

పుర పోరుకు సర్వం సిద్ధం

విజయక్రాంతి, తాండూరు: మున్సిపల్ ఎన్నికలను మార్చ్‌లో నిర్వహించడానికి ఎన్నికల సంఘం సిద్ధం కావడంతో తాండూరు మున్సిపల్ అధికారులు ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు.వార్డుల విభజన, ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. ఓటర్ల జాబితాకు ప్రభుత్వం విధించిన గడువు ముగియడంతో తుది జాబితాను అధికారులు విడదల చేయనున్నారు. తాండూరు మున్సిపల్ పరిధి పెరిగిన వార్డులను మాత్రం యధా విధిగా కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం తాండూరు మున్సిపల్ పరిధిలో మొత్తం 31 వార్డులు ఉన్నాయి. కొత్తగా మున్సిపల్ పరిధిని ఆంతారం, రాజీవ్ కాలని, ఇందిరమ్మ కాలని, గౌతాపూర్ గ్రామ రెవెన్యు పరిధిని పెంచిన కొత్త ఓటర్లను ఇందులోనే విలీనం చేశారు. మున్సిపల్ పరిధిలోని 1,2,7,8,9 వార్డులకు కొత్త ఓటర్లను కలిపారు. మున్సిపల్ పరిధిలోని మొత్తం ఓటర్ల సంఖ్య 54,512గా నమోదు చేశారు. ఇందులో 439 మంది ఎస్టీ పురుషులు, 465 మంది మహిళలు, 1565 మంది ఎస్సీ పురుషులు, 1691 మహిళలు,18517 మంది బీసీ పురుషులు,19,154 మంది మహిళలు, 6509 మంది ఇతరులలో మహిళలు, 6164 మంది పురుషులు ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. అయితే అధికారులు ఓటర్ల జాబితాను సరిచేయలేదన్న ఆరోపణలు వస్తున్నాయి. మార్పులు చేర్పులకు దరఖాస్తున్నా ఫలితం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. అయితే మున్సిపల్ శాఖ సిడిఎంఎ కార్యాలయం జారి చేసిన నిబంధనలు మున్సిపల్ అధికారులు పాటించలేదు. మరో పక్క మున్సిపల్ పరిధి పెంపుతో వార్డుల విభజన అడ్డగోలుగా మారింది. మున్సిపల్ పరిధిలోని 7,8,30 వార్డులలో ఓటర్ల సంఖ్య 3 వేలకు దాటి పోయింది. మిగిలిన వార్డులలో 1200 నుంచి 1500 వరకు మాత్రమే ఉంది. దీనిపై ఆయా వార్డుల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇక మున్సిపల్ ఎన్నికలను మార్చ్‌లో నిర్వహించాలని ఎన్నికల సంఘం చెప్పడంతో ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికలకు సిద్ధమవుతున్నారు.మున్సిపల్ రిజర్వేషన్‌లపై ప్రజాప్రతినిధిలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

గత ఎన్నికలలో తాండూరు మున్సిపల్ చైర్మన్ స్థానం జనరల్ మహిళలకు కేటాయించారు. ఈ సారి బీసీ జనరల్ లేదా బీసీ మహిళలకు రిజర్వు కావచ్చన్న ఆశలో ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అధికార టీఆర్ఎస్ గెలుపొందిన తాండూ రు మాత్రం టీఆర్ఎస్‌కు ఎదురుగాలి వీచింది. మాజి మంత్రి మహేందర్‌రెడ్డి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినా పైలెట్ రోహిత్‌రెడ్డి విజయం సాధించారు. ఇక మున్సిపల్ ఎన్నికలలో సైతం కాంగ్రెస్ పార్టీ విజయం సాధిం చే దిశగా కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అయితే గత 25 సంవత్సరాలు ఎమ్మెల్యేగా మహేందర్‌రెడ్డి ఒక్క పర్యాయం కూడా మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకోలేదు. గత ఎన్నికలలో పూర్తి స్థాయిలో మెజార్టీ లేక పోవడంతో ఎంఐఎంతో పెట్టుకుని చెరి రెండున్నర సంవత్సరాలకుగాను మున్సిపల్ చైర్మన్‌ను ఎన్నికున్నారు. అయితే రెండున్నర సంవత్సరాల అనంతరం మహేందర్‌రెడ్డికి మరో షాక్ తగిలింది.21 స్థానాలతో మెజార్టీ ఉన్న టీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలకు చెక్ పెట్టి కేవలం 7 స్థానాల మెజార్టీ ఉన్న కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని కైవశం చేసుకుంది.

పేదలకు దుప్పట్లు పంపిణీ చేసిన డీఎస్పీ



విజయక్రాంతి, బోథ్: జిల్లాలో చలితీవ్రత ఎక్కువ్వున్నందున జిల్లా కలెక్టర్ దివ్యదేవరాజన్ వినూత్న రీతీలో తనకు నూతన సంవత్సర శుభాకాంక్షలను పుష్పగుచ్చాలతో కాకుండా దుప్పట్లు, స్వెటర్లు, మంకీ క్యాప్‌లతో తెలపాలని కోరిన విషయం విదితమే. ఈ నిర్ణయానికి మంచి స్పందన వచ్చి ప్రజలు భారీగా దుప్పట్లను తెచ్చి శుభాకాంక్షలను తెలిపారు. అలా జమచేసిన దుప్పట్లను ప్రజలకు చలి తీవ్రత నుంచి కాపాడటానికి వృద్ధులకు, హాస్టల్ విద్యార్థులకు అందజేయాలని సూచించడంతో డీఎస్పీ నర్సింహా రెడ్డి సోమవారం బోథ్ మండలంలోని ఆదివాసీ గ్రామాలైన వజ్జర్, టివిటిపల్లె, జీడిపల్లె గ్రామాల్లోని వృద్ధులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

ఈ కార్యక్రమంలో బోథ్ ఎంపీడీవో బి. అప్పారావు, సీఐ జయరాం నాయక్, ఎస్సై సతీష్‌లు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు పొందాలి

విజయక్రాంతి, మంచిర్యాల: మంచిర్యాల ట్రాఫిక్ ఎస్సై భవానీ సేన్ ముమ్ముందు ఇంకా ఎన్నో పదోన్నతులు పొందాలని మంచిర్యాల ట్రాఫిక్ సిఐ రమేష్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి వసతి గృహంలో ఇటీవల ఎస్సైగా పదోన్నతి పొందిన ఎస్సై భవానీ సేన్‌ను ట్రాఫిక్‌సిఐ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌పోలీసులు సన్మానించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ రమేష్ బాబు మాట్లాడుతూ కానిస్టేబుల్‌తో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన భవానీ సేన్ పోలీసుశాఖ అత్యుత్తమ ప్రదర్శనలు కనబర్చి ట్రాఫిక్ ఎఎస్సైగా, ఇప్పుడు ఎస్సైగా పదోన్నతులు పొందడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ముమ్ముందు కూడా ఇలానే తన భాధ్యతలను నిర్వహించి, పదోన్నతులు సాధించాలని అన్నారు. పోలీసులు నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తున్నారన్నారు. పదోన్నతులు దక్కడంతో వారినిలోని మరింత ప్రతిభ వెలుగులోకి రాగలదన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది రాజ బాబు, రమేష్, భూమన్న, రవి, భీమారావు, రఫీక్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు చేపట్టాలి



విజయక్రాంతి, ఆదిలాబాద్: ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల పరిధిలోని విద్యార్థులతో నిర్వహించిన ఇన్‌స్పైర్ మనక్ సైన్స్‌ఎగ్జిబిషన్ సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. 2016–17, 2017–18 విద్యాసంవత్సరానికి గాను మూడు జిల్లాల పరిధిలోని విద్యార్థులు తమ ప్రతిభా నైపుణ్యాన్ని చాటేలా 311 ఎగ్జిబిట్‌లను తీసుకువచ్చారు. జిల్లా స్థాయి సైన్స్‌టీచర్లు, విద్యార్థుల గైడ్ టీచర్లు సైతం విద్యార్థుల వెంట వచ్చారు. జిల్లాకేంద్రంలోని జోసేఫ్ కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ ప్రదర్శనను ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ దివ్యదేవరాజన్ రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. విద్యార్థులు తీసుకొచ్చిన ఎగ్జిబిట్లను స్వయంగా తిలకించిన ఆమె వాటి పనితీరు, వినియోగం వంటి అంశాలపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకుని సమాజానికి ఉపయోగపడేలా నూతన ఆవిష్కరణలను తీసుకురావాలన్నా రు. సైన్స్‌ను కష్టంగా భావించకుండా ఇష్టపడి చదువుతూ అందులో అత్యుత్తమ ప్రతిభను చాటుకుని భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా ఎదుగాలని పిలుపునిచ్చారు. మరో రెండు రోజుల పాటు సాగనున్న ఈ ఇన్‌స్పైర్ మేళాను ప్రతి విద్యార్థి తిలకించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు రవీందర్‌రెడ్డి, ప్రణీత, పరిశీలకులు ప్రతీక్‌పవార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



విజయక్రాంతి, వికారాబాద్: వాహనదారులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని వికారాబాద్ డీఎస్పీ శిరీష హెచ్చరించారు. సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఈ చలాన్‌లపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రధాన కూడళ్లలోని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద సిగ్నల్ దాటితే ఈ చలాన్ విధిస్తామన్నారు. విధించిన జరిమానకు సంబంధించిన రశీదును వాహనదారుకు అందజేస్తామని, వీలైనంత త్వరగా వాహనదారులు జరిమానాను మీ సేవాలో ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. గతంలో మాదిరి పోలీసుల చేతికి జరిమానా డబ్బులు ఇవ్వకుండా పోలీసు శాఖ పారదర్శకతను నిరూపించుకునేందుకు ఈ చలాన్‌ను అమలు చేస్తుందన్నారు. వాహనదారులు అతివేగంగా వాహనం నడిపినా, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా, త్రిపుల్ డ్రైవింగ్ చేసిన ఈ చలాన్ విధిస్తామని హెచ్చరించారు. జరిమాన విధించిన మీ సేవాలో చెల్లించనట్లైతే వాహనాన్ని సీజ్ చేస్తామని ఆమె స్పష్టం చేశారు. అవసరమైతే డ్రైవింగ్ లైసెన్సును కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ సీఐ సీతయ్య, ఎస్ఐ లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడలపై శ్రద్ధ చూపాలి



విజయక్రాంతి, సంగారెడ్డి: క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక ధారుడ్యానికి ఉపయుక్తమతుతాయని అసిస్టెంట్ కలెక్టర్ జీతేష్ పాటిల్ అన్నారు. సోమవారం ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు స్థానిక అంబేద్కర్ స్టేడియంలో జిల్లా స్థాయి క్రీడోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ హజరై క్రీడలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు నిర్వహిస్తున్న క్రీడలు వారిలో ఉన్న నైపున్యాన్ని ప్రతిభను వెలికి తీయడానికి మంచి అవకాశంగా భావించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. హాస్టల్ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై శ్రద్ధ చూపాలని ఆయన విద్యార్థుల కు సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

రామగుండంలో కొత్వాల్ కొరడా!

అక్రమార్కులపై పీడీ యాక్ట్

విజయక్రాంతి, రామగుండం: రామగుండం పోలీసు కమిషరేట్‌లో అక్రమార్కులపై కొత్వాల్ కొరడా ఝులిపించారు. ప్రజా జీవనానికి భంగం కలిగించే అసాంఘీక శక్తులపై ఉక్కుపాదం మోపుతు న్నారు. పీడీ యాక్ట్‌లను సంధిస్తున్నారు. ఈ పీడీ యాక్ట్ ప్రాతిపదికన ఈ ప్రాంతం నుంచి బహిష్కరణకు పూనుకుంటున్నారు. ఇప్పటికే 8 మంది అసాంఘిక శక్తులపై పీడీ యాక్ట్‌ను ప్రయోగించగా, తాజాగా సోమవారం గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ.. అనేక మంది అమాయకుల జీవితాలను బుగ్గిపాల్జేస్తున్న మరో ఇద్దరిపై పీడీ యాక్ట్‌ను విధించారు. రామగుండం పోలీసు కమిషనర్ వి.సత్యనారాయణ మీడియాకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన కామెర్ల శ్యాం (48) గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ... 2015లో పోలీసులకు పట్టుబడగా, పాలకుర్తి మండలం కుక్కలగూడురుకు చెందిన నలిమెల వినోద్ (25) ఇదే నేరంపై 2017లో పోలీసులు అరెస్ట్ చేశారు. జైలు శిక్షను అనుభవించిన శ్యాం, వినోద్ బయటికి వచ్చి పాత నేరాన్నే కొనసాగిస్తూ... తమ ప్రవర్తనను మార్చుకోలేదు. అమాయక యువకులను ఈ గంజాయికి బానిసలను చేసే వాతావరణాన్ని సృష్టించారు. ఈ క్రమంలో ప్రస్తుతం కరీంనగర్ జిల్లా జైలులో ఇద్దరు నేరగాళ్లు జైలుశిక్షను అనుభవిస్తున్నారు. జైలు అధికారుల సమక్షంలో గోదావరిఖని వన్‌టౌన్ సీఐ మహేందర్ ఈ పీడీ యాక్ట్ ఉత్తర్వులను శ్యాం, వినోద్‌లకు అందజేశారు. ఈ ఉత్తర్వుల మేరకు ఈ ఇద్దరిని వరంగల్ కేంద్ర కారాగారానికి తరలించినట్టు సీపీ తెలిపారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

విజయక్రాంతి, దుబ్బాక: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, దానికి వ్యతిరేకంగా ఈ నెల 8,9వ తేదిల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే దేశా వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గొడ్డు బర్ల భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకొని వారికి పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని ఆయన మండిపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో పెట్టడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి వారిని రెగ్యూలరైజ్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, మహిళ కార్మికులకు ప్రసూతి సెలవులు అమలు చేయాలన్నారు. డిమాండ్లన్నీ నెరవేర్చేవరకూ కార్మిక సమ్మెలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎం డ్రైవర్లు బాలయ్య, సాయిలు, కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అవి తింటే మజ్జిగ తాగాల్సిందే...

మసాలా దినుసులు తింటున్నారా.. అయితే తప్పక మజ్జిగ తీసుకోవాలని చెప్తున్నారు ఆరోగ్య నిపుణులు. మజ్జిగలోని లాక్టిక్ ఆసిడ్ అనే ఆమ్లం కడుపులోని గ్యాస్ సమస్యను తగ్గిస్తుంది. ఆయుర్వేద ప్రకారం గ్యాసుకు మజ్జిగ మంచిది. మసాలా దినుసులతో చేసిన ఆహారం తీసుకున్నవారు తప్పకుండా మజ్జిగ తీసుకోవాలి. మసాలా దినుసులు తిన్న తరువాత మజ్జిగ సేవించడం ద్వారా అసిడిటీ కూడా తగ్గుముఖం పడుతుంది.

పచ్చని తులసి ఆకులను వేడి నీటిలో మరగించుకోవాలి. కాసేపటివరకు అలానే ఉంచి ఆ తరువాత చల్లార్చుకోవాలి. ఈ తులసి నీటిని ప్రతి రోజూ తాగడం వల్ల పది రోజుల్లో గ్యాస్ కొంతవరకైనా తగ్గుతుందని వారు సూచిస్తున్నారు. అలానే గ్యాస్ నుంచి ఉపశమనంతో పాటు శరీరానికి వెంటనే శక్తి లభించాలంటే కొబ్బరి నీళ్లు తాగాలి. బెల్లం గ్యాస్ సమస్యకు ఎంతగానో దోహదపడుతుంది. బెల్లంలోని మెగ్నీషియం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. క్యాల్షియం కూడా లభిస్తుంది.

ఇకపోతే.. ఒక కప్పు నీటిని మరిగించి అందులో ఒక స్పూన్ సోంపు వేసి కాసేపు అలానే ఉంచాలి. ఆ పాత్రకు మూత పెట్టి రాత్రంతా అలానే ఉంచుకోవాలి. ఉదయాన్నే ఈ నీటిలో స్పూన్ తేనె కలుపుకుని తాగండి. ఇలా రోజుకు మూడుపూటలా తాగితే అసిడిటీకి పరిష్కారం లభించినట్లేనని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

దమ్ ఆలూ, వాంగీ బాత్..

పంజాబీ దమ్ ఆలూ

దమ్ ఆలూగా పిలిచే ఈ వంటకం చక్కగా ఉడికిన, మసాలా దినుసులతో కూర బడిన ఆలూ, ఇంకా కస్తూరి మెంతులు, జీలకర్ర, జీడిపప్పు, ఏలకులు, దాల్చిన చెక్క, ఇతర భారతీయ దినుసులన్నీ వేసి నోరూరించే కూరలతో అద్భుతమైన కాంబినేషన్. పంజాబీ ఆహారంలోనే ముఖ్య వంటకమైన పంజాబీ ఆలూ రెసిపి భారతీయ ప్రసిద్ధ వంటకంగా ప్రపంచంలో పేరు తెచ్చుకుంది.



కావల్సిన పదార్థాలు

చిన్న బంగాళదుంపలు 15–18
కొత్తిమీర 2 కట్టలు
టమాటా ప్యూరీ 3/4 కప్పు
పెరుగు 3/4కప్పు
నూనె 5చెంచాలు
ఉల్లిపాయ 1 కప్పు
అల్లంవెల్లుల్లి పేస్టు 1 చెంచా
జీలకర్ర 1 చెంచా
జీడిపప్పు 6, 7
దాల్చినచెక్క 1 ముక్క
ఏలకులు1, లవంగాలు1
ధనియాలు 1చెంచా
కస్తూరి మెంతులు 1 చెంచా
పంచదార 1 చెంచా
కారం 1 చెంచా
ఉప్పు1 చెంచా
ఇంగువ1 చెంచా
బిర్యానీ ఆకు 1
పసుపు 1 చెంచా

తయారీ విధానం

ధనియాలు, దినుసులు, జీడిపప్పు, జీలకర్ర అన్నీవేసి మెత్తని పొడిలా మిక్సీ పట్టండి. కుక్కర్‌లో నీళ్ళు పోసి బంగాళదుంపలు మెత్తగా అయ్యేవరకు ఉడికించండి. బంగాళదుంపల తొక్కు తీసేసి, ఫోర్క్‌తో ఆలూలలో గుచ్చిత్తే మసాలా లోపలి వరకూ వెల్తుంది. ఒక పెనం తీసుకుని, నూనె వేసి, బంగాళదుంపలు గోధుమరంగులోకి మారేదాకా వేయించాలి. ఇంకో పెనం తీసుకుని, నూనె, బిర్యానీ ఆకు, అల్లం వెల్లుల్లి పేస్టు, ఉల్లిపాయ ముక్కలు వేసి ఉల్లిముక్కలు లేత బ్రౌన్ రంగులోకి మారేదాకా కలపండి. టమాటా ప్యూరీని వేసి మళ్ళీ కలపండి. ప్యూరీ గట్టిపడుతుంటే, మసాలా దినుసుల మిశ్రమాన్ని వేసి ఆపకుండా కలుపుతూ ఉండండి. పెరుగు, కారం, ఉప్పు వేసి బాగా కలపండి. పసుపు, పంచదార వేసి కాకాకాసేపు మగ్గనిచ్చి ఆఖరిగా నీళ్ళు పోయండి. కస్తూరి మెంతులు వేసి ఒక నిమిషం కలపండి. మూత ఉంచి కొన్ని నిమిషాలు ఉడకనివ్వండి, కూర గట్టిపడుతూ, అన్ని దినుసుల వాసనతో ఘుమఘుమలాడుతూ ఉంటుంది. బంగాళదుంపలను ఈ కూరలో వేసి బాగా కలపండి. బంగాళదుంపలు కూరలో వేసి ఉడికించాక, దమ్ ఆలూను బౌల్ లోకి తీయండి.

కొత్తిమీరతో పైన అలంకరిస్తే చపాతీ లేదా పూరీలోకి కూర రెడీ.



వంకాయ పోషకవిలువలకి, యాంటీఆక్సిడెంట్ లక్షణాలకు ప్రసిద్ధి. ఇది బ్రేక్ ఫాస్ట్ వంటకం కూడా. వాంగీ బాత్‌లో వాడే భారతీయ దినుసుల సువాసనలన్నీ దేనికవి అందంగా అమరిపోతాయి. వేయించిన సెనగపప్పు, మినపప్పు, అలాగే మసాలా దినుసులైన లవంగాలు, ఏలకులు, దాల్చినచెక్క, వాటితో మెంతులు, ధనియాల కలయిక అన్నీ కలిపి ఈ వంటకానికి మాటల్లో చెప్పలేని రుచిని అందిస్తాయి.

వాంగీ బాత్..

కావల్సిన పదార్థాలు

వంకాయలు 4–5, కొత్తిమీర 2 కట్టలు, చింతపండు రసం 1 చెంచా, ధనియాలు 1 టీస్పూన్, నూనె వేయించటానికి తగినంత, ఎండు మిర్చి 5–6,
కొబ్బరి పొడి (తురిమినది) 1/2,
బియ్యం 1 కప్పు, ఆవాలు 1చెంచా,
మినపప్పు1 చెంచా, సెనగపప్పు 1 చెంచా
మసాలాదినుసులు(ఏలకులు, దాల్చినచెక్క, లవంగాలు)
1 చెంచా బెల్లం, 1చెంచా ఉప్పు
రుచికి నువ్వులు, 1చెంచా మెంతులు
1 చెంచా జీలకర్ర 1 చెంచా కరివేపాకు పసుపుపొడి 1 చెంచా.

తయారీ విధానం

బాగా కడిగిన బియ్యం ఒక కుక్కర్‌లో పోసి3 విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. అన్నాన్ని ఒక పక్కన పెట్టుకోండి. వంకాయలు తీసుకుని సన్నగా ముక్కలు తరగి ఒక బౌల్‌లో ఉప్పువేసిన నీళ్లలో వేయండి. ఒక పెనం తీసుకోని నూనె పోసి మినప్పప్పు,జీలకర్ర, సెనగపప్పు, నువ్వులు, మెంతులు, లవంగాలు, ధనియాలను వేయించాలి. వీటితో పాటు ఎండుమిర్చి, తురిమిన కొబ్బరి వేసి మళ్ళీ కలపండి. కొబ్బరి, ఇతర దినుసుల వాసన తెలిసేదాకా పొడిగా అన్నిటినీ వేయించండి. 3, 4 నిమిషాలపాటు చల్లారనివ్వాలి. అన్ని దినుసులను మిక్సీలో వేయాలి. పొడి అయ్యే వరకూ మిక్సీ పట్టాలి. వెడల్పాటి గిన్నె తీసుకొని నూనె, ఆవాలు, మినపప్పు, సెనగపప్పు, కరివేపాకు, పసుపు, వంకాయలు వేసి నిమిషంపాటు కలపండి. చింత పండు రసం,బెల్లం,ఉప్పు వేసి బాగా కలపి ఉడకనివ్వాలి. తర్వాత అందులోకి అన్నం వేసి బాగా కలపి కొత్తిమీరతో అలంకరించి బౌల్ లోకి తీసుకోండి. మీకు నచ్చిన పచ్చడి లేదా పెరుగుతో వడ్డించండి.

కడుపు 'కోత' తప్పదంటే..!

డజన్ల కొద్దీ పిల్లలను కన్న అమ్మమ్మల కాలంలో సిజేరియన్ సర్జరీలు లేవు. అప్పట్లో సుఖప్రసవాలు ఎలా సాధ్యపడేవి? ...

మారుతున్న జీవన శైలుల కారణంగా, గాడితప్పుతున్న శారీరక అనారోగ్యాలే కారణమంటున్నారు వైద్యులు.



ఏ సందర్భాలలో సిజేరియన్ చేస్తారు ?

గర్భిణిలకు, డాక్టర్లకు ఇద్దరికీ సిజేరియన్ కంటే సుఖప్రసవమే సులువు. అయితే కొన్ని అత్యవసర సందర్భాలలో తల్లీ బిడ్డల క్షేమం కోసం సిజేరియన్ ఒక్కటే ప్రత్యామ్నయం కావచ్చు.

అ సందర్భాలు..

- గర్భంలో బిడ్డ ఎదురు కాళ్లతో ఉన్నప్పుడు,
- తొమ్మిది నెలలు నిండినా బిడ్డ తలక్రిందులవకుండా కటిద్వారం అడ్డంగా ఉండిపోయినప్పుడు,
- మొదటి కాన్పు సాధారణమై, రెండోసారి బిడ్డ అడ్డం తిరిగినప్పుడు,
- ప్రసవం జరిగే వీలు లేకుండా మాయ అడ్డుపడ్డపుడు,
- అంతకు ముందు జరిగిన సిజేరియన్ వలన మాయ అతుక్కుపోయి ఉన్నా...
- బిడ్డకు రక్తప్రసరణ తగ్గిపోయినా,
- కవలపిల్లలలో మొదటి బిడ్డ ఎదురు కాళ్లతో ఉన్నా.... మొదటి కాన్పు సిజేరియన్ అయి ఉండి రెండో సారి నొప్పులు రాక పోయినా,

గర్భద్వారం తగినంతం ఓపెన్ అవకపోయినా, కొంతవరకు తెరచుకొని మధ్యలో ఆగిపోయినా...

- బిడ్డ మలవిసర్జన చేసి అది బిడ్డ ఊపిరి తిత్తులలోకి చేరే ప్రమాదం ఉన్నా లేక ప్రసవ సమయంలో బిడ్డ గుండె కొట్టుకొనే వేగం తగ్గిపోయినా...
- ఇద్దరికంటే ఎక్కువ కవలలు గర్భంలో ఉన్నప్పుడు..



సిజేరియన్ తర్వాత రక్తస్రావం ఏ మేర...

సాధారణ ప్రసవం, సిజేరియన్ ఏది జరిగినా గర్భాశయం సాధారణ సైజుకి చేరుకోవటానికి ఆరు వారాలు పడుతుంది. ఈ ఆరు వారాలు రక్తస్రావం కనిపిస్తుంది. శరీర తీరును బట్టి కొందరిలో రక్తస్రావం అంతకంటే ముందే ఆగిపోతే, ఇంకొందరిలో ఆరువారాలపాటు కనిపించవచ్చు. అయితే నార్మల్, సిజేరియన్ ఏ ప్రసవమైన తర్వాతి రెండు రోజులు బ్లీడింగ్ కొంత ఎక్కువగా ఉంటుంది. ఈ బ్లీడింగ్ తీవ్రత కొంత ఎక్కవ అని చెప్పొచ్చు. ఈ బ్లీడింగ్ తీవ్రత కొంత ఎక్కువగా ఉండి ప్రతి మూడు గంటలకొకసారి ప్యాడ్ మార్చాల్సి రావచ్చు. ఇది సహజం. ఇలా కాకుండా పంపు తిప్పినట్టు రక్తం పోతున్నా, అరగంట వ్యవధిలోనే ప్యాడ్ మార్చాల్సి వచ్చినా, పెద్ద పెద్ద రక్తపు గడ్డలు కనిపించినా అసాధారణంగా భావించి వెంటనే వైద్యులను కలవాలి.

ప్రమాదకర లక్షణాలు...

సిజేరియన్ తరువాత ఇంటికి చేరుకున్న తరువాత ఈ లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యలను కలవాలి.

- తీవ్రమైన జ్వరం...
- వాసనతో కూడిని డిశ్చార్జ్.....
- లావుపాటి రక్తపు గడ్డలతో కూడిన రక్తస్రావం...
- పొత్తికడుపులో తట్టుకోలేనంత నొప్పి...
- విపరీతమైన రక్తస్రావం.....
- కోతపెట్టిన ప్రదేశంలో ఇన్‌ఫెక్షన్

...ఎడం అవసరం

నార్మల్ లేదా సిజేరియన్ ఎలాంటి ప్రసవమైనా మొదటి బిడ్డకు, రెండో బిడ్డకు కనీసం రెండు నుంచి మూడేళ్ల ఎడం పాటించాలి. సర్జరీ నుండి శరీరం పూర్తిగా కోలుకొని తిరిగి రెండో గర్భానికి సిద్ధ పడటానికి సమయమివ్వాలి. అలోగా పిల్లలు కూడా పెద్దవుతారు. గర్భం దాల్చినా శ్రమ అనిపించదు. ఇక సర్జరీ తర్వాత ఆరు వారాల వరకూ రక్తస్రావమవుతూ ఉంటుంది. కాబట్టి ఇన్ ఫెక్షన్లు సోకే అవకాశాలు ఎక్కువ. కాబట్టి ఆరు వారాలు లేదా రక్తస్రావం ఆగే వరకు భార్యాభర్తలు ఎడం పాటించాలి.

సిజేరియన్ తరువాత..

సిజేరియన్ తరువాత నిండు ఆరోగ్యం సమకూరాలంటే మంచి ఆహారం...శారీరక వ్యాయామం...శుభ్రత... ఈ మూడు అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

ఆహారంలో ఎలాంటి నియమాలు పాటించవలసిన అవసరం లేదు. బయట వండినవి తప్ప అన్నీ తినవచ్చు. ప్రొటీన్లు, పీచు, ఐరన్ ఉండే బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి.

రోజుకు అరలీటరు పాలు తప్పనిసరిగా తాగాలి.

తాజాపళ్లు, కూరగాయలు తీసుకోవాలి. నూనె, మసాలలు తక్కువ ఉన్న ఆహారం తీసుకోవాలి. బాలింతకు పాలు పడటం కోసం ఆకుకూరలు, మిల్క్ బ్రెడ్, గుడ్లు, మాంసం తినవచ్చు. మెంతికూర, ఓట్స్, వెల్లుల్లి, బాదం తీసుకుంటే పాలు బాగా పడతాయి.

మాంసకృత్తులు అత్యధికంగా లభించే మాంసం, పప్పులు తినటం వల్ల సర్జరీ గాయం త్వరగా మానుతుంది.

కొన్ని నియమాలు..

సర్జరీ కుట్లు ఇన్ ఫెక్షన్ కు గురికాకుండా ఉండాలంటే శుభ్రత పాటించాలి. కానీ కొందరు కదిలితే కుట్లు ఊడిపోతాయని నీళ్లల్లో నానితే చీము పడతాయని భయంతో వారం, పదిరోజులు స్నానం చేయకుండా ఉంటారు. ఇంకొందరు ఆకు పసర్లు, పెసర పిండితో రుద్దటం లాంటివి చేస్తారు. ఈ అలవాట్లు ప్రమాదకరం. ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ అయినప్పటి నుండి ప్రతిరోజూ స్నానం చేయాలి. కుట్లు ఉన్న చోట సున్నితంగా శుభ్రం చేయాలి. గాయం పొడిగా, శుభ్రంగా ఉంచుకోవాలి. వైద్యులు సూచించిన పౌడర్ వాడాలి. దురద ఉంటే గొళ్లతో బలంగా గీకకూడదు.

సర్జరీ తరువాత ఏమేం చేయాలి ?

సర్జరీ జరిగిన మరుసటి రోజునుండి లేచి నడవవచ్చు. కానీ ఎక్కువమంది పెద్ద ఆపరేషన్ అయింది కాబట్టి విశ్రాంతి తీసుకోవాలనే అపోహతో మంచానికి పరిమితమైపోతారు. కానీ సర్జరీ తరువాత నడకలాంటి శారీరక వ్యాయామం వలన త్వరగా కోలుకుంటారు.

డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్న రోజు నుండి రోజు మొత్తంలో వీలున్నప్పుడల్లా నడుస్తుండాలి. 15 రోజుల నుండి 10 నిమిషములనుండి 15 ని. వరకు నడక మంచిది.

ట్రెడ్ మిల్ మీద నడవాలంటే ఒకటిన్నర నెలలు ఆగాలి. ఆరు వారాల నుండి ఔట్ డోర్ గేమ్స్, జిమ్ లో వ్యాయామాలు చేయవచ్చు. శరీరం సహకరిస్తే వీలున్నంతవరకు చిన్న చిన్న పనులు సొంతంగా చేసుకోవాలి. నెల తరువాత పొట్టమీద ఒత్తిడి పడే పనులు, బరువులు ఎత్తటం తప్ప ఇంటి పనులన్నీ చేసుకోవచ్చు. ఏరోబిక్స్, వెయిట్స్, పరుగులాంటి వ్యాయామాలు 3 నెలల తరువాతే మొదలు పెట్టాలి.

హెల్త్

నలుగురిలో మాట్లాడలేకపోతున్నారా..?



శరీరంలో చోటు చేసుకునే సమస్యల్లో నోటి దుర్వాసన కూడా ఒకటి. ఈ ప్రాబ్లమ్ అందరిలో కాకపోయినా కొందరిని కుంగదీస్తుంది. ఎందుకంటే నలుగురిలో మాట్లాడాల్సి వచ్చినప్పుడు మాట్లాడితే ఒక బాధ, మాట్లాడకుండ ఉన్నా ఇబ్బందే. ఈ సమస్యతో బాధపడే వారు కొన్ని జాగ్రత్తలను పాటిస్తే, అందరిలో హాయిగా మాట్లాడొచ్చు. మరి అందుకు తీసుకోవల్సిన జాగ్రత్తలేంటో చూద్దాం...

రాత్రి తిన్న ఆహారం పళ్లమధ్య ఇరుక్కుపోయి మీకూ చూసేందుకు కూడా ఇబ్బందికరంగా ఉంటుంది. అది చెడుశ్వాసకు కారణం కావచ్చు. చెడుశ్వాస లేదా హాలిటోసిస్ అనేది మీ నోటి నుంచి వచ్చే దుర్వాసనగా చెప్పవచ్చు. ఇది అత్యవసర వైద్య పరిస్థితిగా కనిపించకపోయినా, ప్రపంచంలోని 25 శాతం మంది ప్రజలు ఈ సమస్య కారణంగా బాధపడేవారే. చెడుశ్వాసకు గల ముఖ్య కారణాలకు చాలా రకాల అంశాలు దోహదం చేస్తాయి.

నోటి దుర్వాసర నివారణకు...

బ్రష్ చేయడం

భోజనం చేసిన ప్రతిసారి, కనీసం రోజులో రెండు సార్లు పళ్ళను శుభ్రపరుచుకోడానికి ప్రయత్నించండి. అలా అని మీ పళ్ళు గట్టిగా బ్రష్ చేయకూడదు. లేదంటే మీ దంతాలు, చిగుళ్ల దెబ్బతింటాయి.

టూత్ బ్రష్‌ను మారుస్తుండాలి

మీరు వాడే టూత్ బ్రష్‌ను 2, 3 నెలలకు ఒకసారి మార్చుకోవాలి. టూత్ బ్రష్‌ను బొద్దింకలు, బల్లులు లాంటి వాటికి దూరంగా శుభ్రమైన ప్రదేశంలో జాగ్రత్త చేయాలి. అందరి బ్రష్షులతోపాటు కాకుండా విడిగా ఉంచాలి.

మౌత్ వాష్‌ని వాడండి.

చెడుశ్వాసకు కారణమైన బ్యాక్టీరియాను తొలగించటం ద్వారా మౌత్ వాష్ పళ్లకు అదనపు రక్షణను ఇస్తుంది.

నాలుకను శుభ్రత

నాలుకపై కనిపించే తెల్లటి పాచిని శుభ్రం చేయకపోతే అందుకు ఫలితంగా, దుర్వాసనతో కూడిన బ్యాక్టీరియాకు అవకాశం ఇచ్చినట్లే, కాబట్టి నాలుక శుభ్రత ముఖ్యం.

ఉల్లిపాయ, వెల్లుల్లి మానేయాలి...

ఉల్లిపాయ, వెల్లుల్లి వంటి ఆహారాలను తీసుకోవడం మానేయాలి.ఎందుకంటే, అవి మీకు పుల్లటి రుచిగల శ్వాసను అందిస్తాయి. కాబట్టి ఉల్లి, వెల్లుల్లితో చేసిన ఆహారాన్ని తరచుగా తినడం మానేసి రెండుమూడు రోజులకు ఒకసారి తీసుకునేలా చూసుకోండి.

ధూమపానం చేసేవారైతే...

ధూమపానం చేసేవారైతే, అలవాటును మానుకోవాలి. ధూమపానం క్యాన్సర్‌కు మాత్రమే కారణం కాకుండా, దంతాలను, చిగుళ్ళను నష్టపరిచి, చెడుశ్వాసకు దారితీస్తుంది.

లవంగం లేదా సోంపు

ఎప్పుడూ కొన్ని లవంగాలు లేదా సోంపుగింజలను తింటుండాలి. వాటిలో ఉండే క్రిమినాశక లక్షణాలు చెడు వాసనకు కారణమైన బాక్టీరియాతో పోరాడటానికి సహాయపడతాయి.



100 థియేటర్లలో 100 విగ్రహాలు

విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు నందమూరి తారకరామారావు జీవితం ఆధారంగా తెరకెక్కిన ఎన్టీఆర్ కథానాయకుడు జనవరి 9న విడుదలవుతోంది. బాలకృష్ణ టైటిల్ పాత్రలో నటించిన ఈ చిత్రానికి క్రిష్ దర్శకత్వ ం వహించారు. ఈ సినిమా ప్రచారం వేడెక్కిస్తున్న సంగతి తెలిసిందే. రిలీజ్ వేళ సరికొత్తగా ప్రచారం చేస్తోంది యూనిట్. తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకంగా ఎంపిక చేసిన 100 థియేటర్లలో ఎన్టీఆర్ 100 విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. తొలి విగ్రహాన్ని నందమూరి బాలకృష్ణ, విద్యాబాలన్, నందమూరి కళ్యాణ్ రామ్ తిరుపతి పీజేఆర్ థియేటర్ లో మంగళవారం నాడు లాంచ్ చేస్తారు. జనవరి 7, 8 తేదీల్లో నందమూరి బాలకృష్ణ, విద్యాబాలన్, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు క్రిష్ జాగర్లమూడి హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో నిమ్మకూరు, బెంగళూరు, తిరుపతి వెళ్లి కథానాయకుడు ప్రమోషన్ లో పాల్గొననున్నారు. ఆ తర్వాత విగ్రహం విడుదల చేయనున్నారు బాలయ్య, విద్యాబాలన్. ఈ కార్యక్రమం తర్వాత మీడియాతో మాట్లాడనున్నారు ఎన్టీఆర్ చిత్ర యూనిట్. ఎన్టీఆర్ బయోపిక్ లో రెండో భాగం మహానాయకుడు ఫిబ్రవరి లో రిలీజ్ కానుంది.

ప్రభాస్ మల్టీప్లెక్స్ వరల్డ్ 3 ర్యాంక్

మహేష్ ఏఎంబీ మాల్ గురించి నిన్నమొన్నటివరకూ మాట్లాడుకున్నాం. తాజాగా ప్రభాస్ మల్టీప్లెక్స్ గురించి ఆసక్తికర చర్చ సాగుతోంది. నెల్లూర్ సూళ్లూరుపేటలోని ప్రభాస్ మాల్ గురించి మాటామంతీ సాగుతోంది. ఏఎంబీ మాల్ అంటే దానిని కొట్టే మాల్ నే నిర్మిస్తున్నాడు ప్రభాస్. తన దోస్తీలైన యూవిక్రియేషన్స్ అధినాయకులతో కలిసి ప్రభాస్ భారీ మల్టీప్లెక్స్ నిర్మించడమే గాక ప్రపంచంలోనే అతిపెద్ద మూడో స్క్రీన్ని, ఆసియాలోనే అతిపెద్ద రెండో స్క్రీన్ ని నిర్మిస్తున్నాడు. దాదాపు 40కోట్ల రూపాయల వ్యయంతో రూపొందిస్తున్న ఈ మల్టీప్లెక్స్ ఏడున్నర ఎకరాల్లో నిర్మితమవుతోంది. సూళ్లూరుపేట టౌన్ కి 4 కిలోమీటర్ల దూరంలో చెన్నయ్– కోల్కతా జాతీయ రహదారి పక్కన పిండిపాళెం వద్ద దీన్ని సిద్ధం చేస్తున్నారు. 670 సీట్ల సామర్థ్యం, 3డీ సౌండ్ సిస్టమ్ సహా డాల్బీ అట్మోస్ తో అదిరిపోతుందిట. దేశంలోనే తొలిసారిగా 106 అడుగుల వెడల్పుతో తెర ఏర్పాటు చేయడం మరో సెన్సేషన్. 106 అడుగుల వెడల్పు గల భారీ తెరలు ప్రపంచంలో మరో రెండు మాత్రమే ఉన్నాయి. ఆ కోవలో ఇది మూడోది.. ఆసియాలో రెండోదని థియేటర్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ మల్టీప్లెక్స్లో ఒక్కోటి 170 సీట్ల సామర్థ్యంతో మరో రెండు తెరలు ఉంటాయి. దీన్ని బట్టి థియేటర్ బిజినెస్ పై సెలబ్రిటీ గురి ఏ రేంజులో ఉందో అర్థమవుతోంది.





మహిళా క్రికెటర్ !

అర్జున్ రెడ్డి చిత్రంతో స్టార్ హీరోగా పేరు తెచ్చుకున్నారు విజయ్దేవరకొండ. యంగ్ హీరోయిన్ కన్నడ బ్యూటీ రష్మిక మందన వెండితెరపై గీత గోవిందం సినిమా ద్వారా ఓ వెలుగు వెలిగారు. ఈ సినిమా ద్వారా రష్మిక, విజయ్ జంటకు మంచి గుర్తింపు వచ్చింది. వారిద్దరి మధ్య మంచి కెమిస్ట్రీ కుదిరింది. మళ్లీ ఈ జంట డియర్ కామ్రేడ్ సినిమాలో జంటగా కనిపిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇందులో విజయ్ సరసన నటించే రష్మిక క్రికెటర్గా కనిపించబోతుందట. ఈ పాత్ర కోసం రష్మిక పెద్ద త్యాగమే చేసిందట. ఈ పాత్ర కోసం జుట్టు కత్తిరించుకునేందుకు కూడా ఆమె రెడీ అయ్యిందట. విజయ్ దేవరకొండ పాత్ర పవర్ ఫుల్గా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మైత్రి మూవీస్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ ఏడాది ద్వితీయార్థంలో 'డియర్ కామ్రేడ్' చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.


సూపర్స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'పేట'. సిమ్రాన్, త్రిష కథానాయికలు. ట్రైలర్ సహా ప్రీవిజువల్స్ ఆకట్టుకున్నాయి. ఈ చిత్రాన్ని నవాబ్, సర్కార్ చిత్రాలను తెలుగు ప్రేక్షకులకు అందించిన అశోక్ వల్లభనేని తెలుగువారికి అందిస్తున్నారు. రజనీ అభిమానిగా ఈ చిత్రాన్ని ఆయన రిలీజ్ చేస్తున్నారు. జనవరి 10 న సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. చిత్ర బృందం తో పాటు హీరో శ్రీకాంత్, దర్శకుడు వైవీఎస్ చౌదరి, ప్రసన్నకుమార్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు..

రజినీ స్ఫూర్తితోనే ఈ స్థాయికొచ్చాను!

-'పేట' నిర్మాత అశోక్ వల్లభనేని

హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ–"నవాబ్, సర్కార్ లాంటి సూపర్ హిట్ సినిమాలను రిలీజ్ చేసిన వల్లభనేని పేటతో పెద్ద హిట్ సాధించాలి. ఆర్టిస్టులందరికి రజినీ స్ఫూర్తి. సంక్రాంతికి వచ్చే అన్ని సినిమాలతో పాటు ఈ సినిమా కూడా బాగా ఆడాలి" అన్నారు. గీత రచయిత రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ–"రజినీకి పాటలు రాసే అవకాశం వచ్చినందుకు చాల ఆనందంగా ఫీల్ అవుతున్నాను. అయన పాటల్లో మంచి సందేశం ఉంటుంది. ఈ సినిమాలో కూడా నేను మంచి పాట రాసినందుకు గొప్పగా ఫీల్ అవుతున్నాను. ఎంతో ఉత్సాహంతో పాట రాశాను. మంచి సంతృప్తి కలిగించింది. తెరపై రజినీకాంత్ చాల బాగా కనిపించరు. నిర్మాతలకు మంచి లాభాలు రావాలని కోరుతున్నాను" అన్నారు..

దర్శకుడు వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ–"సినిమా పట్ల ఎంతో ఫ్యాషన్ , ఆసక్తి కలిగిన నిర్మాత వల్లభనేని వంశీ.. టాలీవుడ్ లో దియేటర్ల సమస్య ఉన్నా కూడా అలాంటి టైం లో స్టార్ కాస్ట్ ని , సినిమా పట్ల ఇష్టంతో సినిమాలు రిలీజ్ చేస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. అయన చేసిన పెద్ద సాహసం ఇది. ఇక ఈ సినిమా తో పూర్వపు రజినీకాంత్ని చూస్తాం. కార్తీక్ సుబ్బరాజు ఆయన్ని చాల బాగా ప్రజెంట్ చేశారు. దమ్మున్న నటీనటులను ఎంచుకున్నారు. అందరు కథను నమ్మి సినిమా చేశారు. అందరు ఆదరించాలి" అని అన్నారు. నిర్మాత వల్లభనేని అశోక్ మాట్లాడుతూ–"రజినీ స్ఫూర్తితోనే అయన సినిమా చేసే స్థాయికి చేరుకున్నాను. సినిమా థియేటర్ ల విషయంలో చాల మంది నన్ను ఇబ్బంది పెడుతున్నారు. వాళ్లకు బ్లాక్బస్టర్తో బుద్ధి చెప్పాలనుకుంటున్నాను. దయ చేసి ఈ సమస్య ను పరిష్కరించాలని కెసిఆర్ ని కోరుకుంటున్నాను" అన్నారు. సంగీతదర్శకుడు అనిరుధ్ రవిచందర్ మాట్లాడుతూ–"ఈ సినిమా ని తెలుగులో రిలీజ్ చేస్తున్న ప్రొడ్యూసర్ అశోక్ గారికి కంగ్రాట్స్.. ఈ సినిమా రజిని ఫాన్స్ కోసమే.. అయన ఇరగదీశారు.. ఇంత మంచి అవకాశం ఇచ్చిన కార్తీక్ గారికి చాల థాంక్స్.. ఈ సినిమా కి పనిచేసిన అందరు లిరిసిస్ట్స్ చాల బాగా పనిచేశారు. నన్ను ఇంత బాగా ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు థాంక్స్.. ఈ సినిమా అందరికి నచ్చుతుంది.. థియేటర్స్ లో అందరు బాగా ఎంజాయ్ చేస్తారు" అన్నారు. డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజ్ మాట్లడుతూ–"నామొదటి సినిమా పిజ్జా కోసం హైదరాబాద్ వచ్చాను.. మళ్ళీ రజినీకాంత్ గారి సినిమా కు రావడం చాల ఆనందంగా ఉంది.. ఈ సినిమాకి కష్టపడి పనిచేసిన అందరికి ధన్యవాదాలు.. ఈ సినిమాను రిలీజ్ చేస్తున్న అశోక్ గారికి కంగ్రాట్స్.. సినిమా చాల బాగుంటుంది. ఫ్యామిలీ ఓరియెంటెడ్ , యాక్షన్ ఫిలిం ఇది.. మీ అందరు ఈ సినిమా ను చాల బాగా ఎంజాయ్ చేస్తారు. మంచి సినిమాని ప్రేక్షకులు ఎప్పుడు ఆదరిస్తారనే నమ్మకం ఉంది.. అందరు ఈ సినిమాని చూసి ఎంజాయ్ చేయండి" అన్నారు.



పీఎం నరేంద్రమోదీ బయోపిక్

ప్రధాని నరేంద్ర మోదీ బయోపిక్ గురించి గత కొంతకాలంగా ఆసక్తికర చర్చ సాగుతోంది. తాజాగా ఈ సినిమాకి సంబంధించిన ఫస్ట్ లుక్ లాంచ్ చేశారు. తొలి పోస్టర్ ని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ లాంచ్ చేశారు. మొత్తం 23 భాషల్లో ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ని రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ వివరాల్ని ప్రఖ్యాత క్రిటిక్ తరణ్ ఆదర్శ్ వెల్లడించారు. "వివేక్ ఆనంద్ ఒబేరాయ్ (వివేక్ ఒబేరాయ్) నరేంద్ర మోదీ బయోపిక్ లో నటిస్తున్నారు. టైటిల్ పీఎం నరేంద్రమోదీ. 23 భాషల్లో ఈ చిత్రం వస్తుంది. అన్ని భాషల్లో పోస్టర్లను సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ లాంచ్ చేశారు. ఒమంగ్ కుమార్ దర్శకత్వ ం వహించే ఈ చిత్రాన్ని సురేష్ ఒబేరాయ్ సందీప్ సింగ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు" అని తెలిపారు. ఒబెరాయ్ లుక్ కి అభిమానుల నుంచి అద్భుత స్పందన వస్తోంది. నరేంద్ర మోదీ సిగ్నేచర్ స్టైల్ కి ఒబేరాయ్ పెర్ఫెక్ట్ గా సూటయ్యాడంటూ ఫ్యాన్స్ కితాబిస్తున్నారు. పరిశ్రమ వర్గాల నుంచి పాజిటివ్ స్ప ందన వచ్చింది. ఒబేరాయ్ ఇదివరకూ 'రక్త చరిత్ర' చిత్రంలో ఫ్యాక్షనిస్ట్, తేదేపా నాయకుడు పరిటాల రవి పాత్రలో నటించిన సంగతి తెలిసిందే. మరోసారి నరేంద్ర మోదీ బయోపిక్ తో వాడి వేడిగా చర్చల్లోకొచ్చాడు. చరణ్ 'వినయ విధేయ రామ' చిత్రంలోనూ ఒబేరాయ్ విలన్ గా నటించిన సంగతి తెలిసిందే.

దూసుకొస్తున్న నభ!

టాలీవుడ్ లో ప్రవేశిస్తూనే తనవైన అల్లరి వేషాలతో అలరించింది నభా నటేష్. సుధీర్ బాబు సరసన నన్ను దోచుకుందువటే చిత్రంలో నటించింది. ఆ సినిమాలో అల్లరి అమ్మాయిగా నటించి యువతరం మనసు దోచింది. నటనకు స్కోప్ ఉన్న పాత్రలో మైమరిపించింది. జెనీలియా తర్వాత మళ్లీ ఆ తరహాలో అల్లరి హాసిని ముద్ర ఈ అమ్మడికి వేశారు ప్రేక్షకులు. ప్రస్తుతం నభా నటేష్ మాస్ మహారాజా రవితేజ సరసన ఓ క్రేజీ చిత్రంలో అవకాశం అందుకుంది. రవిబాబు అదుగో చిత్రంలోనూ నభా నటేష్ నటించిన సంగతి తెలిసిందే. 2015లో 'వజ్రకాయ' అనే కన్నడ చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసిన నభా నటేష్ ఆ తర్వాత లీ, 'సాహెబా' అనే కన్నడ చిత్రాల్లో నటించి ఆకట్టుకుంది. ప్రస్తుతం టాలీవుడ్ లో పెద్ద స్థాయికి ఎదిగేందుకు ప్రణాళికలు రచిస్తోంది. నభా నటేష్ తాజా ఫోటో షూట్ యువతరంలో జోరుగా వైరల్ అవుతోంది.



బ్రాండ్ ప్రచారంలో సీక్వెల్స్

దిశా పటానీ లోదుస్తుల ప్రచారం గురించి తెలిసిందే. ప్రఖ్యాత కెల్విన్ క్లెయిన్ (సీకే) బ్రాండ్ కి ఈ అమ్మడు బ్రాండ్ అంబాసిడర్ గా కుదురుకున్నది మొదలు, ఒకటే ఊదరగొట్టుడు ప్రచారం చేస్తోంది. దీపాల అమావాస్య రోజు లక్ష్మీ దేవి మీ ఇంటికి నడిచొచ్చును! అంటూ ఒక దివ్వెను చేతపట్టి సీకే లోదుస్తుల్లో కనిపించి పెద్ద షాకిచ్చింది. వివాదంతో ప్రచారం పెద్ద రేంజులోనే వర్కవుటైంది. సీకే బ్రాండ్ లో దిశా అందచందాలు యూత్ కి మత్తెక్కించాయి. ఆ క్రమంలోనే ఈ ఫార్ములా వర్కవుటవ్వడంతో ఇక రెగ్యులర్ గా దిశా పటానీతో సీకే ఉత్పత్తుల ప్రమోషన్ ని హోరెత్తిస్తోంది ఆ బ్రాండ్. ఈ ఫార్ములా వర్కవుటవ్వడంతో పలువురు కథానాయికలు ఇదే తరహాలో లోదుస్తులకు ప్రచారం చేస్తూ నాలుగు చేతులా ఆర్జిస్తున్నారు. చూపరులకు వీనుల విందు.. బ్రాండ్ ప్రమోటర్ కి కాసుల విందు! అన్నచందంగా ఈ ప్రచారం హోరెత్తిపోతోంది. ఇక దిశా పటానీ కెరీర్ ఇప్పటికే ఖాళీ. బాలీవుడ్ లో 'భరత్' అనే చిత్రంలో నటిస్తోంది. మరోసారి టాలీవుడ్ లో నటించాలనుందని కోరికను వెలిబుచ్చింది. సౌత్ లోనూ కొత్త ఏడాది లో ప్రయత్నాలు ప్రారంభించిందిట.





'నిన్ను తలచి' మైమరచి..

ఎస్.ఎల్.ఎం ప్రొడక్షన్స్, నేదురుమల్లి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం నిన్ను తలచి. అనిల్ తోట దర్శకత్వంలో నేదురుమల్లి, అజిత్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రంలో వంశీ, స్టెఫీ పాటెల్ హీరో, హీరోయిన్లు గా నటిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ లాబ్ లో ఫస్ట్ లుక్ లాంచ్ చేశారు. విలేకరుల సమావేశంలో... నిర్మాత అజిత్ మాట్లాడుతూ... కొత్త బ్యానర్ తో పాటు కొత్త హీరో హీరోయిన్లతో కలిసి చేస్తున్న సినిమా. ఈ సినిమాతో అందరికి మంచి పేరు రావాలని కోరుకుంటున్నా అని అన్నారు. దర్శకుడు అనిల్ మాట్లాడుతూ ఎంతో కష్టపడి సినిమా చేసాం. ఈ సినిమాకు అవకాశం కల్పించిన నిర్మాతలకు కృతజ్ఞతలు. అలాగే ఈ చిత్రం కూడా బాగా వచ్చింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. ఫిబ్రవరి లో సినిమా ని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం అని అన్నారు. హీరో వంశీ మాట్లాడుతూ... నాకి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు. ఈ సినిమాను మీరందరు తప్పకుండా ఆదరిస్తారని కోరుకుంటున్నాను. అందరికి ఆల్ ది బెస్ట్. అని అన్నారు.

విజయ క్రాంతి
మంగళవారం 08 జనవరి 2019
హైదరాబాద్

పూల మొక్కలను ఇలా కాపాడుదాం..



కావలసినవి:

ఒక ఉల్లిపాయ, వెల్లుల్లి రెబ్బలు, రెండు కప్పుల నీరు, స్ప్రే బాటిల్, పాత నైలాన్ వస్త్రం.

తయారీ విధానం:

ఉల్లిపాయ, వెల్లుల్లి దంచి ముద్దలా చేసి రెండు కప్పుల నీళ్లల్లో కలపాలి. ఈ మిశ్రమాన్ని మరొక గిన్నెలోకి నైలాన్ వస్త్రంతో వడపోయాలి. ఈ ద్రావణాన్ని స్ప్రే బాటిల్లో పోసుకొని, చెట్లపై ఉండే చీడ పురుగుల మీద చల్లాలి. ఈ స్ప్రేను ఆకులకు పైనా, కింద స్ప్రే చేయాలి. చల్లే ముందు బాటిల్ని గట్టిగా ఊపాలి.



సాధారణంగా అబ్బాయిలు తమ మనసులోని భావాలను ప్రియురాలికి వ్యక్తపరచడానికి రకరకాల పద్ధతులను అనుసరిస్తారు. ప్రియురాలు ఎక్కడికి వెళితే అక్కడికి వెళ్లడం, ప్రతి రోజూ ఆమెను వెంబడించడం, ప్రేమ లేఖలు రాయడం, తనకు నచ్చిన గిఫ్ట్‌లు, గులాబీలు ఇవ్వడం, వాలంటైన్ గ్రీటింగులు ఇవ్వడం ఇలా రకరకాల మార్గాలను అనుసరిస్తుంటారు. కానీ నేరుగా చెప్పడానికి కొంత భయానికి లోనవుతుంటారు.

ప్రేమించే ప్రేమకోసం...

కొంతమంది అబ్బాయిలు తమకు నచ్చిన అమ్మాయిలకు తమలోని ప్రేమానుభావాలను వ్యక్తపరచడానికి ఎవ్వరూ అనుసరించని ప్రత్యేక పద్ధతులను అనుసరించడానికి ప్రయత్నిస్తారు. మరికొంతమంది సినిమాలలో వుండే హీరోలులాగా డైలాగులు చెప్పడం, లేదా దుస్తులను ధరించి అమ్మాయిని ప్రపోజ్ చేయడం చేస్తుంటారు. మరికొంతమంది ఎవ్వరూ చేయని పిచ్చిపిచ్చి పద్ధతులతో విసుగు తెప్పిస్తుంటారు. కాబట్టి ఎప్పటికి ఇలా చేయకుండా మీకు మీరుగానే వుండేందుకు ప్రయత్నించండి.

మిమ్మల్ని ప్రేమించేలా చేసుకోండి..

సాధారణంగా అబ్బాయిలందరూ తనకు నచ్చిన అమ్మాయిని ప్రపోజ్ ఎలా చేయాలా అన్న ఆలోచనలోనే కాలాన్ని వృధా చేస్తుంటారు. ఇలా చేస్తే ఏ ప్రయోజనం దక్కదు. మీకు నచ్చిన అమ్మాయి మిమ్మల్ని ప్రేమించాలంటే.. మీరు ప్రేమిస్తున్నట్టు ఆ అమ్మాయికి కూడా తెలిసేలా చేయాలి. అప్పుడే ఏదైనా ఒక రిజల్ట్ బయటపడుతుంది. అలా అని నేరుగా వెళ్లి "ఐ లవ్ యూ" అని కూడా చెప్పకూడదు. తను కూడా మీమీద చొరవ చూపించినట్లయితే మీ భావాలను వ్యక్తపరచడానికి ఆస్కారం వుంటుంది.



మనసులోని భావాలను వ్యక్తపరచండి

ముందుగా మీకు నచ్చిన అమ్మాయికి మీ మనసులోని భావాలను వ్యక్తపరిచే ముందు తన మనసులో కూడా ఎవరైన వున్నారా..? లేదా..? అన్న వాటి గురించి తెలుసుకుంటే చాలా మంచిది. అప్పుడు దానికి తగిన కొన్ని పరిష్కార మార్గాలను వెదుక్కోవచ్చు. నచ్చిన అమ్మాయికి నేరుగా వెళ్లి ఐ లవ్ యూ ఎప్పుడూ చెప్పకూడదు. అలా చేస్తే పరిస్థితులు ఒక్కోసారి వికటించి తీవ్ర మనస్థాపానికి గురిచేస్తాయి.

ఇష్టమైన వారికి ఏమేం ఇష్టమో తెలుసుకోవాలి..


మీరు ప్రేమిస్తున్న అమ్మాయి ఏం చేస్తోంది.. ఏం ఇష్టపడుతుంది.. ఎటువంటి వస్తువులు తనకు ఇష్టం అనే అంశాల గురించి ముందు తెలుసుకోవాలి. దానికి తగ్గట్టుగానే అమ్మాయికి సమయానుకూలంగా అటువంటి వస్తువులను తెచ్చిస్తే వారు ఎంతగానో సంతోషపడతారు. మీ మీద ఆమెకు ఒక నమ్మకం కలుగుతుంది కూడా. తను ఏదైనా ఒక సమస్యలో వుండి, బాధపడుతుంటే.. మీరు ఆమెకు తోడుగా వుండాలి. అన్నివిధాలుగా సహాయం చేస్తే మీమీద ఆమెకు గౌరవం ఏర్పడుతుంది. అన్నివిధాలుగా తను కూడా మీకు సహకరిస్తుంది.

ప్రతీ విషయాన్ని చెప్పకోండి

నచ్చే ప్రతి చిన్న విషయాన్ని మీ ప్రియురాలితో పంచుకుంటే తను కూడా సంతోషంగా ఫీల్ అవుతుంది. మీ భావనలకు తగ్గట్టుగానే తనుకూడా మీతో నడుచుకుంటుంది. ప్రియురాలితో ప్రతి ఒక విషయాన్ని స్వేచ్ఛగా చెప్పుకుంటే.. మీలో వున్న భావనలను ఆమె కూడా సులభంగా అర్థం చేసుకుంటుంది.

మీరు మీరుగానే ఉండండి...

ప్రియురాలికోసం అనవసరమైన ఖర్చులు వెచ్చించకుండా, కాలం వృథా చేయకుండా మీకు మీరుగానే వుండండి. అప్పుడే ఆ అమ్మాయి కూడా మీలో వున్న నిజాయితీని మీ వ్యక్తిత్వాన్ని గుర్తిస్తుంది. దాంతో ఆ అమ్మాయి మనసులో మీమీద కూడా ప్రేమానుభవాలు కలిగే అవకాశం వుంది.



మీ మాటలకు సరే అంటే...

మీరంటే ఇష్టమన్నమాట,

మీ ప్రియురాలి మీపట్ల ఆసక్తికరంగా వుంటూ.. మీరు చెప్పినట్లుగా నడుచుకుంటే తను కూడా మిమ్మల్ని ఇష్టపడుతున్నట్లు కిందే వస్తుంది. అయితే తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదు. ఎదుటి వారు తమను ప్రేమిస్తున్నారనే అంశాన్ని అమ్మాయిలు గ్రహిస్తే.. కొద్దిరోజుల తరువాత వారే మీకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. మీతో ఎలా ప్రవర్తించాలోనన్న ఒక అవగాహనకు వారు వచ్చేస్తారు.


ప్రేమని మీరే తెలియజేయండి..

ప్రియురాలు తన మనసులో వున్న భావాలను నేరుగా కాకుండా మీనుంచే చెప్పించడానికి ప్రయత్నిస్తుంది. అటువంటి సమయాల్లో మీరు కూడా ఒక గులాబీ ఇచ్చి ఆమెకు మీ మనసులోని భావాలు వ్యక్తపరిస్తే చాలు.. తను మీ ప్రేమను అంగీకరించడానికి ఎంతో వీలుగా వుంటుంది.

నిజంగా ఏకైక ఉపాధ్యాయురాలు..







ఆచార్య దేవి అమ్మగ మారింది.

కన్న బిడ్డల లాంటి విద్యార్థుల కోసం కొండా కోనల గుండా చెట్లు పుట్టలు ఎక్కి వాగు వంకలు దాటుతున్నది.

అరణ్యం సాక్షిగ ప్రాణాలను పణంగా పెట్టి బుడతలకు బతుకు పాఠాలు నేర్పడానికి దశాబ్దిన్నర కాలం నుంచి పరుగు పెడుతూనే వున్నది ఆ పంతులమ్మ. ఇంతకీ ఇంతటి సాహసం ఎందుకు ఆ టీచరమ్మకు.. వివరాల్లోకి వెళితే...

ఏకోపాధ్యాయ పాఠశాలలు వెనకటంత లేకపోయినా విసిరేసినట్టుగా అక్కడక్కడా ఇంకా మనుగడ సాగిస్తున్నాయి. నిజం చెప్పాలంటే ఉషాకుమారి లాంటి అంకిత భావంతో పనిచేసే ఉపాధ్యాయులు ఉన్నంత కాలం ఈ పాఠశాలలు అగస్త్య వనం లాంటి చిక్కటి అడవుల్లో కూడా చాకు లాంటి విద్యార్థులతో అలరారుతూ ఉంటాయి మరి.



తిరువనంతపురం జిల్లా అంబూరి గ్రామానికి చెందిన ఉషాకుమారి గిరిజన తండాల్లో వున్న చిన్నారులకు చదువు చెప్పడానికి వ్యయ ప్రయాసలకోర్చి పదహారేళ్లుగా ఒక్కరోజు కూడా మానకుండా వస్తూనే వున్నది. ఇంటి నుంచి ఆమె అడవిలో వున్న పాఠశాలకు ఎలా వెళ్తుందో తెలిస్తే ఆశ్చర్య పోతారు. ఉదయం ఏడున్నరకు ఇంటినుంచి స్కూటీ పై బయల్దేరి కుంబిక్కల్ కడవు చేరుకుంటుంది. అక్కడ స్కూటీని పార్క్ చేసి నది దాటడానికి పడవ ప్రయాణం... ఆ తరువాత పడవలో నది దాటుకొని ఆవల తీరంలో వున్న ఎత్తైన కొండను ఎగుడు దిగుళ్ళ దారిలో రెండు కిలో మీటర్లు నడిచిన తరువాత శిఖరాగ్రాన వున్న గిరిజన గ్రామం చేరుతుంది. దారి పొడుగునా చిక్కటి అడవి... పులులు, ఏనుగులు, చిరుతలు నడయాడే ప్రమాదకరమైన ప్రదేశం. చేతిలో ఎటువంటి ఆయుధాలు వుండవు... ఒక్క చేతి కర్ర తప్పితే. అదికూడా దారికి అడ్డంగా ఏదైనా జంతువు తారసపడితే అదిలించడానికి. సగం దూరం వెళ్ళగానే అమ్మకు ఎదురయ్యే పిల్లల్లా బిల బిల మంటూ విద్యార్థులు ఎదురొస్తారట. కున్నట్టుమాల గిరిజన తండాలో వున్న కన్ని పాఠశాలకు పిల్లలు తోడుగా వుండి స్కూల్‌కు తీసుకొని వెళ్తారన్నమాట. కేరళలోని చిక్కటి అడవులలో చోటుచేసుకున్న అతి ఎత్తయిన గిరులలో అగస్త్యార్యాడం ఒకటి అనిచెప్తారు. ఇంటి నుంచి దాదాపు రెండు గంటల ప్రయాణం. ఇన్ని సంవత్సరాల సుదీర్ఘ ఏకోపాధ్యాయ వృత్తిలో ఏనాడూ ఉష కుమారి గైరు హాజరు కాకపోగా ఒక్క నిముషం ఆలస్యంగా కూడా వచ్చింది లేదట. ఉదయం పదింటికి పాఠాలు మొదలు పెడితే సాయంకాలం నాలుగింటికి కానీ బోధన పూర్తి కాదు. లాంగ్వేజెస్, లెక్కలు, పర్యావరణ శాస్త్రం ఇంకా ఇంకా అన్ని పాఠ్యాంశాలూ ఉషాకుమారి ఒక్కతే బోధిస్తుంది. ఎందుకంటె పాఠశాలకు తాను ఒక్కతే ఉపాధ్యాయురాలు కాబట్టి.

ఉష కుమారి టీచర్ మాత్రమే కాదు విద్యార్థులకు కావలసిన అవసరాలన్నీ అమ్మలా చూసుకుంటుంది. మధ్యాహ్న భోజనంలోకి పాలు గుడ్లు తప్పకుండ పిల్లలకు ఇవ్వాల్సిందే. ఇవన్నీ చూసుకోవడానికి ఈమధ్యే ఓ కేర్ టేకర్‌ను కూడా నియమించింది ఉషాకుమారి. ప్రభుత్వం నుంచి జీతాలు కూడా సరిగ్గా అందని సందర్భాలు ఎన్నో అయినా ఏమాత్రం విధులను నిర్లక్ష్యం చేయకుండా విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా తన సొంత డబ్బుతో స్కూల్ కార్యక్రమాలను వెళ్లదీస్తుంది ఈ ఉత్తమ ఉపాధ్యాయురాలు. పాఠశాల పునరుద్ధరించే ప్రయత్నంలో చెట్టు కింద, గోడలపై కూర్చొని పాఠాలు చెప్పడానికి కూడా ఆమె సందేహించలేదంటే ఆమె కార్యదీక్షను మెచ్చుకోకుండా ఉండలేం.

ఉషాకుమారి సేవలకు గానూ కేరళ ప్రభుత్వం సాక్షరతా పురస్కారాన్ని అందించి ఆమెను గౌరవించింది. ఈ సందర్భంగా ఉషాకుమారి స్పందిస్తూ "నేను చదువు నేర్పిన నా విద్యార్థులు భవిష్యత్తులో ఎంతో ఎత్తుకు ఎదగాలన్నదే నా ఆశ" అని ఉద్విగ్న భరితంగా అన్నదట.

నిజంగా ఉషాకుమారి ఉత్తమ ఉపాద్యాయురాలే కాదు నిజ జీవిత కథానాయిక కూడా.!

ఇంటికి కొత్త సొగసులు





కాలాన్ని బట్టి మనం మారుతున్నట్టే.. మన ఇంట్లోనూ మార్పులు రావాలి. అలాగని వేలకు వేలు వెచ్చించి కొత్త ఫర్నిచర్ తీసుకు రావాల్సిన పని లేదు. ఉన్నవి మార్చాల్సిన అవసరమూ లేదు. మార్కెట్లో ఉన్న ట్రెండ్స్ ఫాలో అయిపోతే సరి. ప్రస్తుతం ఇంటీరియర్ దునియాలో రోజుకో కొత్త ట్రెండ్ వచ్చి చేరుతుంది. వాటిలో నచ్చింది ఎంచుకోండి.

ఒకప్పుడు ప్రతి ఇంట్లోనూ మనీ ప్లాంట్ దర్శనమిచ్చేది. ఇప్పుడు మనీప్లాంట్ ఎక్కడో కానీ కనిపించదు. ట్రెండ్ మారింది మరి! ఇంట్లో గ్రీనరీ పెంచుకోవడానికి రకరకాల పద్ధతులు ఉన్నాయి. ఇంటి అందాన్ని పెంచే ఇండోర్ మొక్కలు చాలా ఇళ్లలో కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఇంటి అలంకరణలో వాటర్ ప్లాంట్ భాగస్వామ్యం పెరుగుతోంది. చిన్న చిన్న సీసం జాడీల్లో వాటర్ ప్లాంట్స్ పెట్టి.. సోఫా సెట్ పక్కనో, టీపాయ్ మీదో ఉంచితే హాల్ లుక్కే మారిపోతుంది.




వెలుగులు విరజిమ్మే లైట్లు రకరకాల డిజైన్లలో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం క్లస్టర్ లైట్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. వేలాడే దీపాల్లా కనువిందు చేస్తుంటాయివి. గదిలో ఒక్కో గోడకు ఒక్కో రంగు వేయడం పరిపాటిగా మారింది. గదిలో ఒక గోడకు లోపలి వైపు సిమెంట్ కోటింగ్ వేయకుండా అలాగే ఉంచడం ఇప్పుడు ఫ్యాషన్. గోడకు ఎలాంటి నష్టం జరగకుండా వీటిని నిర్మిస్తారు.. గరుకు గోడలు కొత్త లుక్ ఇస్తున్నాయి. కాబట్టి కంగారు పడాల్సిన అవసరమూ లేదు.



కర్టెన్స్, పిల్లో కవర్స్ వంటి విషయాల్లో బ్రైట్ కలర్స్‌కు ఇప్పుడు డిమాండ్ తగ్గుతోంది. లైట్ కలర్స్ వైపే మార్కెట్ మొగ్గు చూపుతోంది. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని ఇంటిని అందంగా తీర్చిదిద్దుకోండి.

ముంగిట్లో ముగ్గు









కోడిగుడ్లు రిటైల్ ధర (100కు)			
హైదరాబాద్	453	విజయవాడ	453
ముంబయి	502	ఢిల్లీ	493
చెన్నై	455	బెంగళూరు	452



బ్రాయిలర్ చికెన్ ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.			
హైదరాబాద్	87	ఢిల్లీ	90
కరీంనగర్	86	ముంబయి	89
వరంగల్	88	చెన్నై	88



సెన్సెక్స్ +155.06
35,850



నిఫ్టీ +44.45
10,771

రూపాయి
₹69.76 (ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
32,730.00 (హైదరాబాద్‌లో) 24 క్యా..10 గ్రాములకు/(రూ.)లలో



14.1 శాతం పెరిగిన ప్రత్యక్ష పన్నుల వసూళ్లు

- గణాంకాలు వెల్లడించిన కేంద్ర ఆర్థికశాఖ

ఢిల్లీ : ఏప్రిల్–డిసెంబరు 2018 మధ్య ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 14.1 శాతం పెరిగినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీనికి సంబంధించిన తాజా గణాంకాలను సోమవారం విడుదల చేసింది. మొత్తం రూ.8.74 లక్షల కోట్ల మేర ప్రత్యక్ష పన్నులు వసూలు అయినట్లు ఆర్థిక శాఖ పేర్కొంది. ఇక పన్ను రీఫండ్‌లు రూ.1.30 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే ఇవి 17శాతం అధికమని ఆర్థిక శాఖ వెల్లడించింది. ఇక అడ్వాన్స్ ట్యాక్స్ కింద రూ.3.64 లక్షల కోట్లు వసూలయ్యాయి. ఏడాది క్రితం ఇదే సమయంతో పోలిస్తే ఇవి 14.5 శాతం అధికం. రీఫండ్లను జారీ చేసిన అనంతరం నికర వసూళ్లు రూ.7.43 లక్షల కోట్లుగా ఉన్నాయి. బడ్జెట్‌లో నిర్దేశించుకున్న ప్రత్యక్ష పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.11.50 లక్షల కోట్లలో ఇది 64.7 శాతంగా ఉన్నట్లు ఆర్థికశాఖ తెలిపింది. ఏప్రిల్–డిసెంబరులో కార్పొరేట్ ఆదాయ పన్ను 14.8 శాతం, వ్యక్తిగత ఆదాయ పన్ను 17.2 శాతం వృద్ధి చెందాయి. రీఫండ్‌లను పరిగణనలోకి తీసుకున్న అనంతరం వ్యక్తిగత ఆదాయపు పన్నుల వసూళ్లలో నికరంగా 14.8శాతం వృద్ధి ఉండగా, కార్పొరేట్ పన్ను వసూళ్లు 16శాతం పెరిగాయి. ఏడాది క్రితం వసూళ్లలో ఆదాయం వెల్లడి పథకం కింద వచ్చిన రూ.10.844 కోట్లు ఉన్నాయని, ఈ ఆర్థిక సంవత్సరంలో అవి లేవని ఆర్థిక శాఖ పేర్కొంది.

పసిడి వెంట రజతం ధగదగలు



ఢిల్లీ: పసిడి, వెండి ధరలు పెరిగాయి. సోమవారం కొనుగోలుదారుల అండతో బంగారం ధర పెరిగింది. రూ.150 పెరగడంతో పది గ్రాముల బంగారం ధర రూ.32,650కి చేరింది. అంతర్జాతీయ పరిణామాలు, డాలరు విలువ పడిపోవడంతోపాటు బంగారు ఆభరణాల తయారీదారుల దగ్గర నుంచి డిమాండ్ ఊపందుకోవడంతో పసిడి ధర పుంజుకున్నట్లు బులియన్ మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. పసిడి బాటలోనే వెండి పయనిస్తోంది. గత వారం స్వల్పంగా తగ్గిన వెండి ధర మళ్లీ పుంజుకొని రూ.40వేల మార్క్‌ను దాటింది. రూ.410 పెరగడంతో కేజీ వెండి రూ.40,010కి చేరింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల దగ్గర నుంచి డిమాండ్ రావడంతో వెండి ధర పెరిగినట్లు ట్రేడర్లు చెబుతున్నారు. అటు అంతర్జాతీయంగా పసిడి ధర పెరుగుదలను నమోదు చేసుకుంది. న్యూయార్క్ మార్కెట్‌లో బంగారం ధర 0.33శాతం పెరగడంతో ఔన్సు 1,289.50 డాలర్లు పలుకుతోంది.

ఎరిక్సన్ పిటిషన్‌పై అనిల్ అంబానీకి సుప్రీం నోటీసులు

- నాలుగు వారాల్లోగా సమాధానం చెప్పాలి: సుప్రీం
- తొలివిడతగా రూ. 118 కోట్లను చెల్లిస్తామన్న ఆర్‌కాం
- మొత్తం చెల్లించాల్సిందేనని తేల్చి చెప్పిన ఎరిక్సన్



ఢిల్లీ: రిలయన్స్ కమ్యూనికేషన్స్ చైర్మన్ అనిల్ అంబానీకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎరిక్సన్ ఇండియా దాఖలు చేసిన కోర్టు ధిక్కార పిటిషన్‌పై స్పందన కోరుతూ సోమవారం నోటీసులు జారీ చేసింది. దీనికి నాలుగు వారాల్లోగా సమాధానం చెప్పాల్సిందిగా జస్టిస్ ఆర్.ఎఫ్. నారిమన్ నేతృత్వంలోని ధర్మాసనం అంబానీ, ఇతరులను ఆదేశించింది.

అయితే బకాయి కింద రూ.118 కోట్లను అంగీకరించాల్సిందిగా ఆర్‌కాం తరఫున వాదించిన న్యాయవాదులు కపిల్ సిబల్, ముకుల్ రోహతగి కోర్టును కోరారు. అయితే ఎరిక్సన్ దీనికి ససేమిరా అంది. మొత్తం బకాయిని డిపాజిట్ చేయాలని తేల్చి చెప్పింది. దీంతో కోర్టు రిజిస్ట్రీలో రూ. 118 కోట్ల డిమాండ్ డ్రాఫ్ట్‌ను డిపాజిట్ చేయాల్సింగా ఆర్‌కాంను కోరింది.

అలాగే రిలయన్స్ జియోతో కూర్చొని చర్చించి సమస్యను పరిష్కరించుకోవాల్సిందిగా ఆర్‌కాంకు నారిమన్ సూచించారు. పరస్పరం సమస్యను పరిష్కరించుకోని పక్షంతో తామేమి చేయలేమని వ్యాఖ్యానించారు. మరోవైపు స్పెక్ట్రమ్ ట్రేడ్ మార్గదర్శకాలకు కట్టుబడి ఆర్‌కాం కొనుగోళ్లపై సిద్ధంగా ఉన్నారా అని జియోను కూడా కోర్టు ప్రశ్నించింది. అయితే ముందస్తు బకాయిలతో ఉన్న సమస్యల నేపథ్యంలో, ఆర్‌కాంకు ఫిజికల్ గ్యారంటీ ఇచ్చేందుకు తాము సిద్ధంగా లేమని జియో సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే కోర్టుకు తెలిపారు. స్వీడిష్ టెలికాం పరికరాల తయారీదారు ఎరిక్సన్ ఇటీవల ఆర్‌కాంపై కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసింది. అనిల్ అంబానీని అరెస్టు చేయాలని, దేశం విడిచి పారిపోకుండా నియంత్రించాలంటూ ఎరిక్సన్ సుప్రీంకోర్టును ఆశ్రయిం చింది. తమకు చెల్లించాల్సిన రూ.550 కోట్లు చెల్లించకుండా కావాలని తాత్సారం చేస్తోందని ఆరోపించింది. బకాయిల చెల్లింపునకు వ్యక్తిగతంగా హామీ ఇచ్చిన అనిల్ అంబానీ గడువు తీరినా స్పందించడం లేదని, తద్వారా కోర్టు గడువును కూడా ఉల్లంఘించారని ఎరిక్సన్ తన పిటిషన్‌లో పేర్కొన్న సంగతి తెలిసిందే.



నగదు కొరత సమస్యపై చర్యలు తీసుకుంటాం

- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్

ఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థలో నగదు కొరత సమస్య ఉంటే.. దానిపై భారత రిజర్వు బ్యాంకు తగిన చర్యలు తీసుకుం టుందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ అన్నారు. ప్రస్తుతానికి నగదు నిల్వల సమస్య చాలా వరకు తీరిందని వెల్లడించారు. సోమవారం శక్తికాంత్ ఢిల్లీలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగదు కొరత సమస్య తగ్గిందని, తరచూ ఈ అంశంపై సమీక్ష చేస్తున్నామని చెప్పారు. రేపు శక్తికాంత్ బ్యాంకింగేతర ఫైనాన్షియల్ కంపెనీలతో సమావేశం కానున్నట్లు తెలిపారు.సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పునర్నిర్మాణం కోసం వచ్చే రుణాల దరఖాస్తుల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని శక్తికాంత్ బ్యాంకులకు సూచించారు. ఆర్థిక వ్యవస్థలోకి నగదును పంపించడం అవసరాలను బట్టి ఉంటుందని, ఆర్బీఐ తగినంత నగదు నిల్వలను ఉంచుతుందని ఆయన పేర్కొన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థ డబ్బు కోల్పోవడాన్ని ఆర్‌బీఐ ఇష్టపడదని ఆయన వెల్లడించారు.

లాభాలతో ముగిసిన మార్కెట్

ముంబయి: దేశీయ సూచీలు ఈ వారాన్ని లాభాలతో ప్రారంభించాయి. సోమవారం భారీ లాభాలతో ప్రారంభించిన స్టాక్ మార్కెట్లు మధ్యాహ్నం సమయానికి అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయినప్పటికీ చివరకు మాత్రం లాభాలతోనే ముగించాయి. నిఫ్టీ 10,800 మార్క్ దిగువన స్థిరపడింది. లోహ, ఫార్మా, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు జరగడంతో అవి నష్టాల బారిన పడ్డాయి. ఈరోజు ఉదయం సెన్సెక్స్ 260 పాయింట్లకు పైగా లాభాలతో ప్రారంభం కాగా.. నిఫ్టీ 10,800 పాయింట్ల పైన ట్రేడ్ అయ్యింది. లోహ, ఆటోమొబైల్, వినియోగ, ఫైనాన్షియల్ రంగాల షేర్లు లాభాలను ఆర్జించడంతో స్టాక్ మార్కెట్ జోరుగా కదలాడింది. సెన్సెక్స్ 155.06 పాయింట్లు లాభపడి 35,850.16 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ 10,800 బెంచ్ మార్క్‌ను కోల్పోయి 44.45 పాయింట్ల లాభంతో 10,771.80 వద్ద స్థిరపడింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో టీసీఎస్, ఇన్ఫోసిస్, మారుతీ, యాక్సిక్ బ్యాంక్, ఇన్ఫ్రాటెల్, టాటా మోటార్స్, టైటాన్ షేర్లు లాభాలను ఆర్జించగా.. బజాజ్ ఫైనాన్స్, డా.రెడ్డీస్, యస్ బ్యాంక్, హిందాల్కో, కోల్ ఇండియా, బజాజ్ ఆటో షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి.



స్పోర్ట్స

అందని ద్రాక్షను.. అందుకున్న కోహ్లీ సేన

- 72ఏళ్ల తర్వాత ఆసీస్ గడ్డపై సిరీస్‌ను వశం చేసుకున్న భారత్
- నాలుగో టెస్ట్ డ్రా..
- 4 టెస్ట్‌ల సిరీస్‌లో 2–1 తేడాతో కోహ్లీ సేన కైవసం
- పుజారాకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్



సిడ్నీ: భారత క్రికెట్ జట్టు సరికొత్త చరిత్ర అధ్యాయాన్ని లిఖించింది. తన టెస్టు క్రికెట్ చరిత్రలో తొలిసారి ఆస్ట్రేలియాలో సిరీస్ గెలిచిన టీమిండియా కొత్త చరిత్ర సృష్టించింది. ఇంగ్లండ్‌తో జరిగిప సిరీస్‌లో పరాభవం చవిచూసిన టీంఇండియా ఆ సిరీస్ ఓటమి తర్వాత ఎన్నో విమర్శలను ఎదుర్కొంది. భారత ఆటగాళ్లు స్వదేశంలో పులులు, విదేశాల్లో పిల్లులు అని అనేక మంది మాజీ క్రికెటర్లు టీం ఇండియాను గేలిచేశారు. కానీ వాటిని ఏమీ పట్టించుకోకుండా కోహ్లీ సేన ఆసీస్ సిరీస్‌కు పయనమయ్యింది. బలమైన ప్రత్యర్థిని ఎదుర్కోవడానికి అన్ని విధాల సంసిద్ధం అయ్యింది. మొదటి రెండు టెస్టులలో టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్స్ ఘోరంగా విఫలగమైనా.. బౌలర్లు మాత్రం తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా ప్రతీ ఇన్నింగ్స్‌లోనూ ఆసీస్ బ్యాట్స్‌మెన్స్ భరతం పట్టారు. పెర్త్ టెస్ట్‌లో ఓడినప్పటికీ, మెల్‌బోర్న్ టెస్ట్‌లో అద్వితీయమైన విజయం సాధించి ఏకంగా సిరీస్ నే కైవసం చేసుకుంది. నాలుగో టెస్ట్‌లో భారత్‌కు 316 పరుగుల ఆధిక్యం.. పిచ్ పరిస్థితిని బట్టి చూస్తే ఆసీస్ మూడు సెషన్ల పాటు బ్యాటింగ్ చేయడం కష్టమే.. అయితే చివరి రోజు ఆట సజావుగా సాగుతుందా? లేదా? అని అంతా అనుకుంటున్న సమయంలో సిడ్నీలో అద్భుతాలేమీ జరగలేదు. అందరూ ఊహించినట్లుగానే ఈ టెస్టులో వరుణుడిదే పైచేయి అయింది. ఫలితంగా నాలుగు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా– భారత్ మధ్య జరిగిన చివరి టెస్టు డ్రాగా ముగిసింది. దీంతో కోహ్లీ సేన 21 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో అద్భుత సెంచరీ సాధించడంతో పాటు సిరీస్ ఆసాంతం రాణించిన పుజారాకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు దక్కాయి. నాలుగోరోజు 236/6తో ఆట కొనసాగించిన ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 300 పరుగులకు ఆలౌటైంది. కుల్దీప్ యాదవ్ (5/99) ఐదు వికెట్లతో చెలరేగాడు. 322 పరుగుల ఆధిక్యం దక్కడంతో కోహ్లీ ఆసీస్‌కు 'ఫాలోఆన్' ఆడించాడు. అయితే, వర్షం, వెలుతురులేమి కారణంగా 25.2 ఓవర్ల ఆట మాత్రమే జరగడంతో ఆసీస్ పోరాటం చివరి రోజుకు చేరింది. కానీ, చివరి రోజు మొత్తం వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్ ప్రారంభం కాలేదు. వర్షం ఎంతకీ తగ్గకపోవడంతో అంపైర్లు ఐదో రోజు ఆటను రద్దు చేశారు. దీంతో నాలుగో టెస్టు డ్రాగా ముగిసింది. దీంతో భారత్ సిరీస్ నెగ్గింది. చివరి రోజు ఆసీస్‌ను దెబ్బకొట్టి 3–1తో సిరీస్ విజయాన్ని దక్కించుకోవాలనుకున్న భారత్‌ను వరుణుడు దెబ్బకొట్టాడు.

అడిలైడ్‌లో జరిగిన తొలి టెస్ట్‌లో 31 పరుగుల తేడాతో టీమిండియా విజయం సాధించగా, పెర్త్‌లో జరిగిన రెండో టెస్టులో ఆసీస్ 146 పరుగుల తేడాతో గెలుపును అందుకుంది. ఆపై మెల్‌బోర్న్ టెస్ట్‌లో 137 పరుగుల తేడాతో భారత్ విజయం సాధించి ఆధిక్యంలో నిలిచింది. ఈ సిరీస్‌లో చతేశ్వర్ పుజారా 521 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, బౌలింగ్ విభాగంలో బుమ్రా (21 వికెట్లు) అగ్రస్థానంలో నిలిచాడు. ఇక మహ్మద్ షమీ 16 వికెట్లు, ఇషాంత్ శర్మ 11 వికెట్లు తీశారు. ఈ సిరీస్ విజయంతో భారత్ 72 ఏళ్ల రికార్డును బ్రేక్ చేసింది. టీమిండియా 1947లో తొలిసారి ఆస్ట్రేలియాలో పర్యటించింది. అప్పటి నుంచి పదిసార్లు అక్కడ పర్యటించింది. ఇప్పటి వరకు మొత్తంగా ఎనిమిది సార్లు ఓడితే, మరో మూడు సార్లు 'డ్రా' చేసుకొని రావడం తప్ప ఒక్కసారి కూడా సిరీస్ గెలుపు రుచి చూడలేదు. ఈ రికార్డును ఇప్పుడు కోహ్లీ సేన బ్రేక్ చేసింది. అలాగే, ఇప్పటి వరకు ఆస్ట్రేలియా గడ్డపై ఆడిన 47 టెస్టుల్లో భారత్‌కు 7 విజయాలు దక్కాయి. అంతేకాదు, ఈ సిరీస్‌లో భారత్ ఎన్నో రికార్డులను నమోదు చేసింది. అలాగే ఈ సిరీస్ ద్వారా రిషబ్ రూపంలో మంచి కీపర్.. బూమ్రా రూపంలో పేస్‌కు నాయకుడు దొరికారు. అలాగే విదేశాల్లో మంచి రికార్డు లేని పుజారా రాణించడం గొప్ప పరిణామం.

స్కోరు వివరాలు : భారత్ తొలి ఇన్నింగ్స్ 662/7 డిక్లేర్డ్, ఆసీస్ తొలి ఇన్నింగ్స్ – 300, ఆసీస్ రెండో ఇన్నింగ్స్ – 6/0.

ఈ విజయం 2011 ప్రపంచ కప్ కంటే గొప్పది: కోహ్లీ

సిడ్నీ: ఈ విజయం నా కెరీర్‌లో ఎంతో ఉత్తమమైనది. భారత్ ప్రపంచ కప్ గెలిచినప్పుడు.. ఆ జట్టులో నేను చిన్నవాడిని. ఆ సమయంలో జట్టులోని ప్రతి ఒక్కరూ విజయంతో ఎంతో భావోద్వేగానికి గురవడం నేను చూశా. అయితే నేను అప్పుడు అలా ఫీల్ కాలేకపోయా. ఇక్కడికి మూడుసార్లు వచ్చిన అనంతరం విజయం ఎంత కఠినమో తెలిసొచ్చింది. నేను టెస్టు కెప్టెన్‌గా ఆస్ట్రేలియా గడ్డపైనే బాధ్యతలు చేపట్టా. ఇక్కడి నుంచే మార్పు ప్రారంభమైంది. ఇప్పుడు ఈ విజయం ఎంతో ప్రత్యేకమైనది' అని కోహ్లీ అన్నాడు. మా ఆటగాళ్లను చూసి నేను ఎంతో గర్వపడుతున్నా. ఇది వారి విజయమే. ముఖ్యంగా బౌలర్లు ప్రదర్శించిన ఆధిపత్యం గతంలో ఎప్పుడూ నేను చూడలేదు. ఇక్కడే కాదు ఇంగ్లాండ్, దక్షిణాఫ్రి కాల్లో కూడా బౌలర్లు మెరుగైన ప్రదర్శన చేశారు. ఈ విజయం యువ జట్టుకు ఒక పునాది రాయి లాంటిది. అని విరాట్ కోహ్లీ అన్నాడు.



విజయంతో భారత్ మైలురాళ్లు

- 72 ఏళ్ల తర్వాత ఆసీస్ గడ్డపై భారత్‌కు తొలి సిరీస్ విజయం ఇదే. గతంలో 1980–81, 1985–86, 2003–04 పర్యటనల్లో భారత్ సిరీస్‌ను డ్రా చేసుకుంది. ఇప్పటి వరకు ఆస్ట్రేలియా గడ్డపై ఆడిన 47 టెస్టుల్లో భారత్‌కు 7 విజయాలు దక్కాయి.
- ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ గెలిచిన తొలి ఆసియా కెప్టెన్ విరాట్ కోహ్లీనే. (దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల్లో భారత్ సిరీస్ విజయాలను నమోదు చేసింది.
- 1967/68లో న్యూజిల్యాండ్‌లో 3–1 తేడాతో విజయం
- 1971లో ఇంగ్లాండ్‌లో 1–0 తేడాతో విజయం
- 1986లో ఇంగ్లాండ్‌లో 2–0 తేడాతో విజయం
- 2007లో ఇంగ్లాండ్‌లో 1–0 తేడాతో విజయం
- 2008/09లో న్యూజిలాండ్‌లో 1–0 తేడాతో విజయం
- 2018/19లో ఆస్ట్రేలియాలో 2–1 తేడాతో భారత్ సిరీస్ విజయాలను సొంతం చేసుకుంది.

విరాట్ కోహ్లీ నేతృత్వంలో విదేశీ గడ్డపై సిరీస్ విజయాలు..

- 2015లో శ్రీలంకలో 2–1 తేడాతో విజయం
- 2016లో వెస్టిండీస్‌లో 2–0 తేడాతో విజయం
- 2017లో శ్రీలంకలో 3–0తేడాతో విజయం
- 2018/19 ఆస్ట్రేలియాలో 21 తేడాతో విజయం సాధించింది.

కోహ్లీ సేనపై భారత రాష్ట్రపతి ప్రశంస

ఢిల్లీ: ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ గెలవాలన్న దశాబ్దాల కల నెరవేరడంతో క్రికెట్, సినీ, రాజకీయ ప్రముఖులు కోహ్లీసేనపై ట్విటర్‌లో ప్రశంసల వర్షం కురిపించారు. భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ టీమిండియాకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. 'ఆస్ట్రేలియాలో తొలి సారిగా టెస్టు సిరీస్‌ను గెలిచినందుకు కోహ్లీ సేనకు శుభాభినందనలు. టీమిండియా ఆల్‌రౌండ్ ప్రతిభ మమ్మల్ని గర్వపడేలా చేసింది. దీన్నే అలవరచుకోండి' రామ్‌నాథ్ కోవింద్, భారత రాష్ట్రపతి.

Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal – Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD–500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.